# స్మృతికాలపుస్త్రీలు.

# WOMEN IN THE SMṚTIS.

గ్రంథకర్త

జటావల్లభుల పురుషోత్తము ఎం. ఏ.

ప్రకాశకులు

ఆంధ్రగీర్వాణ విద్యాపీఠపక్షమున

వల్లూరి సూర్యనారాయణరావుగారు.

1935.

[వెల 0—10—0]

# కృతి సమర్పణమ్

విరచ్యాహమిమంగ్రన్థం స్మృతిత్రిస్థితిబోధకం
పురుషోత్తమనామాచ జటావల్లభవంశజః
సమర్పయామి మేపిత్రే మత్సర్వస్వాన్య హేతవే
యోజీవిత్వాద్విషష్ట్యబ్దాన్ భావవర్షేదివంగతః
యజుర్వేదోఽఖిలఃకృత్స్నో యస్యకణ్ఠే సదాస్థితః
యశ్చాపిప్రథితోలోకే శ్రౌతతంత్రవిశారదః
పణ్డితో దేవభాషాయాం జ్యౌతిషే గృహ్యకర్మసు
తద్దైవతత్త్వవిద్యాయాం లౌకికేషుచ కర్మసు
అష్టావింశతివర్షాణి దేవంయో వేఙ్కటేశ్వరమ్
వాడవల్యాం స్థితందక్షో ధర్మకర్తాహ్యసేవత
శమాదిగుణయుక్తోయో యోధీరఇతివిశ్రుతః
యశ్చాపిమాని తస్సర్వై ర్యశ్చాస్మత్కులదీపకః
యఃకృష్ణసోమయాజీతి ఖ్యాతో లోకేమహాయశాః
ఆత్రేయపురవాసీచ విప్రో గౌతమ గోత్రజః॥

# సంపాదకుని తొలిపలుకు

ఈ గ్రంథమును, దీనికి పూర్వము వెలువడిన "వేదకాలపు స్త్రీలు" అను గ్రంథమును చదివి, వానిలోని విషయములను జాగ్రతగ పరిశీలించువారికి, మన భారతదేశములోని ఆర్యులలో, సాంఘికధర్మము లితర మానవసంఘములలో వలెనే, యెట్లు మారుచుండెనో స్పష్టముగ తెలియగలదు. సనాతనధర్మములనగా అనాది ధర్మములనియు, అవి, సత్యము, అహింస మొదలగు నైతికధర్మములుగాని, కేవలము లౌకికములైన సాంఘికధర్మములు కావనియు, శాస్త్రీ కృష్ణాచార్యులు మొదలగు పండితుల యభిప్రాయము. తక్కిన వారిలో కొందరు, మన పూర్వమతగ్రంథములగు శృతిస్మృతి పురాణేతిహాసములలో చెప్పబడిన ధర్మములన్నియు, సనాతనధర్మములే యనియు, వీనిలో పైకి కన్పడు పరస్పరవిరుద్ధములు సమర్థించుకొనజాలకుండుటకు, కారణము మన నవనాగరికుల యసమర్థతయే యనియు, యీ ధర్మములన్నియు అనుల్లంఘనీయములనియు వాదించెదరు. సనాతనధర్మపరుల మని చెప్పుకొనువారి యీవాదన నెంతగా ఖండించినను నది

యక్కడక్కడ తనతలను యెత్తుచునే యుండును. గనుక, మేముకూడ మా శక్తికొలది దీనిని ప్రతిఘాతము గావింపఁ బ్రయత్నించుచుందుము. కాశీకృష్ణాచార్యులుగారి అనాది సిద్ధములైనవను వైదికధర్మములు కూడ, పరిణామమువలన యేర్పడినవేగాని, మానవులు, మొట్టమొదట క్రిందితరగతుల జీవులనుండి ఉద్భవమైనపుడు యెట్టిధర్మములు లేనేలేవనియు జెప్పుడను వాడొకడున్నను ఆయన మన మనఃఫలకములమీద యెన్నడు, యెట్టిధర్మములు వ్రాసియుండలేదనియు, వివిధ మానవసంఘములలో వాని యభివృద్ధి కొఱకు దేశకాలములనుబట్టి, అనేకరకములగు మతసాంఘికధర్మములు బయలుదేరినవనియు, ప్రపంచములోని అనాగరికజాతుల సాంఘికచరిత్రవలన స్పష్టపడుచున్నది. ఇంతయేల? మానవకోటిలో ప్రస్తుతి మందవలంబించబడుచున్న వివిధమతాచారములన్నియు, మానవకల్పితములే యనియు, వేదాంతసూత్రములన్నియు, వట్టి ఊహాజన్యములనియు నా నిశ్చితాభిప్రాయము. దీనినెల్లపుడు, మతసాంప్రదాయములలో చిక్కుకొను మన భారతీయులకు నచ్చజెప్పి, వారి మూఢవిశ్వాసములను పారద్రోలి, మానవసౌభ్రాతృత్వమునకు వీరిని పురిగొల్పుటయే నా యాశయము. ముఖ్యముగా మనయాంధ్రులు, సంఘసంస్కరణములందు, ఈ ప్రపంచములోని తక్కిన మానవసంఘములతో

సంపూర్ణసానుభూతి చూపించుచు, ముందంజవైచుటకు, కొం
తవరకు తోడ్పడవచ్చుననియే మన పూర్వగ్రంథములలోని
మతసాంఘిక సూత్రములను, ఉన్నవి ఉన్నట్లు, నిష్పక్షపాత
బుద్ధితో తెలుపుచుందుము. మనలో వ్యక్తిభిన్నాభిప్రాయ
ములు పూర్వకాలమునుండి యున్నను, మేము వానిలో నే
వియును దాచము. మతసాంఘికాచారము లన్నియు మానవ
కల్పితములే యని మా వాదనయైనపుడు, మాకు రుచించని
వైనను దాచవలసినంత భయము మా కేల ? ఏ గ్రంథము
గాని అపౌరుషేయమనిగాని, అనుల్లంఘనీయమని గాని, పవి
త్రమనిగాని మేమెంచనపుడు, దానిలోని విషయములను
వ్యక్తీకరించుటలో మాకు దాపరికముండవలసిన పని లేదు. మన
మూఢమత విశ్వాసములేగాక, మన నైతికధర్మములు కూడ
ప్రకృతియంతయు వలెనే, పరిణామజన్యములనియే మేము
నొక్కి చెప్పుచున్నాము. మా విద్యాపీఠములో, తక్కిన మత
గ్రంథములతో పాటు, మన వేదశాస్త్రములను కూడ స్తవ
శల్యపరీక్ష చేసి విమర్శించ సాహసించుచున్నాము. ఇంతమా
త్రముచేత, వానియందును, ఆ గ్రంథకర్తలయందును మాకు
గౌరవము లేదని భావించరాదు. వానిలోని విషయములు
భగవంతుని నోటనుండి వెలువడినవనియు, అవి పరమప్రమాణ
మనియు, వాదించువారితో మేమేకీభవించము. ప్రస్తుత మత

సాంఘిక సాంప్రదాయముల పునాదులనే విమర్శించి, ఖండించుచున్నగాని, మానవసౌభ్రాతృత్వము దుర్లభముగనుక, నైతికధర్మములు కూడ, మానవసంఘాభివృద్ధికై యెట్లు పరిణామమును పొందెనో, పొందుచున్నవో తెలుపుట, యీ విద్యాపీఠమువారి ముఖ్యాశయము—అహింసాసత్యములు మొదలగు ధర్మములు, నిత్యములు, అనాదులు కావనియు, వీనిలో కూడ సూక్ష్మస్థూలభేదములుండి తీరుననియు, యివన్నియు, సర్వకాలసర్వావస్థలయందును అనుల్లంఘనీయములని యెంచ కూడదనియు, మన పురాతనవైదిక గ్రంథములే చాటుచున్నవి. వీనినన్నిటిని మరియొక గ్రంథములో తెలిపెదము.

పై పునాది సూత్రముల నంగీకరించువారు, తమసాంఘిక సౌఖ్యమునకు గాను, యెట్టి మతాచారము నవలంబించి, తమకు నచ్చిన యే సంఘములో చేరియున్నను, తమలో తమకు తగవు లుండవలసిన పనియేలేదు. మానవుడు సాంఘికజీవియగుటవలన, కొన్ని మతసాంఘిక సాంప్రదాయములతో కూడుకొన్న యే సంఘములో నైనను తాను చేరియుండక తప్పదు. కాని, యితనికి, పరమతములమీద అసహనము, అన్యమత స్వీకరణనిరసనము, మతావేశము, దురభిమానము, మూర్ఖపక్షపాతము మొదలగు దుర్గుణములుండవు. ఇతను,

తనసౌఖ్యమునకు ఒక సంఘములో చేరవలసియుండుటచేత, దాని కట్టుబాట్లకు లోబడియున్నానని, యనుకొనును గాని, అవి దైవనిర్మితములని యెంచడు. ఇట్టి దృక్పథము మనకు కలిగినపుడే, మనము యే సంఘములో చేరియున్నను, ప్రస్తుత మతకలహములను నిరసించుచు, సోదరభావముతో మెలగ గలము.

కొవ్వూరు
3—10—35

వల్లూరి సూర్యనారాయణరావు
సెక్రటరీ
ఆంధ్రగీర్వాణవిద్యాపీఠము

# ఉపోద్ఘాతము.

భారతదేశ చరిత్రలో వివిధకాలములలో స్త్రీలస్థితి యెట్లుండెనో తెల్పు గ్రంథములను వ్రాయుటకై నేను సంకల్పించుకొనినట్లు నేనిదివఱలో రచించియుండిన "వేదకాలపు స్త్రీలు" అను గ్రంథముయొక్క యుపోద్ఘాతములో చెప్పియున్నాను. ఆగ్రంథముల ప్రయోజనమును వాని రచనావిధానమును గూడ నట వివరించియుంటిని. అప్పటికే నేను స్మృతికాలపు స్త్రీలను గూర్చి కూడ కొంత పరిశోధనము చేసియుంటినని కూడ తెల్పితిని. ఈలోపున నాపరిశోధన పూర్తియై తత్ఫలితముగ నీగ్రంథము వెల్వడుచున్నది.

ఋషులచే వ్రాయబడిన ధర్మశాస్త్ర గ్రంథములకే స్మృతులని పేరు. వేదములను మనస్సుననిడికొని వీనిని ఋషులు స్మరించుటచేతనే (శ్రుతింపశ్యన్తి మునయః స్మరన్తి చ తథా స్మృతిం) వీనికి స్మృతులను నామమువచ్చినదని మనవారు చెప్పియున్నారు. ధర్మశాస్త్ర ప్రవర్తకులైన ఋషుల నామములు యాజ్ఞవల్క్యస్మృతిలో నీయబడినవి.

మన్వత్రివిష్ణుహారీత యాజ్ఞవల్క్యోశనాంగిరాః
యమాపస్తంబసంవర్తాః కాత్యాయనబృహస్పతీ
పరాశరవ్యాస శంఖలిఖితా దక్షగౌతమా
శాతాతపో వసిష్ఠశ్చ ధర్మశాస్త్రప్రయోజకాః

యాజ్ఞ. 1—4, 5

పరాశర స్మృతిలో గూడ కొందఱు స్మృతికారులు పేర్కొనబడి యున్నారు.

శ్రుతామే మానవాధర్మా వాసిష్ఠాః కాశ్యపా స్తథా
గార్గేయా గౌతమీయాశ్చతథా చౌశనసాఃశ్రుతాః
అత్రేర్విష్ణోశ్చ సంవర్తాద్దక్షా దంగిరస స్తథా
శాతాతపాచ్చహారీతా ద్యాజ్ఞవల్క్యాత్తథైవచ
కాత్యాయన కృతాశ్చైవతథా ప్రాచేతసాన్మునేః

(పరాశర. 1—13,14,15)

ఇట్లు పరాశరయాజ్ఞ వల్క్యులచే పేర్కొన బడిన స్మృతికారుల సంఖ్య యిఱువదిరెండని తేలుచున్నది; (1) మనువు (2) అత్రి (3) విష్ణువు (4) హారీతుడు (5) యాజ్ఞవల్క్యుడు (6) ఉశనుడు (7) ప్రాచేతసుడు (8) యముడు (9) ఆపస్తంబుడు (10) అంగిరసుడు (11) సంవర్తుడు (12) కాత్యాయనుడు (13) బృహస్పతి (14) పరాశరుడు (15) శంఖుడు (16) లిఖితుడు 17) దక్షుడు (18) గౌతముడు (19) శాతాతపుడు (20) వసిష్ఠుడు (21) కశ్యపుడు (22) గర్గుడు.

వీరుకాక యీక్రిందివారుకూడ స్మృతికర్తలుగ నితర గ్రంథములలో నుదాహరింపబడియున్నారు; (23) వృద్ధపరాశరుడు (24) దేవలుడు (25) బుధుడు (26) పులస్త్యుడు (27) నారదుడు (28) బోధాయనుడు.

ఈ యిఱువది యెనిమిది స్మృతులలోను గర్గవిష్ణు దేవల పుల స్త్యకాశ్యపప్రాచేతస స్మృతులను దక్క మిగిలినవాని నన్నిటిని పరిశోధించియే నే నీగ్రంథమును వ్రాసియున్నాను. ఈ దేవలాదిస్మృతులు ప్రస్తుతము లభ్యములు కాకుండుటయే వీనిని వదలివైచుటకు కారణము. దేవలస్మృతి యను పేర నొకస్మృతి యిపుడుగలదు. కాని యది సరియగు దేవలస్మృతి కాదని యందఱు నంగీకరించియున్నారు. పైన పేర్కొనబడిన స్మృతులనే కాక హిరణ్యకేశి బోధాయనాపస్తంబాది విరచితములైన గృహ్యసూత్రములను కూడ పరిశోధించి యందు స్త్రీలనుగూర్చి గల యంశములను గూడ తీసికొంటిని. కొందఱు ధర్మశాస్త్రకారులే గృహ్యసూత్రములను గూడ వ్రాసియున్నారు. గృహ్యసూత్రములు కూడ స్మృతులవలెనే ప్రమాణములు.

పై గ్రంథము లన్నిటిని మూలములోనే పరిశోధించితిని కాని భాషాన్తరీకరణములను తీసికొనలేదు. వీని నర్థము చేసికొనుటలో ముఖ్యముగ స్వబుద్ధినే యుపయోగించితిని. భావక్లిష్టముగ నున్నచోటులలోను కొన్ని యితరస్థలములలోను వ్యాఖ్యానములను జూచియున్నను మూలగ్రంథాధారము లేకుండ వ్యాఖ్యాత లేమిచెప్పినను నేను తీసికొనలేదు.

కొన్ని స్థలములలో వ్యాఖ్యాతలు చేసిన యర్థములకు భిన్నముగ కూడ నర్థము చెప్పితిని.

హిందువులకు శ్రుతులకు బిమ్మట స్మృతులే యెక్కుడు ప్రమాణము లగుటచేతను, కాలములో గూడ నివి వేదముల కంటె నర్వాచీనములే కావునను నా పరిశోధనకు వేదకాలపు స్త్రీలకు బిమ్మట స్మృతికాలపు స్త్రీలను తీసికొంటిని. స్మృతి వాఙ్మయమారంభమైనది మొదలంతమగు వఱకును నడుమ చాలకాలము కలదనియు నీ కాలములో ననేకములగు నితర విధములగు వాఙ్మయములు గూడ బయలుదేరినవనియు స్పష్టముగ తెలియుచున్నది కాన స్మృతియుగమని మనము దేనిని చెప్పలేము. ప్రథమచరమస్మృతులకు నడుమ చాలకాలము గడచెనను నంశమును మన ప్రాచీనులును నవీనులును గూడ నంగీకరించియున్నారు. ఇఱువురి మతములలోను గూడ మనుస్మృతి ప్రథమమును (ఆ మనుస్మృతి చాలమారి ప్రస్తుతమను స్మృతియైనదని నవీనులు చెప్పుదురు) పరాశరస్మృతి చరమమునై యున్నవి. మిగిలిన వీ నడుమకాలమున రచింపబడినవి. కల్పారంభమున మనుస్మృతియు కల్యారంభమున పరాశరస్మృతియు రచింపబడినవని యా స్మృతులలోనే కలదు. మఱియు త్రేతాయుగములో గౌతమస్మృతియు, ద్వాపరములో శంఖలిఖితస్మృతియు రచింపబడినవని పరాశరస్మృతి చెప్పు

చున్నది. కాన మన ప్రాచీనులదృష్టిలోకూడ స్మృతులన్నియు నొకేకాలమున రచింపబడలేదు. ఆధునికులు స్మృతుల కింత ప్రాచీనతయొప్పరు. ప్రస్తుతస్మృతులలో ప్రాచీనతమమైన గౌతమధర్మసూత్రము క్రీ. పూ. ఏడవశతాబ్దముననూ, నర్వాచీనతమమైన పరాశరస్మృతి క్రీ. శ. పదమూడవశతాబ్దమునను రచింపబడినవని వారందురు. ఈ రెండువేల సంవత్సరముల కాలములోను నప్పుడప్పుడు దేశములో గల్గుచుండిన యాచారపరిణామముల ననుసరించి యాయాస్మృతులు వ్రాయబడు చుండినవని విమర్శకుల యభిప్రాయము.

మన ప్రాచీనులుకూడ నొక్కొకస్మృతి యొక్కొక యుగమునకు ముఖ్యప్రమాణమనిరి. మను గౌతమశంఖలిఖిత పరాశరస్మృతులు కృతత్రేతాద్వాపరకలియుగములలో ముఖ్య ప్రమాణములు. ఈ నియమమునకు లోబడి స్మృతులన్నియు సమప్రమాణములే. ఆధునికవిమర్శకులు కొన్నిస్మృతులకు కాలనిర్ణయము చేసియున్నారు. ఆ నిర్ణయము లిట్లున్నవి. గౌతముడు క్రీ. పూ. 600. బోధాయనుడు క్రీ. పూ. 550. హిరణ్యకేశి క్రీ. పూ. 500. ఆపస్తంబుడు క్రీ. పూ. 500. ప్రస్తుతమనుస్మృతి క్రీ. పూ. 200. మొదలు క్రీ. శ. 100. లోపున. సంవర్తుడు క్రీ. పూ. 200. యాజ్ఞవల్క్యుడు క్రీ. పూ. 100 కిని క్రీ. శ. 200. కును నడుమ. బృహస్పతి క్రీ. శ. 200.

హారీతుడు క్రీ. శ. 400 కును 700 కును నడుమ. పరాశరుడు క్రీ. శ. 1200. పరాశరస్మృతికి పిమ్మట పుట్టిన ధర్మశాస్త్ర గ్రంథములన్నియు వ్యాఖ్యానములో నిబంధన గ్రంథములో నైయున్నవి.

ముఖ్యముగా పై స్మృతులలో నాయాకాలముల నాటి స్త్రీపరిస్థితులు ప్రతిబింబింపబడినవని చెప్పవచ్చును గాని యందు గల్గు స్త్రీవిషయకవిధి నిషేధవాక్యములన్నియు పూర్తిగ పాటింపబడుచుండెనని చెప్పుటకు వీలులేదు. కాన స్మృతు లాయాకాలముల నాటి స్త్రీ విషయకములగు నాదర్శములను క్రోడీకరించుచున్నవని కూడ చెప్పవలెను. ఈ స్థితులను నాధర్మములును గూడ నీ గ్రంథములో వివరింపబడినవి కాన చారిత్రకదృష్టి కలవారికిని నదిలేక కేవలము స్మృతులలోని ధర్మముల నాచరణలో పెట్టవలెనని కోరువారికిని గూడ నీ గ్రంథముపయోగించును.

నే నీగ్రంథములో నేమి చెప్పినను గూడ నందుల కాధారములగు స్మృతివాక్యములనట నిచ్చియున్నాను. ఆ వాక్యముల స్థలనిర్దేశమును గూడ చేసి వాని యర్థములనుగూడ నిచ్చియున్నాను. నాకు గల స్త్రీ విషయకాభిప్రాయములను స్మృతివాక్యములలోనికి చొప్పించుటకు నే నెచటను యత్నిం

పలేదు. అట్లే నా యాశయములకు భిన్నములగు స్మృతివాక్యములను వేటిని బుద్ధిపూర్వకముగ వదలివేయలేదు. కాన నేను చెప్పినయర్థములలోని లోపములనుగాని నేను వదలివైచిన ముఖ్యములగు స్మృతివాక్యములను గాని యెవరైనను నా దృష్టిపథమునకు తెచ్చుచో నా లోపములను తగువిధమున సవరించుకొందును.

గ్రంథము ముద్రణములోనున్న కాలములో గూడ నడివఱలో నాదృష్టినుండి తప్పిపోయిన కొన్ని స్మృతివాక్యములు నాకు కనబట్టుచుండినందువలనను కొన్నివాక్యములకు నూతనార్థములుస్ఫురించుచుండినందువలనను రెండవప్రూఫులో గూడ చాల సవరణలు చేయుచువచ్చితిని. అన్నిటికిని ఓర్పికపట్టి గ్రంథమును చక్కగ ముద్రించిన శ్రీ సరస్వతీ పవర్ ప్రెస్సు వారికి కృతజ్ఞుడను. గ్రంథము పూర్తిగ ముద్రింపబడిన పిమ్మట గూడ కొలది సవరణలను జేయవలసిన యావశ్యకత నాకు గన్పట్టినది. కాన నొక సవరణలపట్టికను గ్రంథాంతమున వేసితిని. మూలగ్రంథముద్రణము పూర్తియగువఱకును సిద్ధాంతమును చేసికొనకుండ నన్ను కలవరపఱచిన సమావేశన స్త్రీపునర్వివాహ విషయకములగు కొన్ని యంశములను గూడ నిందు చేర్చితిని.

ఈగ్రంథ పరంపర వెలువడుటకు కారణభూతులగు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ పాలకవర్గమువారికిని పుస్తకప్రచురణ నిధిని విద్యాపీఠమునకొసగి మూలకారకులైన మహారాజశ్రీ వల్లూరి సూర్యనారాయణరావు పంతులుగారికిని నాకృతజ్ఞతా వందనము లర్పించుచున్నాను.

కొవ్వూరు
పశ్చిమగోదావరిజిల్లా,
2—10—35.

జటావల్లభుల పురుషోత్తము ఎం. ఏ.
ప్రిన్సిపల్, ఆం. గీ. వి. పీఠము,.
శ్రీ. వా. జో. వే. శా. కళాశాల, కొవ్వూరు.

# విషయసూచిక


| | పుటం. |
|---|---|
| ప్రథమాధ్యాయము : స్త్రీ సంతతి | 1 |
| ద్వితీయాధ్యాయము : వివాహావయస్సు | 15 |
| తృతీయాధ్యాయము : వధూవరార్హతలు | 31 |
| చతుర్థాధ్యాయము : వివాహవిధానము | 49 |
| పంచమాధ్యాయము : దాంపత్యము | 71 |
| షష్ఠాధ్యాయము : పునర్వివాహము | 94 |
| సప్తమాధ్యాయము : కర్మకాండ | 119 |
| అష్టమాధ్యాయము : ధనము | 137 |
| నవమాధ్యాయము : గౌరవము, స్వాతంత్ర్యము | 156 |
| దశమాధ్యాయము : వృత్తి, విద్య. | 174 |
| ఏకాదశాధ్యాయము : వివిధవిషయములు. | 185 |

# స్మృతికాలపు స్త్రీలు

## ప్రథమాధ్యాయము

### స్త్రీసంతతి

అన్నదమ్ములు కల కుమార్తెకును నన్నదమ్ములు లేని కుమార్తెకును ధర్మశాస్త్రములలో విశేషభేదము పాటింపబడినది. అన్నదమ్ములు కల కుమార్తెవలన కంటె నన్నదమ్ములులేని కుమార్తెవలన పితృవంశమున కెక్కుడు లాభము గల్గుచున్నది; కుమారుడేవిధముగ వంశవర్ధకుడగుచున్నాడో యామెయు నావిధముననే వంశవివర్ధిని కాగలదు. కావుననే యామెకు 'పుత్రిక' యనిపేరు. అన్నదమ్ములు గల కుమార్తెకు 'పుత్రిక' యను నామమెచ్చటను వాడబడలేదు. 'సుత' 'దుహిత' మున్నగునామముల చేతనే యామె వ్యవహరింపబడును. ఏమన: పుత్రధర్మ మామెయందు లేదు. పుత్రశబ్ద నిర్వచనము మనుస్మృతిలో నీ క్రిందివిధముగ చేయబడినది.

పున్నామ్నో నరకాద్యస్మాత్త్రాయతే పితరంసుతః
తస్మాత్పుత్ర ఇతిప్రోక్తః స్వయమేవ స్వయంభువా.

(మను 9—138.(

(తండ్రిని పున్నామనరకమునుండి రక్షించుచున్నాడు. కావున పుత్రునకాపేరు స్వయంభువుడు కల్పించినాడు)

అభ్రాతృకయగు దుహితవలన కూడ తండ్రి పున్నామ నరకమునుండి రక్షింపబడవచ్చును గావున నామెకు 'పుత్రిక' యను పేరు వచ్చుచున్నది. ఆమెకీ పుత్రధర్మ మెట్లు వచ్చుచున్నదనగా: అభ్రాతృకన్యను దానము చేయునపుడు తండ్రి వరునితో నీ క్రిందివిధముగ చెప్పును.

అభ్రాతృకాం ప్రదాస్యామి తుభ్యం కన్యామలంకృతాం
అస్యాం యో జాయతే పుత్రస్స మే పుత్రో భవిష్యతి.

(వసి 5—52)

(అలంకృతయగు నభ్రాతృకన్యను నీకిచ్చుచున్నాను. ఈమెయందు నీకు గల్గిన పుత్రుడు నా పుత్రుడే యగును)

ఇచ్చట 'పుత్రః' అను నేకవచనముచేత ప్రథమపుత్రుడే మాతామహునకు పుత్రుడగునని తెలిసికొనవలెను. తర్వాతి పుత్రులు జనకునకే చెందుదురు. ఈ విధముగ నభ్రాతృదుహిత తన పుత్రుని ద్వారమున తనతండ్రిని పున్నామ నరకము నుండి రక్షించుచున్నది కాన నామెకు పుత్రధర్మముగల్గి 'పుత్రిక' యను నామ మామె కన్వర్థమగుచున్నది. దుహిత యీవిధముగ పుత్రికయగుచున్నది.

అపుత్రోఽనేన విధినా సుతాం కుర్వీత పుత్రికాం,

(మను 9—127)

(పుత్రులులేనివాడీ విధానముచే కూతును పుత్రికనుగ జేసికొనవలెను.)

ఇట్టి పుత్రికవలన తండ్రి వంశము వృద్ధియగును. ఈవిధముగ పూర్వ మనేకులు వంశాభివృద్ధిని చేసికొనిరి.

అనేనతు విధానేనపురా చక్రేథపుత్రికాః
వివృద్ధ్యర్థంస్వవంశస్యస్వయందక్షఃప్రజాపతిః
దదౌసదశధర్మాయ కశ్యపాయత్రయోదశ
సోమాయరాజ్ఞేసత్కృత్య ప్రీతాత్మాసప్తవింశతిం

(మను 9—128, 129)

(పూర్వము దక్షప్రజాపతి తన వంశాభివృద్ధికొఱకై విధానముచే పుత్రికలను చేసెను; పదిమంది పుత్రికలను ధర్మునకును, పదమువ్వురను కశ్యపునకును, ఇరువదియేడ్వురను చంద్రునకును గౌరవించి యిచ్చెను.)

ఇట్టి పుత్రికకు కల్గిన పుత్రుడు తల్లికి ముందుగ పిండమును వేయును; పిమ్మట నామెతండ్రికివేయును. మూడవ దాని నామె పితామహునకు వేయును. ఈయంశ మీక్రింది శ్లోకములో చెప్పబడినది!

మాతుఃప్రథమతఃపిండం నిర్వపేత్పుత్రికాసుతః
ద్వితీయంతుపితుస్తస్యా స్తృతీయంతత్పితుఃపితుః

(మనుః 9—140)

ఇట్టి దౌహిత్రుని గూర్చి ప్రశంసించుచు మనుస్మృతి యిట్లు చెప్పుచున్నది.

పౌత్రదౌహిత్రయోర్లోకే విశేషోనోపపద్యతే
దౌహిత్రోపిహ్యముత్రైనం సంతారయతిపౌత్రవత్

(మను 9—139)

(పౌత్రదౌహిత్రులకు భేదములేదు. దౌహిత్రుడుగూడ పౌత్రునివలెనే పరలోకములో తరింపచేయగలడు.)

పౌత్రదౌహిత్రులకుగల యీసమాన ప్రతిపత్తికి గల హేతువునుగూడ మనుస్మృతి చెప్పుచున్నది.

తయోర్హి మాతాపితరౌ సంభూతౌ తస్య దేహతః

(మను 9—133(

(పౌత్రుని తండ్రియు దౌహిత్రుని తల్లియు నాతని దేహమునుండి పుట్టినవారేగదా!

మనుస్మృతి యిట్టి హేతువును చెప్పుచున్నను గూడ నపుత్రకుని దౌహిత్రునకు పౌత్రతుల్యత్వము నంగీకరింప జాలకున్నది. పుత్రపౌత్రులు లేనపుడే దౌహిత్రునకు ప్రాశస్త్యము నంగీకరించుచున్నది.

దౌహిత్ర ఏవచహారే దపుత్ర స్యాఖిలంధనం

(9—131)

(అపుత్రకుని ధనమునంతయు దౌహిత్రుడు హరించును)

సపుత్రకుని ధనములో నన్నను దౌహిత్రునకు పాలే లేదు (స్త్రీధనము' అను ప్రకరణమును జూడనగును.) అట్లే

పుత్రేణ దుహితా సమా.

(9—130)

(కుమారునితో కుమార్తె సమురాలు)

అని యంగీకరించుచున్న మనుస్మృతి పుత్రులుగల వాని యాస్తిలో కుమార్తెకు భాగము నంగీకరించుటలేదు.

(స్త్రీధనము' అను ప్రకరణము చూడదగును) కాని యపుత్ర కుని ధనము నామెయే కాని మఱొకరు పొందజాలరని చెప్పు చున్నది.

తస్యాత్మని తిష్ఠన్త్యాం కథమన్యోధనం హరేత్

(మను 9—130)

(ఆతని రూపమే యైయున్న యాతని కుమార్తె యుం డగా మఱొకడెట్లు ధనము హరించును?)

సపుత్రకుని ధనములో కుమార్తెకు భాగమే లేదను నంశమునకై 'స్త్రీధన'మను ప్రకరణము చూడవచ్చును.

పుత్రులు లేనపుడే కుమార్తెకును నామె పుత్రునకును నిట్టి ప్రాముఖ్యము కలదుగాని పుత్రులున్నచో లేదను నంశము ప్రధానమైనది. నారదుడు కూడ

పుత్రాభావేతుదుహితా తుల్యసంతానకారణాత్
పుత్రశ్చ దుహితాచోభౌపితుస్సంతాన కారకౌ

(కుమారుడు లేనపుడు కూతురాతనివలెనే సంతాన కారకురాలు గాన నాతని స్థానమునందుండును. పుత్రుడును కుమార్తెయు కూడ తండ్రి సంతానకారకులే కదా!)

కావుననే స్మృతులలో పుత్రప్రాప్తియే ముఖ్యముగ ప్రశంసింపబడినది.

పుత్రాన్దేహి ధనందేహి

(యాజ్ఞ 1—291)

(కుమార్తె నిమ్ము ధనమునిమ్ము)

పుత్రేణ లోకాన్ జయతి పౌత్రేణానంత్యమశ్నుతే

అథపుత్రస్య పౌత్రేణ బ్రధ్నస్యాప్నోతి విష్టపం

(మను 9–137)

(పుత్రునిచేత లోకములను జయించుచున్నాడు. పౌత్రునిచే నానంత్యము నొందుచున్నాడు. పుత్రుని పౌత్రునిచే సూర్యమండలము పొందుచున్నాడు.)

అంతియే కాదు. పుత్రులనుకనక కేవలము స్త్రీలనే కనుచున్న భార్యను పదేండ్లుచూచి పదునొకండవయేట మఱొక భార్యను చేసికొనవలెనని మనుస్మృతి స్పష్టముగ చెప్పుచున్నది.

(పునర్వివాహమను నధ్యాయము చూడుడు)

ఆడుపిల్ల మఱొకని గోత్రములోనికి పోవుటయు మఱొకని సొత్తగుటయు ('దాంపత్యము' చూడుడు) మొదలగు నెన్నియో హేతువులవలన స్త్రీపురుష సంతతులపట్ల నీపృథక్పృథ భేదము బయలుదేరినది. అయినను పుత్రులు లేనపుడా స్థానము నాక్రమించుటకు కుమార్తె యర్హురాలనుట సహజముగనే యున్నది. కాని స్వయముగ తనకు జన్మించిన కుమార్తెవలన గాక యామెకు జన్మించిన కుమారునివలన నే పురుషుడు తరించునని స్మృతులు చెప్పుచుండుటచే నవి స్త్రీ సంతతికంటె పురుషసంతతియొక్క ప్రాధాన్యము నెంత హెచ్చుగ నంగీకరించినవో స్పష్టమగుచున్నది.

వసిష్ఠుడు మాత్రము పుత్రికకే ద్వాదశ పుత్రులలో మూడవస్థానము నొసగుచున్నాడు.

'తృతీయఃపుత్రికా'

(27—15)

కాని యిట నామె కౌరసునితో సమాన ప్రతిపత్తి లేదు. యాజ్ఞవల్క్యుడు మనువువలెనే పుత్రికాపుత్రునకే పుత్రతుల్యత్వము నంగీకరించుచు

ఔరసోధర్మపత్నీజః తత్సమః పుత్రికాసుతః (2—126)

(ధర్మపత్నివలన పుట్టినవా డౌరసుడు. పుత్రికాపుత్రుడామెతో సమానుడు) అని చెప్పియున్నాడు.

పైన తెల్పబడిన విధముగ కుమార్తెను పుత్రికనుగచేసి కొనుటకు పుత్రికాకరణమని పేరు. అదిమూడు విధములుగజరుగ వచ్చునని స్మృతికారులభిప్రాయ పడుచున్నారు.

(1) గౌతమధర్మసూత్రమీవిధముగ చెప్పుచున్నది;

పితోత్సృజేత్పుత్రికామనపత్యో ఽ గ్నింప్రజాపతించేష్ట్వా ఽ స్మదర్థమపత్యమితిసంవాద్య

(గౌతమ28—18)

(పుత్రహీనుడు ప్రజాపతికిని నగ్నికిని హోమముచేసి యీమె పుత్రుడు నాకొఱకగుననిచెప్పి యామెనుదానము చేయవలెను.)

(2) ఇట్లగ్నిసాక్షిగ కాకపోయినను నోటిమాటచేతనైనను నీనియమముచేసి కొనవచ్చునని కొందఱిమతమని గౌతమ ధర్మసూత్రమేచెప్పుచున్నది.

అభిసంధిమాత్రాత్పుత్రికేత్యేకే

(గౌతమ 29—19)

(తే) నోటిమాటచేత నియమములేకున్ననుకూడ నభ్రాతృకన్య పుత్రికయే కావచ్చునని కొన్ని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. ఇచట కన్యాదాత యభిప్రాయమేకాని వరుని సమ్మతి యవశ్యము కాదు. కావుననే పుత్రికాకరణము ప్రత్యక్షముగ జరుగకున్ననుకూడ నభ్రాతృకన్యను వివాహమూడరాదని చెప్పబడినది.

తత్సంశయాన్నోపయచ్ఛేదభ్రాతృకాం

(గౌతమ.29—20(

(పుత్రికగ పరిగణింపబడునేమో యనుభయమునచే నభ్రాతృకన్యను వివాహమాడరాదు.)

లిఖితస్మృతియు మనుస్మృతియుకూడ నీయభిప్రాయమునే యీక్రిందివిధముగ వెల్లడించినవి.

యస్యాస్తు న వేద భ్రాతా నవిజ్ఞాయేత వాపితా
నోపయచ్ఛేత తాం ప్రాజ్ఞః పుత్రికాకర్మశంకయా

(లిఖిత—51)

యస్యాస్తు న భవేద్భ్రాతా నవిజ్ఞాయేత వాపితా
నోపయచ్ఛేత తాం ప్రాజ్ఞః పుత్రికాధర్మశంకయా

(మను 3—11

భ్రాతృహీనమగు స్త్రీసంతతినిగూర్చి యింతవఱకును విచారించితిమి. ఇక భ్రాతృసహితమగు స్త్రీసంతతివలని ప్రయోజనముల నించుకపరికింతము. ఇట్లుచూచిననుగూడ నాఁడుపిల్ల

గలవాడు పుణ్యాత్ముడని యే స్మృతుల యభిప్రాయము. కన్యా దానమాత్రము చేతనే తండ్రియు నాతని పితృదేవతలును తరించు చున్నారని యర్వాచీనగ్రంథములలో చెప్పబడినది. మఱియు (పుత్రిక కాని) సామాన్యదుహితయొక్క కుమారుడుకూడ మా తామహుని యాతనిపితరులను మిక్కిలి సంతుష్టులను చేయగల డని స్మృతులలో తెల్పబడినది. కన్యాదానఫలము శేషధర్మము లలో నీక్రిందివిధముగ తెల్పబడినది:

సురూపాయ కులీనాయ సుశీలాయవ్యారోగిణే
కన్యాందద్యా చ్ఛుభాన్లోకాన్లభతే నాత్రసంశయః
సుశ్రుతాయ దరిద్రాయ శ్రోత్రియస్యాత్మజాయచ
యోదద్యాచ్ఛ స్వకాంకన్యాం బ్రహ్మలోకంస గచ్ఛతి

(శేషధర్మము 8 అధ్యా. 6, 7.)

విషువాయన సంక్రాంతౌ చంద్రసూర్యోపరాగయోః
పుణ్యక్షేత్రే పుణ్యతీర్థే కన్యాదో మోక్ష మశ్నుతే
పితృదేవగణా స్తస్య భవంతి హినుపూజితాః
గంధర్వైస్తూయ మానాస్తే ప్రయాంతి మమమందిరం.

(శేషధ. 8—9,19)

(మంచి రూపకుల శీలారోగ్యములు గలవానికి కన్య నిచ్చినవానికి శుభలోకములు లభించుటలో సందేహము లేదు. వేదము చదువుకొనినట్టియు, దరిద్రుడైనట్టియు శ్రోత్రియ పుత్రునకు తన కన్యనిచ్చువాడు బ్రహ్మలోకమును పొందును. సంక్రాంతియందును, సూర్య చంద్రగ్రహణములందును, పుణ్య

క్షేత్రమందును, పుణ్యతీర్థమందును కన్యను దానము చేయువాడు మోక్షము నొందును. అతని పితృదేవ గణములు బాగుగ పూజింపబడిన వగుచున్నవి. ఆగణములు గంధర్వుల చేత స్తుతింపబడుచున్నవై నా (విష్ణుని) మందిరమునకు వచ్చును.

యాజుషస్మార్తాను క్రమణిలో గూడ కన్యాదాన ఫలము పేర్కొనబడినది.

దాస్యామి విష్ణవే తుభ్యం బ్రహ్మలోక జిగీషయా

(బ్రహ్మలోక కాంక్షతో విష్ణుస్వరూపుడవగు నీకు కన్యనిచ్చుచున్నాను.)

త్వద్దానాన్మోక్ష మాప్నుయాం

(ఓకన్యా, నిన్ను దానము చేయుటచే మోక్షము నొందగలను)

కన్యామిమాం ప్రదాస్యామి పితౄణాం తారణాయవై

(పితృదేవతలు తరించుటకై యీ కన్యను దానము చేయుచున్నాను.)

మహాసంకల్పములో పారవశ్యముతో వినుతింపబడిన కన్యాదాన మహాఫలము తెలియుటకై యందుండి కొన్ని భాగముల నిచ్చుచున్నాడను.

తిలైస్సూర్య మండల పర్యంతం కృతరాశేర్వర్ష సహస్రావసానే ఏకైక తిలాపకర్ష క్రమేణ సర్వరాశ్యపకర్ష సమ్మితకాలే బ్రహ్మలోకే నివాస సిద్ధ్యర్థం......త్రిగుణీకృతా

గ్నిష్టో మాతిరాత్రాప్తోర్యామ సాంతపన వాజిపేయ పౌండరీ కాశ్వమేధాది శతక్రతు పుణ్యఫలా వాప్త్యర్థం మయాసహ దశపూర్వేషాం దశాపరేషాం మద్వంశ్యానాం మాతృవంశ్యానాం సర్వేషాం పితృణాం నరకాదుత్తీర్య శాశ్వత బ్రహ్మలోకే నివాస సిద్ధ్యర్థం......సాలంకృత కన్యాదానం...... కరిష్యే.

(సూర్య మండలము వఱకును సవ్వలను, ప్రోగువేసి యందుండి వేయిసంవత్సరముల కొకగింజను తీసివైచు చుండి నచో నెంతకాలమున కాప్రోగు పూర్తిగ తీయబడునో యంత కాలము బ్రహ్మలోకములో నుండుటకును, త్రిగుణీకృతా గ్నిష్టో మాతిరాత్రాప్తోర్యామ సాంతపన వాజిపేయ పౌండరీ కాశ్వమేధాధి శతక్రతు పుణ్యఫలము గల్గుట కొఱకును, మావంశమునందును మాతృవంశమునందును నాతో కూడ పది తరముల పై వారును పదితరముల క్రిందివారు నునగు పితరులు నరకమునుండి లేచి శాశ్వత బ్రహ్మలోక నివాసమును పొందు టకును......సాలంకృత కన్యాదానమును చేయుచున్నాను.)

ఇంత యుత్ప్యుక్తులతో గాకున్నను సంవర్తస్మృతి కన్యాదానమున కీ క్రింది ఫలమును జెప్పుచున్నది.

అలంకృత్యతుయః కన్యాం వరాయసదృశాయవై
బ్రాహ్మేణవివాహేన దద్యాత్తాన్తును పూజితాం
సకన్యాయాః ప్రదానేన శ్రేయోవిందతి పుష్కలం
సాధువాదం లభేత్సద్భిఃకీర్తిం ప్రాప్నోతిపుష్కలాం

జ్యోతిష్టోమాదియజ్ఞానాంశతం శతగుణీకృతం
ప్రాప్నోతిపూరుషోదత్వాహోమమంత్రైస్సుసంస్కృతాం
అలంకృత్యపితాకన్యాం భూషణాచ్ఛాదనాసనైః
దత్వాస్వర్గమవాప్నోతి పూజితస్తు సురాదిషు.

(సంవర్త. 61, 62, 63, 64)

(అలంకరించిన కన్యను బ్రాహ్మవివాహము చేత తగిన వరునకిచ్చుచో వాడు మిక్కిలి శ్రేయస్సును, కీర్తిని, సజ్జనవస్తుతిని పొందును; జ్యోతిష్టోమాదియాగముల ఫలమునకు నూరురెట్లు ఫలము నొందును. హోమమంత్రములచే సంస్కరింపబడిన కన్యను భూషణాచ్ఛాదనాసనములచే నలంకరించి యిచ్చువాడు స్వర్గమునొంది దేవతలలో పూజింపబడును.)

కుమార్తె తనతండ్రికిని నాతని వంశమునకును నెంత మహోపకారిణి కాగలదో పైన నుల్లేఖింపబడిన వాక్యములను బట్టి స్పష్టము కాగలదు. స్మృతికారులు స్త్రీ సంతతి కెంత ప్రాశస్త్యమును గల్పించినారో యిట్టివాక్యములవలన స్పష్టమగుచున్నది.

కుమార్తె కేవలము తానే కాక తన సంతతిద్వారమున గూడ పితృవంశమునకు మహోపకృతి సల్పుచున్నది. ఏమన: సామాన్యుడగు (పుత్రికా పుత్రుడు కాని) దౌహిత్రునిమూలమునగూడ మాతామహుని వంశము తరించుచున్నదని స్మృతుల యభిప్రాయము. దౌహిత్రుడనిన పితృదేవతల కెంతయో ప్రీతియట! శ్రాద్ధములో నాతని భుజింప జేసినచో వారు వర

మత్పుత్రులగుదురట! శ్రాద్ధమునకు కుతపకాలము, తిలలు నెట్లు కావలెనో దౌహిత్రుడుకూడ నట్లే కావలెనట!

త్రీణ్యేతాని పవిత్రాణి దౌహిత్రః కుతపస్తిలాః

(వసిష్ఠ11—35)

(దౌహిత్రుడు, కుతపకాలము, తిలలు—ఈమూడును శ్రాద్ధమునకుపవిత్రములు.)

కావుననే బ్రహ్మచర్యవ్రతములోనున్నను దౌహిత్రుని భోక్తగనియమింపవలెనను నియమముగలదు.

వ్రతస్థమపి దౌహిత్రం శ్రాద్ధేయత్నేనభోజయేత్

(మను3—234)

నిత్యమునుదకదానము చేయుటచేగూడ దౌహిత్రుడు మాతామహవంశ్యులలో ప్రేతులైనవారికి సేవకుడగుచున్నాడు.

ఏవంమాతామహాచార్య ప్రేతానాముదకక్రియా

(యాజ్ఞ ప్రాకాం.4)

(సపిండులకువలెనే మాతామహులకును నాచార్యులకును నుదకదానము చేయవలెను.)

దౌహిత్రునివలన తనవంశమునకిట్టి ప్రయోజనముగల్గును గావుననే కన్యాదాత కన్యనిచ్చునపుడితర దానములలోవలె 'నమమ' 'ఇదినాదికాదు'యని చెప్పడు. అట్లుచెప్పుచో దత్తవస్తువుయొక్క ఫలమగుదౌహిత్రునివలన నాతడును నాతని వంశీయులును ప్రయోజనము నొందుటకు వీలుండకపోయెడిని.

స్త్రీసంతతిపట్ల స్మృతులవృక్పథము నింతవఱకును జూచితిమి. ఇక స్త్రీసంతతియొక్క యుత్పత్తిని గూర్చి స్మృతికారులకుగల కొండభిప్రాయముల నిటతెల్పుట యప్రస్తుతము కాదు.

పురుషుని శుక్రాధిక్యముచే పురుషసంతతియు, స్త్రీ శోణితాధిక్యముచే స్త్రీసంతతియు గల్గునని మనుస్మృతి చెప్పుచున్నది.

పుమాన్పుం సోధికే శుక్రే స్త్రీభవత్యధికేస్త్రియాః

(మను 3—49)

కుమారునిలో తండ్రియంశమును కుమార్తెలో తల్లియంశమును విశేషముగ నుండుటచేతనే వసిష్ఠుడు పతితుడైన పురుషునకు పతితురాలుకాని స్త్రీయందు జన్మించిన పుత్రుడే పతితుడగును కాని కుమార్తె పతితురాలు కాదని చెప్పినాడు.

పతితేనోత్పన్నః పతితో భవతి అన్యత్రస్త్రియాః

(వసి 13—51)

(పతితుని స్త్రీకంటె నితరమగు సంతతి పతితమగుచున్నది)

మఱియు ఋతుకాలములో సరిసంఖ్యగల రాత్రులందు పురుషుడును బేసిసంఖ్యగల రాత్రులందు స్త్రీయును గర్భములో ప్రవేశించునని యీ క్రింది శ్లోకము చెప్పుచున్నది.

యుగ్మాసుపుత్రాజాయంతే స్త్రియోయుగ్మాసురాత్రిషు

(మను 3—48)

# స్మృతి కాలపు స్త్రీలు

## ద్వితీయాధ్యాయము.

### వివాహవయస్సు.

స్త్రీల వివాహవయస్సును గూర్చి స్మృతులు నిస్సంశయము సందేహము లేకుండునట్లు పరిష్కరించినవి. స్మృతుల నన్నిటిని పరిశీలించిన పిమ్మట నీక్రింది సిద్ధాన్తములను ప్రకటించుటకు వీలుగల్గుచున్నది.

(1) రజస్వల కాకుండగనే వివాహము చేయవలెనని చాల ధర్మశాస్త్రములు నొక్కి చెప్పుచున్నవి. అవి రజస్వలా వివాహమును మిక్కిలి గర్హించుచున్నవి.

(2) రజస్వలయైనంత మాత్రమున మహాదోషము లేదనియు నా పిమ్మట వివాహము చేయుట కుపేక్షించుట ఘోరదోషమనియు కొన్ని స్మృతులు చెప్పుచున్నవి.

(3) రజస్వలా వివాహము మంచిదని యేస్మృతియు చెప్పుటలేదు.

(4) ఎనిమిదేండ్లకును పండ్రెండేండ్లకును నడుమను స్త్రీకి వివాహము చేయవలెనను నిర్దేశమును గూడ కొన్ని స్మృతులు చేయుచున్నవి.

(5) వివాహము కాకుండగనే రజస్వలయైన స్త్రీయు నామె పెద్దలును నామె సంతతియుగూడ పతితులగుదురని కొన్ని ధర్మశాస్త్రములును, పెద్దలు మాత్రమే దోషవంతులగుదురని కొన్నిధర్మశాస్త్రములును చెప్పుచున్నవి.

ఈ సిద్ధాంతములలో నొక్కొకదానిని తీసికొని యందులకుగల యాధారములను పరికింతము.

(1) వసిష్ఠధర్మశాస్త్రము, గౌతమధర్మసూత్రము, పరాశరస్మృతి, యమసంహిత, సంవర్తసంహిత, యాజ్ఞవల్క్యస్మృతియను నాలుధర్మశాస్త్రములును విస్పష్టముగ రజస్వలావివాహము చేయువానిని గర్హించుచున్నవి.

పితుఃప్రమాదాత్తు యదీహకన్యా
వయఃప్రమాణం సమతీత్యదీయతే
సాహన్తిదాతారము దీక్షమాణా
కాలాతిరిక్తాగురు దక్షిణేవ (వసి 17-69

(తండ్రి పొరబాటువలననే కన్య వివాహవయస్సు నతిక్రమించి దానముచేయబడునో యాకన్య సకాలమును దాటిన గురుదక్షిణవలె దాతను నశింపజేయును)

పై శ్లోకములో నుద్దేశింపబడిన వివాహవయస్సు నీక్రింది శ్లోకము విశదీకరించుచున్నది.

ప్రయచ్ఛేన్నగ్నికాం కన్యామృతుకాలభయాత్పితా
ఋతుమత్యాంతుతిష్ఠన్త్యాం దోషం పితరమృచ్ఛతి
(వసి. 17-70)

(రజస్వలకాని కన్యను రజస్వలయగునేమో యనుభయముచే తండ్రి దానము చేయవలెను. కన్య రజస్వలయైయుండుచో తండ్రిని దోషము పొందును.)

వసిష్ఠుడీ విధముగ రజస్వలయగు నప్పటికే వివాహము చేయకుండుటను నిషేధించి, యీపిమ్మటకూడ వివాహము చేయకుండుటను మఱింతతీవ్రముగ నిందించుచున్నాడు.

యావన్తః కన్యామృతవస్స్పృశన్తి
తుల్యైస్సకామామభి యాచ్యమానాం
భ్రూణాని తావన్తిహతాని తాభ్యాం
మాతాపితృభ్యామితి ధర్మవాదః

(వసి. 17–71)

(కామముతోగూడి కామింపబడుచున్న కన్య కెన్ని ఋతుకాలములు గడచునో యన్ని భ్రూణహత్యలను చేసిన పాపము తల్లిదండ్రులకు వచ్చును.)

గౌతముడుకూడ విస్పష్టముగ రజస్వలకాకపూర్వమే వివాహము చేయవలెనని శాసించుచున్నాడు.

ప్రదానం ప్రాగృతోః

(గౌ. ధ. సూ. 18–21)

(ఋతుమతి యగుటకుపూర్వమే కన్యను దానము చేయవలెను.)

ఎంతబాల్యముతో కన్యను దానముచేసిన నంత మంచిదనియే కొందఱిమతప్రాయమని గౌతముడు చెప్పుచున్నాడు.

ప్రాగ్వాససః ప్రతిపత్తిరిత్యేకే

(గౌ. 18—23)

(గుడ్డ కట్టుకొను వయస్సునకు పూర్వమే దానముచేయుట మంచిదని కొందఱు ఋషులు చెప్పుచున్నారు)

గౌతముడు అరజస్వలావివాహమును శాసించుటతో నూరకుండక రజస్వలావివాహమును నిషేధించుచు నిట్లు చెప్పుచున్నాడు.

అప్రయచ్ఛన్దోషీ.

(గౌ. 18—22)

(ఋతుకాలమునకు పూర్వమే దానము చేయనివాడు దోషవంతుడగుచున్నాడు.)

పరాశరస్మృతి రజస్వలావివాహమును సర్వవిధముల నీ క్రిందివిధముగ నిందించుచున్నది.

మాతాచైవ పితాచైవ జ్యేష్ఠాభ్రాతాతథైవచ
త్రయస్తేనరకంయాంతి దృష్ట్వాకన్యాం రజస్వలాం
యస్తాం సముద్వహేత్కన్యాం బ్రాహ్మణోమదమోహితః
అసంభాష్యోహ్యపాంక్తేయస్స విప్రోవృషలీపతిః
యఃకరోత్యేకరాత్రేణ వృషలీసేవనంద్విజః
సభైక్షభుగ్జపన్నిత్యంత్రిభిర్వర్షైర్విశుధ్యతి

(పరా. 8—6, 7, 8.)

(తల్లి, తండ్రి, జ్యేష్ఠసోదరుడు — ఈముగ్గురు నవివాహితయగు రజస్వలను చూచి నరకమును పొందుదురు. అట్టి కన్యను వివాహము చేసికొను మదమోహితుడైన బ్రాహ్మణుడు సంభాషింప తగనివాడు; పఙ్క్తిబాహ్యుడు. వానికి వృషలీపతి యని పేరు. ఒక్కరాత్రి వృషలిని సేవించిన దోషము మూడేండ్లు భిక్షచర్య చేయుచు జపించుచుండినచో హరించును.)

యమసంహితకూడ పరాశరుని వాక్యములతోనే (యమ 11—23) రజస్వలావివాహమును గర్హించుచున్నది. సంవర్త సంహితకూడ నట్లే గర్హించి (67 శ్లో) యిట్లు శాసించుచున్నది.

తస్మాద్వివాహయేత్కన్యాం యావన్నర్తుమతీభవేత్

(సంవర్త. 68)

(ఆహేతువువలన కన్య రజస్వలయగు లోపలనే వివాహము చేయవలెను.)

యాజ్ఞవల్క్యుడీ క్రిందివిధముగ రజస్వలా వివాహమును గర్హించుచున్నాడు.

అప్రయచ్ఛన్ సమాప్నోతి భ్రూణహత్యామృతావృతౌ

(యాజ్ఞ 1—64)

(ఋతుమతి కాకుండనే కన్యను దానము చేయనివాడామె ఋతుకాలమునందెల్ల భ్రూణహత్యాదోషము నొందును.)

ఆపస్తంబుని మతములో గూడ నరజస్వలకే వివాహము చేయవలెనని తెలుచున్నది, ఎట్లన: ఆపస్తంబ గృహ్యసూత్రములో తృతీయ పటలములో సప్తమఖండములో పదవ సూత్రములో 'త్రిరాజసిత్వా' యను మాటలతో వివాహ ప్రకరణము ముగింపబడినది. 'యద్యామల వద్వాసాఃస్యాత్' అను పన్రెండవ సూత్రములో రజస్వలా విషయము చెప్పబడినది. కావున వివాహమునకు పిమ్మటనే రజస్వల యగుటయే క్రమమని తెలుచున్నది.

(2) కన్య రజస్వలయైన వెంటనే వివాహము చేయుట దోషము లేదనియు నటుపిమ్మట నుపేక్షించుట దోషమనియు చెప్పుచున్నవాడు నారదు డొక్కడే. ప్రథమ రజస్వలయైన వెంటనే కన్యను దానము చేయవలెననియు ప్రథమర్తుకాల మతిక్రమించినను దాతకు భ్రూణహత్యా దోషము వచ్చుననియు నాతని యభిప్రాయము.

కన్యాసర్తుముపేక్షేత బాంధవేభ్యోని వేదయేత్
తేచేన్న దద్యుస్తాంభర్త్రే తేస్యుర్భ్రూణహాభిస్సమాః

(నారద. స్త్రీపుంసయోగమను ద్వాదశవ్యవహారపదము 24)

కన్య ఋతువు నుపేక్షింపక బంధువులకు తెలువవలెను. వారామెను భర్తకు దానముచేయరేని (భ్రూణహత్య చేసినవారగుచున్నారు.)

ఈయభిప్రాయమే మఱింత స్పష్టముగ నీక్రింది శ్లోకములో చెప్పబడినది.

యావన్తశ్చర్తవస్తస్యాః సమతీయుః పతింవినా
తావన్త్యో భ్రూణహత్యాస్స్యుస్తస్యా యోనప్రదాపితా
(25 శ్లో)

(పతిలేకుండ కన్యకెన్ని ఋతుకాలములు గడచునో యన్ని భ్రూణహత్యల పాపము దానిని యీయని వానికి వచ్చును.)

కావున ప్రథమర్తుకాల మతిక్రమించునేని యొక భ్రూణహత్యచేసిన పాపము దాతకు వచ్చుచున్నది. అందువలన నే ప్రథమర్తుకాల మతిక్రమింపకుండ రజోదర్శనమైన వెంటనే వివాహము చేయవలెనని యీ క్రింది శ్లోకము చెప్పుచున్నది.

అతః ప్రవృత్తేరజసి కన్యాందద్యాత్పితాసకృత్
మహాదేనః స్పృశేదేనమన్యథైవంవిధిఃసతాం
(నారద 12—27)

(అందువలన రజఃప్రవృత్తి యగుచుండగనే తండ్రి కన్య నిచ్చివేయవలెను. అట్లుకానిచో నాతనికి గొప్ప పాపము వచ్చును. ఇది సత్పురుషుల విధి.)

నారదునినుండి పైన నుదహరింపబడిన వాక్యములను బట్టి చూడగా కన్యకు ప్రథమర్తు కాలములో వివాహము చేయవలెనని తెలుచున్నది.

ఋతుస్స్వాభావిక స్త్రీణాం రాత్రయష్షోడశస్మృతాః
(స్త్రీలకు పదునారు రాత్రులు స్వాభావికమగు ఋతు కాలము)

అని మన్వాదు లాదేశించుటచేత రజోదర్శనమైనది మొదలు పదునాఱు దినములు దాటకుండ [illegible] వివాహము చేయవలెనని తెలుచున్నది. ఈగ్రంథములో ము [illegible] చెప్పబడి [illegible] రజస్వలా నియమములను [illegible] దినములలోను వివాహము చేయుటకు [illegible] వచనములు దినములలోను చేయబడి యుండను. మఱియును 'వధూవరార్హతలు' అను శీర్షికల [illegible] లో తెలుపబడనున్న నారదుని ప్రోక్తవచన [illegible] ను బట్టి మాతృమేని పదునాఱు దినములలో [illegible] నిశ్చయించి యోగ్యుని కిమ్మను దానముచేయుట [illegible] తెలియుచున్నది. మఱికొంతకాల మాలస్యము కావచ్చునేని దానికి [illegible] దోషము చెప్పబడలేదు. భ్రూణహత్యాదోషము చెప్పబడినది. కావున నెట్టైనను పదునాఱుదినములలో తప్పక వివాహము చేయవలసి వచ్చుచున్నది. అది సాధ్యము కావలెనన్నచో రజస్వలావయస్సునకు పూర్వమే వరుని నిశ్చయించి యుంచుకొని ఋతుస్నాతయైన పిమ్మట వివాహము జరుపవలెనని నారదుని యభిప్రాయమైనట్లు తెలుచున్నది.

(3) రజస్వలా వివాహమే మంచిదని చెప్పు ధర్మశాస్త్ర మొక్కటియు గానరాదు.

(4) కన్యకు వివాహము నెనిమిదవయేట చేయుట మంచిదని సంవర్త సంహిత చెప్పుచున్నది.

వివాహోష్టవర్షాయాః కన్యాయాః ప్రశస్యతే

(సంవ. 16 శ్లో.)

(ఎనిమిదేండ్ల పిల్లకు వివాహము చేయుట ప్రశస్తము)

పన్రెండవయేడు వచ్చునప్పటికి కన్యకు వివాహము చేయవలెనని యమస్మృతియు పరాశరస్మృతియు చెప్పుచున్నవి.

ప్రాప్తేతుద్వాదశేవర్షేయః కన్యాంనప్రయచ్ఛతి
మాసిమాసి రజస్తస్యాః పితాపిబతిశోణితం

(యమ. 11—22)

(పన్రెండవయేడు వచ్చినదగుచుండగా నెవడు కన్యను దానము చేయడో యాతండు యామె రజస్సును ప్రతిమాసమును త్రాగుచున్నాడు.)

ఈశ్లోకమే పరాశరస్మృతిలో (8-5) నున్నది.

(5) అవివాహితలై యుండగా రజస్వలలైన స్త్రీయు, నామెతండ్రియు, తల్లియు, సోదరుడును, నామెను వివాహమాడినవాడును పతితులని తెల్పుకొన్ని శ్లోకములు పైననీయబడినవి. గౌతమ వసిష్ఠులు రజస్వలా దాతను మాత్రమే నిందించినట్లుకూడ పైన చూచియున్నాము. తండ్రి ధర్మలోపము చేతను బుద్ధిహీనతచేతను, సకాలములో వివాహితకాని కన్య గతి యేమికావలెనను ప్రశ్నను వేసికొని దానికి సమాధానములను గూడ గౌతమ వసిష్ఠులిచ్చియున్నారు. అట్టి కన్య

మూడు ఋతుకాలములు వేచియుండి యెవ్వరికిని తండ్రి దానముచేయనిచో తానే స్వయముగ మతాకనిని వివాహ మాడవలెనని గౌతముడు చెప్పుచున్నాడు.

త్రీన్కుమార్యృతూనతీత్య స్వయంయుజ్యే
తానిందితేనోత్సృజ్యపిత్ర్యానలంకారాన్

(గౌ. 4—20)

(అవివాహిత మూడు ఋతుకాలములు వేచియుండి తండ్రిపెట్టిన యలంకారముల నాతనికిచ్చివైచి తానే యనిందితుడగు వరుని సంపాదించి వివాహ మాడవలెను.)

ఇచటి మూడు ఋతుకాలములకు బదులుగ వసిష్ఠ స్మృతిలో మూడు సంవత్సరములు చెప్పబడినది.

కుమార్యృతుమతీత్రీణి వర్షాణ్యుపాసీత
త్రిభ్యోవర్షేభ్యః పతింవిందేత్తుల్యం

(వసి 6—67)

(ఋతుమతియైన యవివాహిత మూడు సంవత్సరములు వేచియుండి తగిన భర్తను పెండ్లాడవలెను.)

సకాలములో దానము చేయువాడు లేనిచో కన్య స్వయముగనే పెండ్లిచేసికొనవలెనని యాజ్ఞవల్క్యుడుకూడ చెప్పుచున్నాడు.

గమ్యంత్వభావే దాతౄణాం కన్యాకుర్యాత్స్వయంవరం.

(యాజ్ఞ. 1—65)

(వరుడు లేనిచో కన్య తగినవరుని స్వయంవరము చేసికొనవలెను.)

మనువుకూడ వసిష్ఠునివలెనే మూడు సంవత్సరములు చూచి స్వయంవరము చేసికొనవలెనని చెప్పినాడు.

త్రీణివర్షాణ్యుదీక్షేత కుమార్యృతుమతీసతీ
ఊర్ధ్వంతు కాలాదేత స్మాద్విందేత సదృశంపతిం

(మను 9—88)

(కన్య ఋతుమతియై మూడు సంవత్సరములు వేచియుండి పిమ్మట తగిన వరుని పొందవలెను.)

ఇట్టి సకాలములలో తండ్రిచేత నీయబడనిదై స్వయముగ వివాహమాడిన స్త్రీగాని యామె భర్తగాని యెంత మాత్రము దోషమును పొందరని మనుస్మృతి చెప్పుచున్నది.

అదీయమానాభర్తా రమధిగచ్ఛేద్యదిస్వయం
నైనః కించిదవాప్నోతినచయంసాధి గచ్ఛతి

(మను 9—91)

రజస్వలయైనపిమ్మట మూడేండ్లు కన్య వేచియుండవలెనని మనువు చెప్పుటచే రజస్వల కాకుండనే కన్యను దానము చేయుట తండ్రి కర్తవ్యమని యాతని యభిప్రాయమైనట్లు తేలుచున్నది. అయినను తండ్రి నేరముచే కూతురు దోషవంతురాలు కాదని యాతడు భావించుచున్నట్లుకూడ పై శ్లోకమువలన తెలియుచున్నది. అంతేకాక మొత్తముపైన మనువు

దృష్టిలో రజస్వలా వివాహము [illegible] వత నత్యంతము గర్హ్యమైనట్లు కనిపించదు. మనువు

> కామమామరణాత్తిష్ఠేద్గృహే కన్యర్తుమత్యపి
> నచైనాం ప్రయచ్ఛేత్తు గుణహీనాయ కర్హిచిత్
>
> (మను 9—89)

(కన్య ఋతుమతియైనను మరణించువరకు [illegible] యగును గాని గుణహీనునకు నెన్నడు నీయరాదు) అని మను స్మృతి చెప్పుచున్నది. గుణహీనునకు కన్యనీయరాదని చెప్పుటకే యీ శ్లోకము చెప్పబడియున్నది. గుణహీనుడే కాని లభించ నపుడు కన్య ఋతుమతియైనను పెండ్లిచేయని దోషము కాదని దీనినిబట్టి యూహించుటకు వీలున్నది. ఋతుమతియైన మూడేండ్ల వఱకును కన్య వేచియుండవచ్చుననుట యిట్టి పరిస్థితులలోనే యని యన్వయించుకొనవచ్చును. ఏదియెట్లున్నను సామాన్యముగ వివాహము చేయవలసిన వయస్సు మనువు నభిప్రాయములో కూడ రజస్వల కాకపూర్వమే. మనువు స్త్రీ పురుష సంతతులకు చేయవలసిన కర్మలను జెప్పుచు పురుషుని యుపనయనమునకు బదులుగ స్త్రీ వివాహమును చెప్పుటచేతనే స్త్రీ కెనిమిదవయేట వివాహము చేయవలసిన దని మనువు భావించినట్లు తెలియుచున్నది.

> వైవాహికో విధిః స్త్రీణాం సంస్కారో వైదికస్స్మృతః
>
> (మను 2—67)

పురుషుని యౌవనము వయస్సునుగూర్చి ముందు వివరింపబడనున్న గా. 1–5, 8 చూడుడు.

వివాహవయస్సు రాకపోయినను తగినవరుడు లభించినచో కన్యకను వివాహము చేయవలెనని మనువు చెప్పుచున్నాడు.

ఉత్కృష్టాయాభిరూపాయ వరాయ సదృశాయ చ
అప్రాప్తామపి తాం తస్మై కన్యాం దద్యాద్యథావిధి.

(మను 9-88)

(వయస్సురాని కన్యనుగూడ నుత్కృష్టుడును మంచి రూపముగలవాడును, సమానవర్ణుడును నగువరునకు యథావిధిగ నీయవలెను.)

ఇచట 'అప్రాప్తాం' అని చెప్పుటచేతనే స్త్రీకి నిర్ణీతమగు వివాహ వయస్సొకటి మనువు నభిప్రాయములో గలదని తేలుచున్నది.

కాలేఽదాతా పితా వాచ్యః

(మను 9–4)

(సకాలములో దానముచేయని తండ్రి దోషి)

అనుటచే గూడ నియంశమే తేలుచున్నది. ఆనిర్ణీత వయస్సు ఎనిమిదేండ్లు మొదలు పండ్రెండేండ్ల లోపునని 2–67 వలనను ముందు వివరింపబడనున్న 9–94 వలనను తేలుచున్నది.

ఇక పురుషుని వివాహవయస్సు గూడ నించుక పరికింతము. పురుషుడు సుమారిరువదియైదవయేట వివాహము చేసికొనవలెనని స్మృతుల యభిప్రాయమైనట్లు తోచుచున్నది. ఎట్లన: ఆయుస్సులోని రెండవభాగము గృహస్థాశ్రమములో నడుపవలెనని చెప్పబడినది.

ద్వితీయమాయుషో భాగం కృతదారో గృహే వసేత్.

(మ 5–169)

'శతమానం భవతి' యనున్నగు ప్రాచీనాభిప్రాయములను బట్టి నూరేండ్లు మానవుని యాయుఃప్రమాణమగుచో నందు నాల్గాశ్రమములకు (బ్రహ్మచారీ గృహస్థో భిక్షు వైఖానసః. గౌ.) నాల్గుభాగములగుచో నొక్కొకభాగమున కిరువదియైదేండ్లు వచ్చును. ఈ యూహ సరియైనదే యనుటకు మఱొక యాధారము చూపవచ్చును. అదియెట్లన: ఈ లెక్క ననుసరించి యేఁబదవయేట వానప్రస్థములో చేరవలసియుండును. వివాహమైన కొలదికాలముననే కుమారుడు కల్గుచో నాకుమారునకు పాతికేండ్లువచ్చి యాతనికి వివాహమై కుమారుడు కల్గునప్పటికి తన కేబదేండ్లువచ్చును. అంత నాయువుయొక్క మూడవభాగమువచ్చును. అదియే వానప్రస్థములో ప్రవేశింపవలసిన కాలము గదా! అప్పటికి మనుమడు కల్గియుండవలెనని స్మృతులలో నున్నది.

గృహస్థస్తు యదా పశ్యేద్వలీపలిత మాత్మనః
అపత్యస్యైవచాపత్యంతదారణ్యం సమాశ్రయేత్

(మ 6—2)

(గృహస్థుడు తన ముడతలను, తలనెఱపును, మనుమని చూచునో యపుడరణ్యమునకు పోవలెను)

ఇట్లు వానప్రస్థములో చేరునప్పటికి ననగా నాయువులో మూడవభాగము (ఏబదియొకటవయేడు) ప్రవేశించునప్పటికి మనుమడు కలుగవలెనని చో నాతడు సుమారిరువది యారేండ్ల పుడు కుమారుని కనవలెను. ఈ విధముగా సుమారిరువది యైదవయేట పురుషునకు వివాహమగుట స్మృతి సమ్మతమని తేలుచున్నది. దీని ననుసరించియే మనువు ముప్పదేండ్లవాడు పండ్రెండేండ్ల దానిని నిరువదినాల్గేండ్లవాడెనిమిదేండ్ల దానిని వివాహమాడవచ్చునని చెప్పినాడు.

త్రింశద్వర్షోద్వహేత్కన్యాం హృద్యాం ద్వాదశవార్షికీం
త్ర్యష్టవర్షోష్టవర్షాం వా ధర్మేసీదతిసత్వరః

(మ 9—94)

(ముప్పదేండ్లవాడు మనోహారిణియైన పండ్రెండేండ్ల కన్యను వివాహమాడవలెను. ముందుగ వేదాధ్యయనము పూర్తిచేసి గార్హస్థ్యధర్మమును నిర్వహించుటకు వ్యర్థముగ కాలయాపనము చేయుట కిష్టములేనివాడు ఇరువదినాల్గవయేట నెనిమిదేండ్లదానిని వివాహ మాడవచ్చును.)

పురుషుని వివాహవయస్సును నిర్ణయించుటకు మఱొక మార్గము కలదుగాని యది యింత విశదమైనది కాదు. ఎట్లన బ్రాహ్మణున కెనిమిదవయేటను, క్షత్రియునకు పదునొకండవ యేటను, వైశ్యునకు పండ్రెండవయేటను నుపనయనము చేయవలెనని యన్నిధర్మశాస్త్రములును చెప్పుచున్నవి.

ఉపనయనం బ్రాహ్మణస్యాష్టమే

(గౌ. 1–5)

ఏకాదశద్వాదశయోః క్షత్రియవైశ్యయోః

(గౌ. 1–8)

పిమ్మట పండ్రెండు కాని యిరువదినాల్గు కాని ముప్పదియాఱు కాని సంవత్సరములు బ్రహ్మచర్యముచేసి వివాహము చేసికొనవలెనని యున్నది.

ద్వాదశవర్షాణ్యేకవేదే బ్రహ్మచర్యంచరేత్
ప్రతిద్వాదశవర్షంవా సర్వేషు.

(గౌ. ధ. సూ. 2–51,52)

దీనిని బట్టి పురుషుడిరువదేండ్లకు లోపున వివాహమాడరాదని మాత్రమే తేలుచున్నది. కావున నిది పైనవేయబడిన లెక్కకు విరుదము కాదు.

# స్మృతికాలపు స్త్రీలు

## తృతీయాధ్యాయము

### వధూవరార్హతలు

వధూవరు లిరువురు నొకే వర్ణమునకు చెందినవారుగ నుండవలెనని స్మృతులు తెల్పుచున్నవి.

ఉద్వహేత ద్విజో భార్యాం సవర్ణాం

(మను 3—4)

(ద్విజుడు తన వర్ణమునకు జెందిన భార్యను చేసికొన వలెను.)

ద్విజాద్విజవిషయమేమి లేకుండ గౌతము డిట్లు చెప్పు చున్నాడు.

గృహస్థస్సదృశీం భార్యాం విందేత

(గౌ. ధ. 4—1)

(గృహస్థు కాబోవువాడు సమానవర్ణముగల స్త్రీని చేసికొనవలెను.)

సవర్ణవివాహమువలన జన్మించినవారు మాత్రమే సజాతులగుచున్నారు. అసవర్ణవివాహమువలన జన్మించినవా రట్లు కాక సంకరజాతులవా రగుచున్నారు.

సవర్ణేభ్య స్సవర్ణా సుజాయంతే హీనజాతయః

(యాజ్ఞ 1—91)

(సమానవర్ణులకలు సమానవర్ణ స్త్రీయందు సమాన వర్ణులు జన్మించుచున్నారు.)

కావున తన వంశమును నిలబెట్టుకొనగోరువా డెల్ల సమానవర్ణములోని స్త్రీని వివాహ మాడవలసి యుండెను. పితౄణవిమోచన మను ధర్మ మట్టి పుత్రునివలననే గల్గుచున్నది. ఏలన: సమానవర్ణ దంపతులకు జన్మించినవారికే కర్మతోడి సంబంధము.

సవర్ణా పూర్వాశాస్త్ర విహితాయాం యథర్తు
గచ్ఛత స్తేషాం కర్మభిః సంబంధః

(ఆ. ధ. సూ. 2—13—1)

(సవర్ణయు, పూర్వ మితరునిచే వివాహిత కానట్టియు శాస్త్రీయముగ పొందబడినట్టియు భార్యను ఋతుకాలములో పొందగా కల్గిన సంతానమునకే కర్మతో సంబంధము.)

ఇతరసంతతి యన్ననో బ్రహ్మక్షత్రియవైశ్యశూద్ర జాతులలో దేనిక్రిందకును గూడరాదు. ఆ సంకరజాతుల నామములు గల రెండు సూత్రములను మాత్ర మీక్రింద నిచ్చుచున్నాను.

అనులోమా అనంత రైకాంతరద్వ్యంత రా సుజాతా
స్సవర్ణాం బష్ఠోగ్రనిషాద దౌష్యంద పారశవాః

(గౌ. ధ. సూ. 4—15)

ప్రతిలోమాస్సూతమాగధ ఆయోగవక్షత్తృవై దేహ
కచండాలాః

(గౌ. ధ. సూ. 4—17)

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులలో పై వర్ణపు పురుషులు క్రిందివర్ణపు స్త్రీలను వివాహ మాడుచో నవి యను లోమ వివాహములగును. క్రిందివర్ణపు పురుషులు పై వర్ణపు స్త్రీలను వివాహ మాడుచో నా వివాహములకు ప్రతిలోమ వివాహములని పేరు. అనులోమములకంటెను ప్రతిలోమము లెక్కుడు గర్హ్యములు. అనులోమవివాహములు కాముక పక్షములో నంగీకరింపబడినవి. కాని ప్రతిలోమ వివాహములు ధర్మహీనములని స్పష్టముగ చెప్పబడినవి.

ప్రతిలోమాస్తు ధర్మహీనాః

(గౌ. ధ. సూ. 4—24)

అందునను బ్రాహ్మణస్త్రీ శూద్రుని వివాహమాడుట మిక్కిలి దోషము. అట్టి వివాహమువలన జన్మించువాడు చండాలుడని పైన నీయబడిన గౌతమసూత్రములో (4—17) నున్నది. వా డందఱికంటెను పాపిష్ఠుడని చెప్పబడినది.

అంత్యః పాపిష్ఠః

(గౌ. ధ. సూ. 4—27)

అనులోమ వివాహములు కాముకపక్షములో నంగీకరింపబడిన విధము నించుక పరిశీలింపవలసియున్నది.

కామతస్తుప్రవృత్తానామి మాస్స్యుః క్రమశోవరాః

(మను 3—12)

శూద్రైవభార్యాశూద్రస్య సాచస్వాచవిశః స్మృతే
తేచస్వాచైవ రాజ్ఞశ్చతాశ్చస్వాచాగ్రజన్మనః

(మను 3—13)

(కామమార్గమున ప్రవర్తించువారికి క్రమముగ నీక్రింద జెప్పబడిన భార్య లుండవచ్చును. శూద్రునకు శూద్రయే భార్య. వైశ్యునకామెయును వైశ్యయు, క్షత్రియునకు నాయిర్వురు క్షత్రియయు, బ్రాహ్మణునకా మువ్వురును బ్రాహ్మణియు నుండవచ్చును.)

ఇంతటి క్రమమున ననుసరించి బ్రాహ్మణ క్షత్రియులకు శూద్రస్త్రీ భార్యయగుట యధమకాముకపక్షముగ తేలుచుండుటచే మనువు పైవాతి శ్లోకములో నీ రెండు విధములగు వివాహములను స్పష్టముగ నిషేధించుచున్నాడు.

న బ్రాహ్మణక్షత్రియయోరాపద్యపిహితిష్ఠతోః
కస్మింశ్చిదపి వృత్తాన్తే శూద్రాభార్యోపదిశ్యతే
హీనజాతిస్త్రియం మోహాదుద్వహన్తో ద్విజాతయః
కులాన్యేవ నయన్త్యాశు ససంతానాని శూద్రతాం॥

(మను 3—14, 15)

(ఆపత్తులో నున్నపుడుకూడ బ్రాహ్మణ క్షత్రియులకు శూద్రభార్య యగుటను జెప్పబడలేదు. మోహముచే శూద్రస్త్రీని వివాహమాడువారు సంతానముతోకూడ తమకులమును శూద్రత్వము నొందించుచున్నారు.)

శూద్రను వివాహమాడినవా డత్రి గౌతముల మతములలోను సంతానమును గనినవాడు శౌనకుని మతములోను మనుమలను గనినవాడు భృగుని మతములోను పతితులగుదురని మనువు చెప్పుచున్నాడు.

శూద్రా వేదీపతత్యత్రేరుతథ్యతనయస్యచ
శౌనకస్యసుతోత్పత్త్యా తదపత్యతయాభృగోః

(మను 3—16)

ఈ శూద్ర భార్యనుగూర్చి యభిప్రాయ భేదములున్న వనియంగీకరించుచు యాజ్ఞవల్క్యు డిట్లు చెప్పుచున్నాడు.

యదుచ్యతే ద్విజాతీనాం శూద్రాద్దారోప సంగ్రహః
నైతన్మమమతం యస్మాత్తత్రాత్మా జాయతేస్వయం

(యాజ్ఞ 1—56)

(శూద్రకులమునుండి భార్యను తీసికొనవచ్చునని చెప్పబడు సంశయము నాకు సమ్మతము కాదు. ఏలన: భార్యయందు తానే పుట్టుచున్నాడు.)

మన ప్రస్తుతాంశము వర్ణములను గుఱించి కాక స్త్రీల వివాహమును గుఱించి మాత్రమే యగుటచే వర్ణాన్తర వివాహ విషయక చర్చ నింతటితో ముగింపవచ్చును.

వధూవర నిర్ణయములో గోత్రప్రవరలు చాల ముఖ్యముగ విచారింపబడవలసి యున్నవి.

అసపిండాచయామాతురసగోత్రాచయాపితుః
సాప్రశస్తాద్విజాతీనాం దారకర్మణిమైథునే

(మను 3—5)

(తల్లికి సపిండురాలు గానట్టియు, తండ్రికి సగోత్రరాలు కానట్టియు స్త్రీ ద్విజునకు వివాహమునకు ప్రశస్తురాలు.)

ఏడు పురుషముల వఱకును సపిండత యుండును గాన మాతృవంశమున నేడుతరములలో జన్మ గల్గిన కన్యను వివాహమాడ రాదని తేలుచున్నది.

మాతృవంశమున నైదు తరముల నియమము చాలు నని కొన్ని స్మృతులు చెప్పుచున్నవి.

మాతృబంధుభ్యశ్చ పంచమాత్

(గౌ. ధ. సూ. 4–5)

(అయిదు తరములలోని మాతృ బంధువులయింటి కన్యను వివాహ మాడరాదు.)

పితృవంశమున నేడు తరముల వఱకును సంబంధము లేని కన్యను చేసికొనవలెనను నియమముకూడ కలదు.

పంచమాత్సప్త పిండాదూర్ధ్వం మాతృతః పితృత స్తథా

(యాజ్ఞ. 1–54)

పంచమీం మాతృబంధుభ్యః సప్తమీం పితృబంధుభ్యః

(వసి. 8–2)

మాతృతః పంచమీం పితృతః సప్తమీం

(లిఖిత 4–1)

మేనత్తమేనమామ బిడ్డలను వివాహ మాడరాదని దీనివలన తేలుచునేయున్నను మనువీ యంశమునీ విధముగ స్పష్టముగ వక్కాణించు చున్నాడు.

పైతృష్వసేయీం భగినీం స్వస్రీయాం మాతురేవచ
మాతుశ్చ భ్రాతుస్తనయాం గత్వాచాంద్రాయణంచరేత్

నతాస్సిస్త్రస్తు భార్యార్థే నోపయచ్ఛేత్తు బుద్ధిమాన్
జ్ఞాతిత్వేనానుపేయాస్తాః పతతిహ్యుపయన్నధః
(మను 11—171, 172)

(మేనత్తమేనమామ కూతులను మేనకోడలిని, పొంది నచో సోదరిని పొందినట్లే, అట్టివాడు చాంద్రాయణము చేసికొనవలెను. వారిముగ్గురను వివాహామాడరాదు. ఏలన వారు జ్ఞాతులే. వారిని వివాహమాడువాడు పతితుడగును.)

ఒకే ప్రవరకలవారుగాని కొందఱు ఋషులైనను కలిసినవారుగాని పరస్పరము వివాహము చేసికొనరాదు.

విందేతవిధివద్భార్యామ సమానార్ష గోత్రజాం
(లిఖిత 4—1)

(సమానార్ష గోత్రములులేని దానిని శాస్త్రీయముగ వివాహమాడవలెను.)

అవివాహ్యాః సగోత్రాస్స్యుస్సమాన ప్రవరా స్తథా.
(నార 12—7)

(సమానగోత్రప్రవరలు గలవారు వివాహమాడరాదు.)

సమానవర్ణమై ప్రవరసంబంధములేనిదై యున్నను గూడ నీక్రింది లక్షణములుగల కులమందు జన్మించిన కన్యను వివాహమాడరాదని మనుస్మృతి చెప్పుచున్నది.

మహాన్త్యపిసమృద్ధాని గోఽజావిధనధాన్యతః
స్త్రీసంబంధేదశైతానికులాని పరివర్జయేత్

హీనక్రియం నిష్పురుషం నిశ్ఛందో రోమశార్శసం
క్షయ్యామయా వ్యపస్మారి శ్విత్రికుష్ఠికులానిచ.

(మను 3—6, 7)

(గోవులు, మేకలు, ధనము, ధాన్యముగల్గి సమృద్ధము లై గొప్పవై యున్నను నీ క్రింది పదికులములును స్త్రీసంబంధములో విడిచిపెట్టతగినవి : (1) జాతకర్మాదిసంస్కారలోపము గలది (2) పురుషసంతతిలేని ది (3) వేదములు చదువుకొననిది (4) పెద్దరోమములు గలది (5) మూలవ్యాధికలది (6) క్షయ వ్యాధికలది (7) అజీర్ణముగలది (8) అపస్మారవ్యాధిగలది (9) బొల్లికలది (10) కుష్ఠుకలది

సోదరులు లేని కన్యను వివాహమాడరాదను సంశయమును 'స్త్రీసంతతి' యను నధ్యాయమున చూచియున్నాము.

ఈ దుర్గుణములు లేక. యితరదుర్గుణములున్నచో నా కులమునుండి కన్యమంచిదైనచో తెచ్చికొనవచ్చును.

స్త్రీరత్నం దుష్కులాదపి

(మను 2—238)

(దుష్కులమునుండినను మంచిస్త్రీని తెచ్చికొనవచ్చును)

దీనినిబట్టి మహాపాతకుని కన్యనైనను చేసికొనవచ్చునని తేలుచున్నది. అట్టికన్యను వివాహమాడుచో నాపూర్వదినమున నామె నుపవసింపజేయవలెనని యాజ్ఞవల్క్యస్మృతి చెప్పుచున్నది.

కన్యాంసముద్వహేదేషాం సోపవాసామకించనాం

(యాజ్ఞ 1—251)

పతితుని కన్యను వివాహమాడవచ్చు నటులను వసిష్ఠుని యీక్రింది వాక్యమాధారమని చెప్పవచ్చును.

పతితేకోత్పన్నః పతితో భవతి అన్యత్రస్త్రియాః

(వసి. 13—51)

(పతితుని బుట్టినవాడు పతితుడు. కాని స్త్రీసంతతి పతితముకాదు.)

దీనికి హేతువు 'స్త్రీసంతతి' యను ప్రకరణమున చెప్పబడినట్లు స్త్రీయందు పురుషునియందువలె పితృతంశము హెచ్చుగ లేకుంటయే యని చెప్పవలెను. ఆపస్తంబుడీదేయంశమును చర్చించుచు పతితుని పుత్రునకుగూడ పతితత్వములేదనినాడు. పతిత్వము పుత్రునకు రాకుండవచ్చునని యాతనివాదము. ఎట్లన :

అంగహీనోపి సాంగంజనయతి.

(ఆ. ధ. సూ. 1—29—11)

(అంగహీనునకు గూడ పూర్ణాంగుడు పుట్టుచున్నాడు గదా!)

హారీతుని వాదము కేవలము దీనికి వ్యతిరేకముగ నున్నది. హారీతుని యభిప్రాయముగ నాపస్తంబుడే యిట్లు చెప్పుచున్నాడు.

దధిధానీ సధర్మా స్త్రీభవతి.

(ఆ. ధ. సూ. 1_29_13)

(స్త్రీ దధిస్థాలివంటిది.)

అనగా: పెరుగు మంచిదే యైనను నపవిత్రస్థాలిలో దానినుంచినచో నది యపవిత్రమగునట్లు భార్య మంచిదేయైనను భర్త పతితుడగుచో నామెకును పతిత్వమంటి యామె స్త్రీ సంతతికూడ నపవిత్రమై గ్రహణార్హము కాకపోవునని దీనివలన తేలుచున్నది.

మొత్తముపైన పతితములగు కులములు పరస్పరము వివాహము చేసికొనుట మంచిదని యాపస్తంబుని యభిప్రాయము.

అభిశస్తాః.........మిథోవివాహమానాః

(ఆపస్తం. 1—29—8)

(అభిశస్తులు పరస్పరము వివాహములు చేసికొనుచుండ వలెను.)

చాల ధర్మశాస్త్రములలో విడువకుండ చెప్పబడిన వధూలక్షణములు రెండుగలవు: (1) ఆమె కిదివరలో వివాహమై యుండకూడదు (2) ఆమె వరునికంటె చిన్నదై యుండవలెను.

అనన్యపూర్వాం యవీయసీం

(గౌతమ 4—1)

(పూర్వ మితరులచే పొందబడనిదానిని తనకంటె చిన్న దానిని వివాహమాడవలెను.)

అనన్యపూర్వికాం కాంతామసపిండాం యవీయసీం

(యాజ్ఞ. 1—53)

(పూర్వ మితరుని పొందనిదియు, సుందరియు, నసపిండ కానిదియు, తనకంటె చిన్నదియునగు స్త్రీని వివాహ మాడ వలెను.)

వసిష్ఠుడు 'అనన్యపూర్వాం' అనుటకు మాఱుగ 'అస్పృష్టమైథునాం' (మిథునకర్మను పొందనిదానిని) అని చెప్పియున్నాడు.

అస్పృష్టమైథునామ వరయవీయసీం.

(వసి. 8—1)

సత్ప్రవర్తనయు, సర్వావయవ పరిపూర్ణతయుగూడ వధువునకు ప్రధానములే యని చాలస్మృతులు చెప్పుచున్నవి.

సర్వావయవసంపూర్ణాం సువృత్తాముద్వహేన్నరః

(హారీత 4—2)

(సర్వావయవ సంపూర్ణమై, మంచినడతగల్గి యున్న దానిని వివాహమాడవలెను.)

రోగముగల కన్యను వివాహ మాడరాదు.

బంధుశీలలక్షణ సంపన్నామరోగా ముపయచ్ఛేత.

(ఆప. గృ. సూ 1—19)

(బంధుశీల లక్షణసంపన్నయు నరోగయునగు దానిని వివాహమాడవలెను)

వరునకు గూడ నిట్టిలక్షణములే యుండవలెను. కాని యాతడు వేదాధ్యయనము చేసియుండవలెననుట విశేషము.

బంధుశీల లక్షణసంపన్న శ్శ్రుతవానరోగ ఇతివరసంపత్

(ఆ. గృ. సూ 1—3—20)

బంధుశీల లక్షణసంపన్నుడు నధ్యయనముచేసినవాడు నగుట వరునిలో నుండవలసిన సంపత్తు)

ఆరోగ్యవిషయములో వరుని పుంస్త్వమును పరీక్షించి యది బాగుగనున్నచో కన్యనీయవలెననియు లేనిచో నీయ కూడదనియు నారదుడు చెప్పుచున్నాడు.

పరీక్ష్యః పురుషః పుంస్త్వే నిజై రేవాంగలక్షణైః
పుమాంశ్చేదవికల్పేన సకన్యాం లబ్ధుమర్హతి.

(నారద 13—8)

వరుడు తన యంగలక్షణములచేతనే పుంస్త్వవిషయములో పరీక్షింపబడవలెను. అందులోటు లేకున్ననే కన్యను పొందుటకర్హుడు.)

ఇచట నారదుడు పుంస్త్వపరీక్షకు సంబంధించిన వివరములను గొన్నిటి నిచ్చియున్నాడు.

వధూనిర్ణయవిషయమున మఱికొన్ని నియమములు గూడ మనువుచే పేర్కొనబడినవి.

నోద్వహేత్కపిలాంకన్యాం నాధికాంగీం నరోగిణీం
నాలోమికాం నాతిలోమాం నవాచాటాం నపింగళాం.

(మను 3—8)

(కపిలవర్ణముగల కేశములుగల్గినదానిని, పెద్దశరీరము గలదానిని, రోమములు హెచ్చుగ గలదానిని, మిక్కిలి మాట్లాడుదానిని, పచ్చనికన్నులు గలదానిని వివాహమాడ రాదు.)

ఏకన్యయొక్క యక్కకు వివాహము కాలేదో యట్టి కన్యను వివాహమాడరాదని స్మృతులు చెప్పుచున్నవి. అట్లు వివాహమాడబడిన కన్యకకు 'అగ్రేదిధిషువు' అని పేరు.

జ్యేష్ఠాయాం యద్యనూఢాయాం
కన్యాయాముహ్యతేనుజా ।
సాచాగ్రేదిధిషూర్జ్ఞేయా
పూర్వాచదిధిషూస్మృతా.

(మను)

(జ్యేష్ఠసోదరి యవివాహితయై యుండగానే కన్య వివాహమాడునో, యాకన్య 'అగ్రేదిధిషు'వని చెప్పబడును. ఆజ్యేష్ఠసోదరికి దిధిషువని పేరు)

దేవలస్మృతికూడ నీ నిర్వచనమునే యిచ్చుచున్నదని మాధవాచార్యులు (పరాశరమాధవీయము 4-24 పై) చెప్పుచున్నారు. కాని యా దేవలస్మృతి మనకిపుడు లభ్యమగుట లేదు.

అగ్రేదిధిషువును వివాహమాడినవాడు పండ్రెండు దినములు కృచ్ఛ్రములు చేసికొనవలెనని వసిష్ఠస్మృతి చెప్పుచున్నది.

అగ్రేదిధిషూపతిః కృచ్ఛ్రంద్వాదశ
రాత్రం చరిత్వానివిశేత తాంచోపయచ్ఛేత్.

(వసిష్ఠ 20—9)

ఇట్టినియమము వరుని విషయములో కూడ గలదు. జ్యేష్ఠునకు వివాహము కాకుండ వివాహమాడువానికి పరివేత్తయని పేరు. అట్టిజ్యేష్ఠునికి పరివిత్తయని పేరు.

పరివిత్తిః పరివేత్తాయయాచ పరివిద్యతే
సర్వే తేనరకం యాన్తిదాతృయాజకపంచమాః

(పరా. 4—25)

(పరివిత్తి, పరివేత్త, యాతని వివాహమాడునది, యాకన్యనిచ్చినవాడు, పురోహితుడు— ఈ యైదుగురును నరకమునకు బోదురు)

కాని యొక్కొకపుడు పరివేదనము దోషము కాదు.

కుబ్జవామననుండేషు గద్గదేషుజడేషుచ
జాత్యంధే బధిరేమూకే నదోషఃపరివేదనే
పితృవ్యపుత్రస్సాపత్న్యః పరనారీసుత స్తథా
దారాగ్నిహోత్రసంయోగే నదోషఃపరివేదనే.

(పరా. 4—27, 28)

(జ్యేష్ఠుడు గూనివాడు, మరగుజ్జు, షండుడు, వణుకు రోగముగలవాడు, స్తబ్ధుడు, పుట్టుగ్రుడ్డి, చెవిటివాడు, మూగవాడు, పినతండ్రికొడుకు, సవతితల్లికొడుకు, పరస్త్రీవలన జనించినవాడునైనచో కనిష్ఠుడు పరివేదనము చేసికొనుటలో దోషములేదు.)

మఱొకవరునిపై దృష్టినిడుకొనియున్న కన్యను వివాహమాడరాదని నారదస్మృతి చెప్పుచున్నది.

దుష్టాన్యగతభావా చ కన్యాదోషాః ప్రకీర్తితాః

(నారద 12—36(

(దుష్టమగు నితరగతభావమును గల్గియుండుటకూడ కన్యాదోషములలోనిదే)

వరపక్షము వారన్వేషణమునకు బోయినపుడు నిద్రపోవుచున్నదానిని, నేడ్చుచున్నవానిని, బయటకుబోయినదానిని వివాహమాడరాదు.

సుప్తాంరుదంతీం నిష్క్రాన్తాం వరణేపరివర్జయేత్.

(ఆ. గృ. సూ 1—3—11)

ఒక కన్యను వివాహమాడుటచే గలుగు లాభాలాభముల విషయమై యొకవిధమగు శకునము చూచుట నాపస్తంబుడు సూచించుచున్నాడు. అదియెట్లన:

(ఆ. గృ. సూ 1—3. 15)

శక్తివిషయేద్రవ్యాణి ప్రతిచ్ఛన్నాన్యుపనిధాయబ్రూయాదుపస్పృశేతి.

(శక్తి ననుసరించి కొన్ని పదార్థములను తెచ్చి వానిని కప్పివుచ్చి యందేదోయొక దానిని స్పృశింపుమని కన్యతో చెప్పవలెను.)

ఆ పదార్థములేవన:

నానాబీజాని సగ్ స్పృష్టాని వేద్యాః పాగ్ సూన్
క్షేత్రాల్లోష్టగ్ శకృచ్ఛ్మశానలోష్టమితి

(ఆ. గృ. సూ. 1–3–16)

(కలిపి యుంచబడిన వివిధములగు గింజలను, యజ్ఞవేదిక లోని ధూళిని పొలమునుండి తేబడిన లోష్టమును, శకృత్తును, శ్మశానమునుండి తేబడిన లోష్టమును.)

పూర్వేషాం స్పర్శనే యథాలింగమృద్ధిః

(ఆ. గృ. సూ. 1–3–17)

(ఈ పదార్థములలో నొకటివాల్గింటిలో దేనినైన కన్య స్పృశించుచో నామెవలన నామెభర్తకు తదనుగుణమైన వృద్ధివచ్చునట్లు గ్రహింపవలెను)

అనగా: ఆమె గింజలను స్పృశించినచో నామెకు సంతాన బాహుళ్యము గల్గుననియు, యజ్ఞవేదికలోని ధూళిని స్పృశించుచో నామె భర్తతోగూడి చాలయజ్ఞములను జేయుననియు క్షేత్రలోష్టమును స్పృశించుచో సస్యసమృద్ధి గల్గుననియు, శకృత్తును స్పృశించుచో పశుసమృద్ధి గలుగుననియు తెలిసికొనవలెను.

ఉత్తమంచపరిచక్షతే.

(ఆ. గృ. సూ. 1–3–18)

(శ్మశానలోష్టమును పెద్దలు గర్హించుచున్నారు) అనగా: కన్య శ్మశానలోష్టమును స్మృశించుచో నామెయో

యామెను వివాహమాడు వాతడో మరణించునని తెలిసికొన వలెను.

కొన్ని విధములైన పేర్లను గల్గిన కన్యలను వివాహ మాడరాదని కూడ చెప్పబడినది.

నర్క్ష వృక్షనదీనామ్నీం నాంత్యపర్వతనామికాం
నపక్ష్యహి ప్రేష్యనామ్నీం నచభీషణనామికాం.

(మను 3—9)

(నక్షత్రనామము, వృక్షనామము, నదీనామము, పర్వతనామము, పక్షినామము, దాసీనామము, భీషణనామము గలదానిని వివాహమాడరాదు)

అవ్యంగాంగీం సౌమ్యనామ్నీం హంసవారణగామినీం
తనులోమకేశదశనాం మృద్వంగీముద్వహేత్ స్త్రియం

(మను 3—10)

(అంగములలో లోపములేనిదానిని, చక్కని పేరుగలదానిని, హంస, యేనుగువలె నడచుదానిని, చిన్న రోమకేశములు, మృదువైన శరీరముగలదానిని వివాహమాడవలెను.)

కన్యానామములో చివరనుండి రెండవవర్ణము రేఫ కాని, లకారముగాని యైయుండకూడదని ఆపస్తంబ గృహ్య సూత్రము చెప్పుచున్నది.

సర్వాశ్చ రేఫలకారోపాంతావరణే పరివర్జయేత్.

(ఆ. గృ. సూ. 1—3_14(

అనగా : గౌరీ, శాలీమున్నగు నామములలో చివరివర్ణము 'ఈ' దానికి పూర్వము రేఫలకారములున్నవిగాన యట్టి నామములు నిషిద్ధములు.

వధువుయొక్క యంగసౌష్ఠవాది విషయములో.

యస్యాంమనశ్చక్షుషోర్ని బంధ స్తస్యామృద్ధిర్నేత రదాద్రియే తేత్యేకే.

(ఆ. గృ. సూ. 1—3—2)

ఎవతెయందు మనస్సు, దృష్టితగులునో యామెను వివాహమాడిననే సంపదగల్గునుగాని మఱొక యాలోచన యక్కఱలేదని కొందఱు చెప్పుచున్నారు.

వధూవరుల వయస్సునుగూర్చి పూర్వాధ్యాయమున తగినంత విపులముగ చర్చింపబడినది కాన నాయంశమీయధ్యాయమున నెత్తుకొనబడలేదు.

# స్మృతికాలపుస్త్రీలు

## చతుర్థాధ్యాయము

### వివాహవిధానము

ఎనిమిది తెఱఁగులవివాహములు స్మృతులలో పేర్కొనబడినవి. కొన్నిస్మృతులలో షడ్విధవివాహములే చెప్పబడినవి. ఈ వివాహములలో కొన్ని యధర్మ్యములనియు వానిని చేసికొనరాదనియు చెప్పబడినది. వివాహభేదములను ముందుగ పరికించి పిమ్మట నాయావివాహముల ప్రాశస్త్యాప్రాశస్త్యములను పరిశీలింతము.

బ్రాహ్మోదైవస్తథైవార్షః ప్రాజాపత్యస్తథాసురః
గాంధర్వో రాక్షసశ్చైవ పైశాచశ్చాష్టమోధమః.

(మను. 3—21)

(బ్రాహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యము, ఆసురము, గాంధర్వము, రాక్షసము, పైశాచము—అని వివాహ మెనిమిదివిధములు)

ఈ యష్టవిధవివాహముల స్వరూపమెట్టిదనిన :

ఆచ్ఛాద్యచార్చయిత్వాచ శ్రుతిశీలవతే స్వయం
ఆహూయదానం కన్యాయా బ్రాహ్మోధర్మ్యః ప్రకీర్త్యతే
యజ్ఞేతువితతే సమ్యగృత్విజేకర్మ కుర్వతే

అలంకృత్య సుతాదానం దైవం ధర్మ్యం ప్రచక్షతే
ఏకం గోమిథునం ద్వేవా వరాదాదాయ ధర్మతః
కన్యాప్రదానం విధివదార్షో ధర్మస్స ఉచ్యతే. 29

సహోభౌ చరతాం ధర్మమితివాచానుభాష్య చ
కన్యాప్రదానమభ్యర్చ్య ప్రాజాపత్యో విధిస్స్మృతః
జ్ఞాతిభ్యోద్రవిణం దత్వాకన్యాయై చైవశక్తితః
కన్యాప్రదానం స్వాచ్ఛంద్యాదాసురోధర్మ ఉచ్యతే
ఇచ్ఛయాన్యోన్యసంయోగః కన్యాయాశ్చవరస్య చ
గాంధర్వస్సతువిజ్ఞేయో మైథున్యః కామ సంభవః
హత్వాభిత్వాచఛిత్వా చక్రోశన్తీం రుదతీం గృహాత్
ప్రసహ్యకన్యాహరణం రాక్షసోవిధిరుచ్యతే
సుప్తాం మత్తాం ప్రమత్తాం వారహోయత్రోపగచ్ఛతి
సపాపిష్ఠోవివాహానాం పైశాచశ్చాష్టమో ధమః.

(మను. 3—27 నుండి 34 వరకు)

(వేదముచదివి చక్కనిశీలము గల్గియున్నవానిని పిలచి వస్త్రాలంకారాదులచే పూజించి యట్లే పూజింపబడిన కన్య నాతనికిచ్చుచో నది బ్రాహ్మవివాహమనబడును. ఇది ధర్మ్య వివాహము యజ్ఞమందు నార్త్విజ్యముచేయువానికి సాలంకృత కన్యాదానము చేయుచో నా వివాహమునకు దైవవివాహమని పేరు. ఇదియు ధర్మ్యమే. ఒకటికాని రెండుకాని గోమిథున ములను యాగాదిసిద్ధికై వరునినుండి తీసికొని విధ్యుక్తముగా

కన్యాదానము చేయుచో నార్షవివాహమగును. అదియు ధర్మ్యమే. 'మీ రిరువురును గలసి ధర్మమాచరింపుడు,' అని నియమముచేయుచు సాలంకృత కన్యాదానముచేయుచో నా వివాహమునకు ప్రాజాపత్యమని పేరు. మఱొకస్త్రీని వివాహమాడరాదనిగాని యిట్టి నియమములోని విశేషము. కన్యకును జ్ఞాతులకును శక్తికొలది ధనమునిచ్చి కోరి కన్యను స్వీకరించుచో నది యాసురవివాహమగును. కన్యావరులు కోరుకొని పరస్పరము పొందుట గాంధర్వవివాహము. ఇది మైథునమునకు హితమైనది. కామమువలన బయలుదేరినది. కన్యయొక్క బంధువులనుచంపి, నరికి, కొట్టి యేడ్చుచున్న కన్యను పితృగృహమునుండి బలవంతముగ తీసికొనిపోవుట రాక్షసవివాహమనబడును. నిద్రపోవుచున్న దానిని, నోడలు తెలియకున్న దానిని, పిచ్చిదానిని, నేకాంతముగ పొందుట పైశాచవివాహము. ఇది వివాహము లన్నిటిలోను పాపిష్ఠము.)

వసిష్ఠస్మృతిప్రాజాపత్య పైశాచములను పేర్కొనలేదు.

బ్రాహ్మదైవఆర్ష గాన్ధర్వక్షాత్రో మానుషశ్చేతి.

(వసిష్ఠ. 2—29)

ఇచట 'క్షాత్రము' రాక్షసమను నర్థమున వాడబడినది.

యాంహరన్తి నక్షాత్రః

(వసిష్ఠ 2—34)

(స్త్రీని హరించి వివాహము చేసికొనుచో నదిక్షాత్రము.

అట్లే 'మానుష' శబ్దము ఆసురార్థమున వాడబడినది.

వణిత్వాధనక్రీతాం సమానుషః

(వసిష్ఠ 3—35)

(స్త్రీని ధనముచే కొని వివాహమాడుచో నది మానుష మని చెప్పబడును)

ఆపస్తంబ ధర్మసూత్రముకూడ నిట్లే ప్రాజాపత్య పైశాచములను వదలివేసినది.

(ఆ. ధ. సూ. 2—12—2(

ఈ యష్టవిధ వివాహములలోను బ్రాహ్మము, దైవము, ఆర్షము, ప్రాజాపత్యము—అను నాల్గును ధర్మ్యములని గౌతముడు చెప్పుచున్నాడు.

చత్వారోధర్మ్యాః ప్రథమాః

(గౌతమ. 4—14)

(మొదటి నాల్గువివాహములును ధర్మ్యములు)

కొందఱి మతములో గాంధర్వరాక్షసములు కూడ ధర్మ్యములే యని గౌతముడు చెప్పుచున్నాడు.

షడిత్యేకే

(గౌతమ. 4—15)

నారదుడు.

ఏషాంతుధర్మ్యాశ్చత్వారో బ్రాహ్మాద్యాస్సముదాహృతాః
సాధారణఃస్యాద్గాన్ధర్వస్త్రయోఽధర్మ్యా స్తతః పరే.

(నారద. 12—44

(వీనిలో బ్రాహ్మము మున్నగు నాల్గేధర్మ్యములు గాన్ధర్వము సామాన్యము. మిగిలిన మూడును నధర్మ్యములు.)

అని చెప్పినాడు.

బ్రాహ్మణునకు బ్రాహ్మదైవార్ష ప్రాజాపత్యములును క్షత్రియునకు గాంధర్వరాక్షసములును మంచివని మనువు చెప్పుచున్నాడు.

చతురోబ్రాహ్మణస్యాద్యాన్ ప్రశస్తాన్ కవయోవిదుః

(మను. 3—24)

గాంధర్వోరాక్షసశ్చైవధర్మ్యౌక్షత్రస్యతౌ స్మృతౌ.

(మను. 3—26)

లిఖితస్మృతికూడ నిట్లే చెప్పుచున్నది.

ఏతేధర్మ్యాస్తుచత్వారః పూర్వంవిప్రేప్రకీర్తితాః

గాంధర్వో రాక్షసశ్చైవ క్షత్రియస్య ప్రశస్యతే.

(లిఖిత 4—3)

గాంధర్వ రాక్షసములలో రాక్షసమే క్షత్రియునకెక్కుడు ప్రశస్తమనియు వైశ్యశూద్రులకు నాసురము ముఖ్యమనియుగూడ మనుస్మృతిలో నొకచోటగలదు.

రాక్షసం క్షత్రియస్యైకమాసురం వైశ్యశూద్రయోః

(మను 3—24)

ఇట మనువు వైశ్య శూద్రులలో కన్యాశుల్క మంగీకరించినాడు. కాని యాతడు స్థలాన్తరమున కన్యాశుల్కమును శూద్రులలో గూడ నిషేధించుచున్నాడు. స్మృతులలోని

యంతరైవరుద్ధ్యములను ప్రక్షిప్తములను ప్రస్తుత గ్రంథమున చర్చించుట సాధ్యముకాదు. కాన నీయంశమిచట చర్చింపబడుటలేదు.

అదదీతనశూద్రోపి శుల్కందు హితరందదత్
శుల్కంహిగృహ్ణా కురుతేచ్ఛన్నం దుహితృవిక్రయం
(మను 9—98)

(శూద్రుడైనను కుమార్తెనిచ్చుచు శుల్కము తీసికొనరాదు. అట్లు తీసికొనుచో కుమార్తె నమ్మినవాడగును.)

ధనమిచ్చి కన్యను తెచ్చికొనుట యత్రిసంహితలో నీక్రింది విధముగ నిందింపబడినది:

క్రియక్రీతాచయాకన్యా పత్నీసానవిధీయతే
తస్యాంజాతాః సుతాస్తే షాంపితృపిండంనవిద్యతే
(అత్రి 377)

(ధనముచే కొనబడిన స్త్రీ పత్ని కానేరదు. ఆమెయందు జనించినవారికి పిండప్రదానము కూడ నుండదు.)

కన్యాశుల్కమును మనువిట్లు నిందించుచున్నాడు.

నకన్యాయాః పితావిద్వాన్ గృహ్ణీయాచ్ఛుల్కమణ్వపి
గృహ్ణంచ్ఛుల్కంహిలోభేనస్యాన్నరోఽ పత్యవిక్రయీ.
(మను. 3—51)

(కన్యయొక్క తండ్రి. తెలిసినవాడగుచో కొంచెమైనను శుల్కమును తీసికొనకూడదు. లోభముచే శుల్కమును తీసికొనుచో సంతానము నమ్ముకొను వాడగుచున్నాడు.)

సంతానము నమ్ముకొనుట యుపపాతకములలో చెప్ప బడినది. (అపత్యస్య చవిక్రయః మను 11—61)

అట్లగుచో నార్షవివాహములో కన్యాదాతకు గోమిథున మీయవలెనని యున్నదికదా యది యపత్య విక్రయ మగుటచే నార్షవివాహము కూడ గర్హ్యమగుట లేదాయను ప్రశ్న బయలుదేరుచున్నది.

ఆర్షేగోమిథునం శుల్కం కేచిదాహుర్మృషైవతత్
అల్పోఽప్యేవం మహాన్వాపి విక్రయస్తావదేవసః.

(మను. 3—53)

(ఆర్షవివాహములోని గోమిథునము కన్యాశుల్కమని కొందఱు చెప్పుచున్నారు. కాని యది యసత్యము. అది శుల్కమే యగుచో నెంత స్వల్పమైనదయినను కన్యా విక్రయమే కావలసివచ్చును. అనగా: అది శుల్కముగాదు. అని తాత్పర్యము)

ఆర్షవివాహ నిర్వచనము చేయుచున్న 'ఏకం గోమిథునం' అను శ్లోకములో 'ధర్మతః' అని యుండుటచేతనే కన్యాదాత యీగోమిథునమును ధర్మార్థము తీసికొనుచున్నాడని తేలుచున్నది. ఆధర్మమేమనగా: 'ఆర్షవివాహ సంపత్తికొఱకవశ్యాచరణీయమైన యాగాది సిద్ధికొఱకు' అని కుల్లూకభట్టు చెప్పుచున్నాడు.

కన్య తండ్రికే కాక కన్యకు శుల్కమునిచ్చుట కూడ గర్హ్యమేయని పైనసీయబడిన యాసురవివాహ నిర్వచన మునుబట్టి తెలియుచున్నది. వివాహసమయమున కన్యకు వరుడేమైన నిచ్చుచోనది శుల్కము కానేరదు.

వివాహసమయమున పలువురు కన్యకు కానుకలిచ్చుట స్మృతులవలన తెలియవచ్చుచున్నది. అది "ధనము" అను నధ్యాయమున వివరింపబడును.

కన్యాశుల్కమువట్ల స్మృతుల దృష్టిని చూచితిమి. వరశుల్కముయొక్క వాసనయైనను స్మృతులలో నెచ్చటను కానవచ్చుటలేదు.

"వివాహమెంత ప్రశస్తమైన సంతానమంత ప్రశస్తమైన దగును. వివాహమెంత నింద్యమైన సంతానమంత నింద్య మగును. కావున నింద్య వివాహములను చేసికొనరాదు" అని మనువు చెప్పినాడు.

అనిందితైః స్త్రీవివాహైరనింద్యా భవతిప్రజా
నిందితైర్నిందితానౄణాం తస్మాన్నింద్యా న్వివర్జయేత్

(మను. 3—42)

త్రిపురుష మార్షాత్

(గౌతమ 4—29)

(ఆర్ష వివాహమువలన మూడు పురుషములు పవిత్రము లగును)

దశదైవాత్

(గౌతమ 4—30)

(దైవవివాహమువలన పదిపురుషములు పవిత్రములగును)

దశైవప్రాజాపత్యాత్

(గౌతమ 4—31)

(ప్రాజాపత్య వివాహమువలన పదిపురుషములు పవిత్రములగును)

దశపూర్వాన్ దశావరాన్ ఆత్మానంచ
బ్రాహ్మీపుత్రో బ్రాహ్మీపుత్రః

(గౌతమ 4—32)

(బ్రాహ్మవివాహమువలన జనించినవాడు పదితరములు క్రిందివారిని పదితరములు పైవారిని తనను పవిత్రులనుగ జేయును)

సందిగ్ధస్థితిలో నున్న మనుస్మృతి దక్క మిగిలినధర్మశాస్త్రము లనేకములు స్పష్టముగ గాంధర్వరాక్షస పైశాచము లప్రశస్తములని గాని యధర్మ్యములనిగాని చెప్పినట్లు పైన చూచియున్నాము. ధర్మ్యములగు బ్రహ్మాదివివాహము లన్నిటిలోను కన్యాదానము జరుగును. కన్యాదానము చేయుటకు తండ్రియే యర్హుడు. ఆతని యాజ్ఞతోగాని యాతడు లేనపుడుగాని యితరులు కన్యాదానము చేయవలెను.

పితాదద్యాత్స్వయం కన్యాం భ్రాతావానుమతేపితుః
పితామహోమాతులశ్చసకుల్యా బాంధవా స్తథా
మాతాత్వభావే సర్వేషాం ప్రకృతౌ యదివర్తతే
తస్యామప్రకృతిస్థాయాం దద్యుఃకన్యాం సనాభయః
యదా తు నైవకశ్చిత్స్యాత్కన్యా రాజానమాశ్రయేత్
అనుజ్ఞయాతస్యవరం ప్రతీత్యవరయేత్స్వయం

(నారద. 12—20, 21, 22)

(తండ్రి స్వయముగ కన్యను దానముచేయవలెను. ఆతని యనుమతితో జ్యేష్ఠసోదరుడుగాని తాతగాని, మేనమామ గాని స్వకులస్థులుగాని బాంధవులుగాని దానము చేయవలెను. వీరెవరును లేనిచో తల్లి కన్యాదానము చేయవలెను. ఆమె తగినస్థితిలో లేనిచో జ్ఞాతులు దానముచేయవలెను. ఎవ్వరును లేనిచో కన్య రాజునొద్దకు పోవలెను. ఆతని యనుజ్ఞనొంది స్వయముగ వరుని నెన్నుకొనవలెను.)

యాజ్ఞవల్క్యు డిట్లు చెప్పుచున్నాడు.

పితాపితామహోభ్రాతా, సకుల్యోజననీతథా
కన్యాప్రదః పూర్వనాశే ప్రకృతిస్థః పరఃపరః

(తండ్రి, తాత, భ్రాత, జ్ఞాతి, తల్లి—వీరిలో పైవారు లేనిచో క్రిందివారు కన్యాదానము చేయవలెను.)

(ద్విజులలో కన్యాదాన ముదకపూర్వకముగనే జరుగ వలెను.

అద్భిరేవద్విజాగ్ర్యాణాం కన్యాదానం ప్రశస్యతే

(యాజ్ఞ. 1-64)

కన్యాదానమైన పిమ్మట కావలసినది పాణిగ్రహణము. సవర్ణవివాహములోనే పాణిగ్రహణ ముండును గాని యసవర్ణ వివాహములలో నదియుండదు. అందలి విధానములు వేరుగ నుండును.

ప్రాణిగ్రహణ సంస్కారః సవర్ణాసూపదిశ్యతే
అసవర్ణాస్వయంజ్ఞేయో విధిరుద్వాహకర్మణి
శరః క్షత్రియయా గ్రాహ్యః ప్రతోదో వైశ్యకన్యయా
వసనస్యదశాగ్రాహ్య శూద్రయోత్కృష్టవేదనే

(మను. 3-35)

(పాణిగ్రహణసంస్కారము సవర్ణస్త్రీల విషయముననే విహితము. అసవర్ణల యందన్నచో యీ క్రింది విధికలదు. బ్రాహ్మణుడు క్షత్రియను వివాహమాడునప్పుడామెను కత్తిని చేతబట్టుకొనవలెను. ఆ కత్తిని వధువుపట్టుకొనవలెను. అట్లే అనులోమ వివాహములో వైశ్యవధువు ముల్లుకోలపట్టుకొన వలెను. శూద్రకన్య పై వర్ణములవారి వస్త్రముయొక్క యంచును గ్రహింపవలెను.)

పాణిగ్రహణమునకు పిమ్మట జరుగు ప్రధానసంస్కారము సప్తపది. దీనితో వధువు పితృగోత్రమును వీడి భర్తృగోత్రమును ప్రవేశించుచున్నది.

స్వగోత్రాద్భ్రశ్యతే నారీ ఉద్వాహాత్సప్తమే పదే
భర్తృగోత్రేణ కర్తవ్యందానం పిండోదకక్రియా

(లిఖిత. 1—27)

(వివాహములో సప్తపదియగుటతోడనే వధువు పితృగోత్రమునుండి భ్రష్టయగుచున్నది. పిమ్మట దానము, పిండోదక క్రియమున్నగువానిని భర్తృగోత్రముతోనే చేయవలెను)

మూడుదినములు వధూవరులు బ్రహ్మచర్యము పాటింపవలెను. క్రిందపరుండవలెను. చేదు, ఉప్పుగల పదార్థములను తినరాదు.

త్రిరాత్ర ముభయోరధశ్శయ్యా బ్రహ్మచర్యం క్షారలవణావర్జనంచ.

అ. గృ. సూ. 3—8—8)

ఇట 'ఉభయోః' అని చెప్పుటచేతను తర్వాతిసూత్రములో 'వారిమధ్యను దండము నుంచవలె'నని చెప్పుటచేతను వధూవరులిరువురు నొకేశయ్యపై పరుండవలెనని స్పష్టమగుచున్నది. కావుననే యీ సూత్రములో బ్రహ్మచర్యనియమనము ముఖ్యమగుచున్నది. వధువు అప్రాప్తవయస్కయైనను వరుడు ప్రాప్తవయస్కుడగుటచే బ్రహ్మచర్యభంగము గలుగుటకవకాశముండుటచే నది పాటింపబడవలెనని స్పష్టముగ చెప్పబడినది.

నాల్గవనాటి తెల్లవారుజామునకు దీక్షముగియును. అప్పుడు జరుగుహోమతో వివాహము ముగియును. దానికే శేషహోమమని పేరు. 'ప్రజాపతేనత్వంమే', అను మూడుబుక్కుల నపుడు జపింపవలెను. అంతటితో వివాహము పూర్తియగును. ఇక మిగిలియున్నది సమావేశనము. 'ఆరోహారుమ్' అను ననువాకశేషమును సమావేశనములో జపింపవలెను.

ఉత్తరాస్త్రిస్రోజపిత్వా శేషగ్ సమావేశనే జపేత్

(ఆ. గృ. సూ. 3—8—10)

పైన తెల్పబడిన కన్యాదానము, పాణిగ్రహణము, సప్తపది, శేషహోమము—అను నాల్గుఘట్టములలో నొక్కొక దాని కొక్కొకప్రాముఖ్యము గలదు. కన్యాదానము వలన వరునకు కన్యపై స్వామ్యము గలుగునని మనువు చెప్పుచున్నాడు. ప్రదానం స్వామ్యకారణం.

పాణిగ్రహణమువలన నామె వరునకు భార్యయగును.

పాణిగ్రహణికామంత్రాని యతందారలక్షణం

(మను. 8—227)

(పాణిగ్రహణమంత్రములు భార్యాత్వము గల్గించును) ఈ పాణిగ్రహణమువలననే భార్యాభర్తలకు కర్మలలో సహత్వము గల్గును.)

పాణిగ్రహణాద్ధిసహత్వం కర్మసు

(బో. ధ. సూ. 11—14—17)

పాణిగ్రహణము వలన గల్గిన భార్యాత్వము సప్తపది వలన స్థిరపడును.

తేషాంనిష్ఠాతువిజ్ఞేయావిద్వద్భిస్సప్తమేపదే.

(మను. 8—227)

శేషహోమముతో వివాహసంస్కారము పూర్తియగును. సప్తపదియైనపిమ్మట వరుడు వధువు నగ్నికి ప్రదక్షిణము చేయించును. వరుడు వధువు నగ్నికి చుట్టును త్రిప్పుట చేతనే వివాహమునకు పరిణయము అను నామము కల్గినది.

గృహ్యసూత్రములలోని క్రమము ననుసరించి స్థాలీపాకాది కర్మకలాపమంతయు వరుని గృహముననే జరుగవలెను.

(ఆ. గృ. సూ .2—5—28)

మత్ప్రచిత మైన "వేదకాలపుస్త్రీలు" అను గ్రంథమున సూర్యాసోముల వివాహవర్ణనావసరమున వివరింపబడిన వైవాహికమంత్రములే గృహ్యసూత్రములలో గూడ విధింపబడినవి గాన వాని నిట మరల వివరించుట పునరుక్తియగు నను నూహతో నవి యిట వదలివేయబడినవి.

వివాహమునకు పూర్వము జరుగు సంబంధనిశ్చయమును గూర్చి యొకింత చెప్పవలసియున్నది. వివాహాంగముగ చెప్పబడిన కన్యావరణము కేవలము సంస్కారమాత్రమే యనుట స్పష్టము.

ఏమన: వధూవర నిర్ణయమంతకు పూర్వమే జరిగి యుండవలెను. అట్లు కానిచో వివాహము జరుగుకాలమున వధూనిర్ణయము చేయుట యసంభవము. వివాహము జరుగుటకు కొంతకాలము పూర్వము వధూవరనిర్ణయము జరుగుటయేకాక యీనిర్ణయము సామాన్య పరిస్థితులలో ననుల్లంఘ్యమను నంశముకూడ స్మృతులవలన తెలియుచున్నది. అట్టి నిర్ణయమైనది మొదలు వివాహమగు లోపల నేవైన కొన్ని యసాధారణ పరిస్థితులు గల్గుచో మాత్రమే యాసంబంధ నిర్ణయమును మార్చుటకు స్మృతులంగీకరించుచున్నవి. అట్టి నిర్ణయము జరుగుటకును వివాహమగుటకును నడుమ కొంతకాలము గడచుట గలదని యీ క్రిందిశ్లోకమువలన తెలియుచున్నది.

ప్రతిగృహ్యాచయః కన్యాంవరో దేశాన్తరంవ్రజేత్
త్రీనృతూన్ సమతిక్రమ్య కన్యాన్యం వరయేద్వరం

(నారద 12–24

(ఏవరుడు కన్యను స్వీకరించి దేశాన్తరము పోవునో యట్టివరునిరాకకై కన్య మూడు ఋతుకాలములు వేచియుండి యాతడప్పటికిని రానిచో మఱొకవరుని కోరుకొనవలెను.)

'వరుడు కన్యను స్వీకరించి' యని చెప్పుటచే నిచటికన్యాకింకను వివాహము కాలేదనియు నామెవాగ్దత్త మాత్రమే యైనదనియు తెలియుచున్నది.

ఇట్టి వాగ్దానమునకును వివాహమునకును నడుమ నెంత కాలము గడచినను నాకన్యావరు లిద్దఱు నించుమించుగ దంపతులేయని చెప్పవచ్చును. వారి సంబంధములో దాంపత్యాంశ మెంతో హెచ్చుగనున్న దనగా: ఆస్థితిలో కన్య మరణించుచో వరుని జ్ఞాతులకా శౌచముండును.

స్త్రీణామ సంస్కృతానాంతుత్ర్య హాచ్ఛుధ్యంతి బాంధవాః
యథో క్తే నైవకల్పేన శుధ్యంతి తుసనాభయః.

(మను. 5—72)

(వివాహముకాని స్త్రీలు మరణించుచో, ననగా వాగ్దత్తలు మరణించుచో, భర్తృజ్ఞాతులు మూడుదినము లాశౌచముపట్టవలెను. ఆమెతండ్రి దాయాదులన్ననో, యిదివఱలో చెప్పిన వివాహిత విషయములోవలెనే, మూడునాళ్లా శౌచము పట్టవలెను.)

దీనివలన వాగ్దాన ప్రాబల్యము స్పష్టమగుచున్నది. వాగ్దత్త భార్యయన్నట్లుకాని కేవలము భార్యకాదని దీనివలన తెలియుచున్నది. జ్ఞాతులకున్నట్లు దశరాత్రాశౌచము విధింపబడలేదు. ఏసంబంధమును లేనివారికివలె నాశౌచము లేకుండగను లేదు. కాన వాగ్దత్త భార్యవంటిదే కాని భార్య కాదనిచెప్పుట యుక్తముగనుండును. అనగా నామె పత్నీభిన్న యేకాని పత్నీసదృశ. అట్లే వాగ్దానపతికూడ పతిభిన్న పతిసదృశుడగుచున్నాడు. 'నఞ్'కు తద్భిన్న తత్సదృశత్వ

మర్థమున్నది కాన నట్టివానిని 'అపతి' యని చెప్పవచ్చును. ఇట్టి 'అపతి' దేశాంతరగతుడై చిరకాలము తిరిగి రానిచో కన్య మఱొకని వివాహమాడవచ్చునని నారదుడు చెప్పు చున్నట్లు చూచియున్నాము. పరాశరస్మృతికూడ నిట్టియభ్య నుజ్ఞ నిచ్చుచున్నది.

నష్టే మృతే ప్రవ్రజితే క్లీబేచ పతితే పతౌ
పంచస్వాపత్సు నారీణాం పతిరన్యో విధీయతే

(పరాశర. 4–30)

(అపతి దేశాన్తరగతుడై తిరిగి రాకపోయినను, చని పోయినను, సన్యాసియైనను, నపుంసకుడైనను, పతితుడైనను— నీయైదాపత్తులలోను—స్త్రీలు మఱొక పతిని పొందవలెను.)

ఇచ్చట అపతిశబ్దము సప్తమ్యేకవచనములో 'అపతౌ' అని యున్నది. దాని పూర్వపదము 'పతితే' అని యున్నది. సంధిలో 'అ' కారము లోపించి 'పతితేపతౌ' అని యైనది ఇచట సంధిలో 'అ' లోపించినదని భావింపక శబ్దమే 'పతౌ' అని యున్నదని భావింపరాదు. ఏలన నార్షములో మాత్రమే పతిశబ్దమునకు సప్తమ్యేకవచనము 'పతౌ' అగును కాని లౌకి కములో 'పత్యౌ' అనియే యుండును. చక్కని యర్థము కుదు రుచున్న పదమును వ్యర్థముగ నార్షముగ విరుచుట న్యాయ్యము కాదు. కావున 'అపతౌ' అనియే పదచ్ఛేదము చేయవలెనని తేలుచున్నది.

వాగ్దాన ప్రాబల్యము మనుస్మృతిలోని యీక్రింది శ్లోకమువలన గూడ తెలియుచున్నది.

ఏతత్తునపరే చక్రుర్నాపరే జాతుసాధవః
యదన్యస్య ప్రతిజ్ఞాయ పునరన్యస్యదీయతే.

(మను 9–99)

(ఒకనికి కన్యను వాగ్దానముచేసి మఱొకని కామె నిచ్చుటను పూర్వనవీన శిష్టులలో నెవరును చేయలేదు.)

వాగ్దానము కూడ కొంత లౌకికాడంబరముతో జరుగుచుండెనని యూహింపవలసియున్నది. ఏలన వాగ్దానము ననుసరించి వివాహము జరుగకపోయినచో వాగ్దానమునకగు వ్యయము నెవరు భరింపవలెనను ప్రశ్న యాజ్ఞవల్క్యస్మృతిలో పరిష్కరింపబడినది.

దత్వాకన్యాం హరన్దండ్యో వ్యయందద్యాచ్చ సోదయం

(యాజ్ఞ 2–144)

(కన్యను వాగ్దానముచేసి మరల తీసికొనినవాడు వాగ్దానవ్యయమును వడ్డీతోకూడ నిచ్చుకొనవలెను.)

వివాహములోని యితరాంశములు "వేదకాలపుస్త్రీలు" అను గ్రంథమున వివరింపబడియున్నవి. అవియే గృహ్యసూత్రములలో గూడ గన్పట్టుచున్నవి. ఒకవిశేషము గలదు. సూర్యాసోముల వివాహమును వర్ణించు మంత్రములను బట్టి యీ వివాహము రజస్వలా వివాహమని తెలియుచున్నదని

నాపూర్వగ్రంథములో సహేతుకముగ దెల్పియుంటిని. ఆమంత్రములే గృహ్యసూత్రములలో వివాహమునకు విధింపబడినవి. గృహ్యసూత్రములును ధర్మసూత్రములును నొకేకాలమున రచింపబడినవని యందఱు నంగీకరింతురు. ఆకాలమున రజస్వల కాకుండ వివాహము చేయుటయే ప్రశస్తముగ భావింపబడుచుండెనని చూచియుంటిమి. అట్టి వివాహములలో రజస్వలా వివాహమునకు వర్తించు మంత్రములను వాడుట యసంగతము గనే కన్పట్టును కాని యట్లు గృహ్యసూత్ర మాదేశించుట మన కాశ్చర్యమును గల్గింపనక్కరలేదు. మంత్రమునకును కర్మకును సంబంధము గన్పట్టని ఘట్టములు కర్మకాండలో చాలగలవు. సాయంసంధ్యావందనములో సూర్యోపస్థానమునకు వరుణదేవతాకమంత్రము చెప్పబడుచున్నది. అంతేకాదు వరుడు చెప్పవలసిన 'అహాంగర్భమదధామ్' (నేను గర్భము నిచ్చితిని) అను మంత్రముతో వధువు నితరుడైనను నభిమంత్రింప వచ్చునని యాతపస్తంబ గృహ్యసూత్రము తెల్పుచున్నది.

అన్యోవైనామభిమంత్రయేత

(ఆ. గృ. సూ. 3—8—11)

ఇట్లే వధువు రజస్వలయని సూచించు మంత్రములను నగ్నికా వివాహములో వాడుటకు గృహ్యసూత్రకారు లాదేశించుటలో నాశ్చర్యములేదు. స్మృతికారులకు నగ్నికా వివాహమే సమ్మతమను సిద్ధాన్తమునకిది యామణ్మాత్రము భంగకరము గాదు. కర్మకును నందుపయోగింపబడు మంత్రముల

కును వైరుద్ధ్యము గన్పట్టుటకుగల హేతువులను విచారించుట యిట నప్రస్తుతమగుటచే నది వదలివేయబడినది.

కర్మకును నందువాడబడు మంత్రములకును వైరుద్ధ్యముకన్పట్టినట్లే గృహ్యసూత్రకారులు చెప్పిన కర్మక్రమమునకును వారిననుసరించి నేడు చేయబడుచున్న కర్మకును కొంత వైరుద్ధ్యమున్నది. పైననీయబడిన 'శేషగ్ సమావేశనేజపేత్' అనుటనుబట్టి 'ఆరోహోరుమ్' మున్నగుననువాక శేషము సమావేశనమందు జపింపబడవలెనని స్పష్టమగుచుండగా శేషహోమమైనవెంటనే ప్రస్తుతము కొందఱు జపించుచున్నారు. వీరిమతములో సమావేశన మప్పుడే జరుగవలెనని కాబోలు! కాని యప్రాప్తవయస్కకు సమావేశనము గావించుట శాస్త్రీయము కాదని భావించికాబోలు వీరు జపమును మాత్రమే యిపుడు కావించి సమావేశనమును ముందునకు నిలిపి వైచుచున్నారు. వంగదేశము మున్నగు కొన్ని ప్రాంతములలో వధువప్రాప్తవయస్కయైనను నపుడే సమావేశనము గావించుటకలదని తెలియుచున్నది. కాని 'శేషగ్ సమావేశనేజపేత్' అనుదానినిబట్టి యిట్టి చిక్కులను పడవలసిన పని లేదు. ఏమన ఆపస్తంబుని మతము అనువాక శేషము సమావేశములో జపింపవలెననియే కాని సమావేశన మిప్పుడే కావింపవలెనని కాదని స్పష్టముగ తెలియుచునే యున్నది.

కాన నామంత్రము నిపుడు జపింపను నక్కరలేదు; సమావేశన మునిపుడు కావింపను నక్కరలేదు. ఈసూత్రభాగమునకు కొందఱు క్రిందివిధముగ నన్వయమును జెప్పుచున్నారు. "అనువాకశేషము నిప్పుడే జపింపవలెను. ఇదియే సమావేశనజపము. సమావేశనమన్ననో ముందెన్నడో కాదగును. ఇట సమావేశన మనగా సమావేశన జపమునియే యర్థము." ఈసమాధానము కూడ యుక్తియుక్తముగనే కన్పట్టుచున్నది. వాగ్రూపసంస్కారమాత్రమున నిపుడు సమావేశనము జరుగవలెనని చెప్పినంత మాత్రమున క్రియారూపసంస్కారముకూడ నిపుడే జరుగవలెనని తేలదు. దీనికి గృహ్యసూత్రములనుండియే యనేకోదాహరణములను జూపవచ్చును. గృహ్యసూత్రములలో కన్యావరణము మున్నగునవి రెండుసార్లు చెప్పబడినవి. ఇందొకటి మాత్రమే క్రియారూపము.

సుప్తాం రుదంతీం నిష్క్రాన్తాం వరణేపరివర్జయేత్.

(ఆ. గృ. సూ. 1–3–11)

ఇది సంబంధనిశ్చయమునకు పూర్వము చేయబడు కన్యావరణమునకు సంబంధించిన విషయము.

సుహృదస్సమవేతాన్మంత్రవతో వరాన్ ప్రహిణుయాత్.

(ఆ. గృ. సూ. 2–2–1)

ఇది సంబంధనిశ్చయమునకు పిమ్మట వివాహసమయమున చేయబడు కన్యావరణమునకు సంబంధించినది.

ఇందు యథార్థముగ కన్యావరణము జరుగుట మొదటి సందర్భములోనే. రెండవసందర్భములోని కన్యావరణము సంస్కారమాత్రమే; కేవలము వాగ్రూపమే. అట్లే శేషహోమమైన వెంటనే జపరూపసంస్కారమాత్రమైన సమావేశనము ముందెన్నడో క్రియారూపమున జరుగవచ్చుననుటలో నేమియు నాక్షేపముండదు. ఆపస్తంబపారస్కరులు దక్క మరేగృహ్యసూత్రకారుడును నిచట నీవిధిని చేయుటలేదు. ఈ యంశము కూడ నిపుడు సమావేశము జరుగనక్కరలేదను నూహకు బలము నొసగుచున్నది.

# స్మృతి కాలపు స్త్రీలు

## పంచమాధ్యాయము

### దాంపత్యము.

భార్యాభర్తలిరువురు నేకే వ్యక్తియను వైదికాభిప్రాయము స్మృతులలో గూడ గన్పట్టుచున్నది.

యోభర్తాసాస్మృతాంగనా.

(మను. 9—45)

(భర్తయే భార్య)

కావుననే భర్తలో భార్య యర్ధభాగమను నభిప్రాయమేర్పడినది. ఇది కేవలము నామమాత్రమే కాక యాచరణములో గూడ నంగీకరింపబడినది. సురాపానము చేయుట పతితత్వాపాదకమగుటచే సురాపానముచేయు స్త్రీయొక్క భర్తలో నర్ధభాగము పతితమగుచున్నదని మనుస్మృతి చెప్పుటచేతనే యిది స్పష్టమగుచున్నది.

పతత్యర్ధం శరీరస్య యస్యభార్యా సురాంపిబేత్.

(మను. 10—26)

(ఎవని భార్య సురాపానము చేయునో యాతనిశరీరములో నర్ధభాగము పతితమగుచున్నది.)

ఎన్నఁడు నొండొరుల నెడబాయుటకు వీలులేనివారు గనుకనే దంపతులిట్టి యైక్యమునొందినట్లు చెప్పబడినారు. ఒకసారి యొకనిని వివాహమాడిన స్త్రీ మఱొకనిని వివాహమాడ రాదని చెప్పుట కీయైక్యమే కారణము.

సకృదంశో నిపతతి సకృత్కన్యా ప్రదీయతే
సకృదాహ దదానీతి త్రీణ్యేతాని సతాం సకృత్.

(మను. 9-47 నారద. 12-28)

(భాగ మొకసారియే పంచబడును. కన్య యొక్కసారియే యీయబడును. దేనినైనను 'ఇచ్చుచున్నాను' అని యొకసారియే చెప్పుదురు. సత్పురుషులకీ మూడును నొకేసారి జరుగును)

పాణిగ్రాహణికా మంత్రాః కన్యాస్వేవ ప్రతిష్ఠితాః
నాకన్యాసు క్వచిన్నౄణాం లుప్తధర్మక్రియాహి తాః

(మను 8—224)

(పాణిగ్రహణమంత్రములు పూర్వము వివాహితలు కాని వారియందే వర్తించును. అకన్యలయందు వర్తింపవు వారు ధర్మక్రియా రహితలుగదా !)

ఒకసారి వివాహమైన స్త్రీకి మరల దానము, పాణిగ్రహణముగూడ లేవని చెప్పుటచే స్త్రీకి పునర్వివాహము లేదని స్పష్టమగుచున్నది.

పురుషుడు భార్యయుండగా మఱొక భార్యను చేసికొను టకు వీలున్నను నాతనికి ద్వితీయవివాహమాత్రమున ప్రథమ భార్యతోడి దాంపత్యము నశింపదు ('పునర్వివాహము' అను నధ్యాయము చూడుడు) భార్యను వదలివైచినను నమ్మివైచి ననుగూడ నామెతోడి దాంపత్యము నశింపదు.

ననిష్క్రయవిసర్గాభ్యాం భర్తుర్భార్యావిముచ్యతే
ఏవంధర్మం విజానీమః ప్రాక్ప్రజాపతివినిర్మితం.

(మను. 9—46)

భర్తయెట్టివాడైనను భార్య యాతనితో భార్యాత్వ మును గల్గియుండుటయే కాక యాతని నచంచలమైన భక్తి తో సేవించుచుండవలెనని స్మృతులు చెప్పుచున్నవి. కాని భార్యలో కొన్ని లోపములుండుచో భర్తయామెను వదలివేయు టకు స్మృతులంగీకరించుచున్నవి. దీనింబట్టి దాంపత్యములో భార్యకంటె భర్త కెక్కుడు నధికారమును స్మృతులంగీకరించు చున్నవని స్పష్టమగుచున్నది. అంతియే కాదు. భార్యాభర్త లొండొరులపట్ల ప్రవర్తింపవలసిన విధానములో గూడ పురు షుని యాధిక్యము వ్యక్తమగుచున్నది. పురుషుడెంత నీచుడై ననుగూడ భార్య యాతని నవమానింపరాదు. ఆతని సేవను వీడరాదు.

విశీలః కామవృత్తోవాగుణైర్వా పరివర్జితః
ఉపచర్యః స్త్రియాసాధ్వ్యా సతతం దేవవత్పతిః

(మను 5—154)

(భర్త శీలరహితుడైనను, కామప్రవృత్తిగలవాడైనను సుగుణములు లేనివాడైనను గూడ భార్య యాతని నెల్లవుడును దేవునివలె పూజింపవలెను.)

ఇదియొక సామాన్యమైన ధర్మముకాదు. స్త్రీ కింతకంటెను నెక్కుడు ధర్మము లేనేలేదు.)

స్త్రీభిర్భర్తృవచః కార్యమేషధర్మః పరః స్త్రియాః.

(యాజ్ఞవల్క్య. 1—18)

(స్త్రీలు భర్తచెప్పినట్లు చేయువలెను, ఇది వారికి పరమ ధర్మము).

నాస్తి స్త్రీణాం పృథగ్యజ్ఞో నవ్రతం నాప్యుపోషితం
పతింశుశ్రూషతే యేన తేనస్వర్గేమహీయతే.

(మను. 5—155)

(స్త్రీకి భర్తతో కూడని యజ్ఞముగాని, వ్రతముగాని, భర్త్రనుమతిపొందని యుపవాసముగాని లేదు. పతిశుశ్రూషచేనామె స్వర్గలోకములో గూడ నధికురాలగుచున్నది.)

అత్రిసంహిత యిట్లు చెప్పుచున్నది.

జీవద్భర్తరియానారీ ఉపోష్యవ్రతచారిణీ
ఆయుష్యంహరతే భర్తుఃసానారీ నరకంవ్రజేత్.
తీర్థస్నానార్థినీ నారీపతిపాదోదకంపిబేత్
శరీరస్యాపివిష్ణోర్వాప్రయాతి పరమంపదం.

(అత్రి. 136, 137)

(భర్తజీవించియుండగా నుపవాసముచేసి వ్రతముచేయు స్త్రీ భర్తయాయున్సును హరించును. ఆమె నరకమునకు బోవును. తీర్థస్నానమును గోరుస్త్రీ భర్తృపాదోదకముగాని శరీరోదకముగాని త్రాగవలెను. ఆమె పరమపదము నొందును)

ఇట్లితరవ్రతముల నన్నిటినివదలి భర్తయే సమస్తవ్రతములనని భావించుస్త్రీకి పతివ్రతయని పేరు. ఇట్టి పతివ్రతలకు విష్ణులోకము గల్గునసగా వారిభర్తలకు కూడ గల్గుననియే యర్థము. ఆమెయు భర్తయు నెన్నడు నొండొరులను వీడరు.

పతివ్రతానాం గృహమేధినీనాం సత్యవ్రతానాం
చశుచివ్రతానాం తాసాం తులోకాః పతిభిస్సమానాః

(వసిష్ఠ. 21—14)

స్త్రీకి పతిలోకమును మించిన లోకములేదు. పతికి నప్రియము చేయుదాని కే లోకములభించదు. కావున నెన్నడు నామె పతి కప్రియము చేయరాదు.

పాణిగ్రాహస్య సాధ్వీ స్త్రీజీవతో వామృతస్యవా
పతిలోకమ భీప్సంతీనా చరేత్కించి దప్రియం

(మను 5—156)

(భర్త జీవించియున్నను మృతిచెందినను గూడ యోగ్యురాలగు స్త్రీ యాతని లోకమునుగోరుచు కొంచెమైనను నప్రియము చేయరాదు.)

భర్త మృతుడైననుగూడ నామెతదేకలగ్న మనస్కయై యాతనియందచంచలభక్తిగలదై మనోవాక్కాయములచే పవిత్రురాలుగ నుండవలెను. ఏలన దాంపత్యము కేవల మీజన్మతోనే యంతరించునదికాదు (ఈయంశము 'పునర్వివాహ'మను నధ్యాయమున వివరింపబడును.)

పతిసేవయే పరమధర్మముగ గల స్త్రీకి 'సాధ్వి' యను నామము వాడబడుటచేతనే స్త్రీకి పతిసేవకంటె నెక్కుడు సాధు (మంచి) గుణములేదని తెలియుచున్నది. అట్లే యట్టి స్త్రీకి సతి (యోగ్యురాలు) అను నామముగూడ గలదు.

పతింయానాభి చరతిమనోవాగ్దేహ సంయతా
సాభర్తృలోక మాప్నోతి సద్భిస్సాధ్వీ తిచోచ్యతే

(మను 5-165)

(ఏ స్త్రీ మనోవాక్కాయ నియమముకలదై భర్త నతిక్రమింపకుండునో యామె భర్తృలోకము నొందను సత్పురుషులచే సాధ్వియని చెప్పబడును.)

ఇది స్త్రీల కవశ్యముండవలసిన ధర్మము. దీనివలన నైహికాముష్మిక లాభమెంతయో కలదు.

అనేననారీవృత్తేన మనోవాగ్దేహ సంతయా
ఇహాగ్ర్యాం కీర్తిమాప్నోతి పతిలోకం పరత్రచ

(మను 5-166)

(మనోవాక్కాయ నియమముగలదై యుట్టి ప్రవర్తన గల స్త్రీ యీలోకములో కీర్తిని పరమున పతిలోకమును పొందును.)

ఈధర్మముండుట స్త్రీ కెంత (శ్రేయస్కరమో యిది లేకుండుట యంత వినాశకరము. భర్త నుల్లంఘించుటయే స్త్రీకి మహాదోషము.

భర్తారం లంఘయేద్యాతు స్త్రీజాతి గుణదర్పితా
తాంశ్వభిఃఖాదయేద్రాజాసంస్థానే బహుసంస్థితే

(మను 8–371)

(ఏ స్త్రీ పుట్టింటివారి స్థితినిబట్టి గర్వించి భర్తనవమానపఱచునో యామెను రాజు నిండుసభలో కుక్కలచే తినిపింపవలెను.)

భర్తృశాసనముల్లంఘ్య యాచస్త్రీ విప్రవర్తతే
తస్యాశ్చైవ నభోక్తవ్యం విజ్ఞేయా కామచారిణీ

(అంగిరః 69)

(ఏ స్త్రీ భర్తాజ్ఞ నుల్లంఘించి ప్రవర్తించునో యామె చేతియన్నము తినరాదు, ఆమె కాముచారిణి)

స్త్రీకి భర్తనుమించిన సేవ్యవస్తువు లేదు.

గురురగ్నిర్ద్విజాతీనాం వర్ణానాం బ్రాహ్మణోగురుః
పతిరేకోగురుఃస్త్రీణాం సర్వస్యాభ్యాగతో గురుః

(ఉశనః 1–47)

(బ్రాహ్మణుల కగ్ని గురువు. వర్ణములకు బ్రాహ్మణుడు గురువు. స్త్రీలకు భర్తగురువు. అభ్యాగతుడందఱకు గురువు)

భర్తృశుశ్రూషవలన లభించని ఫలమే లేదని శాస్త్రములు చెప్పుచున్నవి.

భర్తృశుశ్రూషయైన స్త్రీకాన్నాలోకాన్ సమశ్నుతే
దివఃపునరిహాయాతా సుఖానామంబుధిర్భవేత్

(కాత్యాయన 9–12)

(పతిశుశ్రూషచే సతి యేలోకములను పొందలేదు? ఆమె స్వర్గమునకుబోయి తిరిగివచ్చి యిట సుఖసముద్రమగును)

భార్యాభర్తలపట్ల కన్పఱచిన భక్తి సాపేక్షమైనది కాక కేవలము నిరపేక్షమైనదని యిదివఱలో చూచియున్నాము. కొన్ని కొన్ని పరిస్థితులలో భర్తను భార్య నిర్లక్ష్యము చేసినచో నామెకు లౌకికమగు శిక్షకూడ కలదని మనువు చెప్పుచున్నాడు.

అతిక్రామేత్ప్రమత్తం యామత్తంరోగార్తమేమవా
సాత్రీన్మాసాన్ పరిత్యాజ్యా విభూషణపరిచ్ఛదా.

(మను 10–78)

(భర్త ద్యూతాదిదుర్వ్యసనములు గలవాడు, మద్యపానాదులచే నొడలు తెలియనివాడు, రోగముచే నార్తుడునైయున్నపుడు భార్య యాతనిమాట విననిచో నామెకు శిక్షగ భర్త యామె వస్త్రభూషణములను తీసికొని మూడుమాసములు వదలివేయవలెను.)

భర్తపైన వివరింపబడిన యవస్థలలో నున్నవుడు భార్య యాతనిమాట వినుటకూడ ప్రమాదహేతువే కావచ్చును గావుననే యీయామె యాతనిమాట నుల్లంఘించుట కంతస్వల్ప మగు శిక్షవిధింపబడినది.

కొన్నిసమయములలో భర్తపట్ల ద్వేషభావమును గల్గియుండు స్త్రీని భర్త వదలివేయరాదు.

ఉన్మత్తంపతితంక్లీబమబీజం పాపరోగిణం
నత్యాగోస్తిద్విషంత్యాశ్చనచదాయాపవర్తనం.

(మను. 9—79)

(పిచ్చివాడు, పతితుడు నపుంసకుడు, బీజములేనివాడు, కుష్ఠియగు భర్తను ద్వేషించిన స్త్రీని భర్త వదలిపెట్టరాదు. ఆమెకు దాయము నీయకుండ నుండరాదు)

అట్టిహీనస్థితిలోనున్న భర్త భార్యనువదలుచో నాతని స్థితి మఱింత హీనమగునను హేతువుచేతనో భర్తయైనను నట్టిస్థితిలో నుండునపుడు ద్వేష మణుమాత్రమైనను గన్పఱుపకుండుట సామాన్య స్త్రీలకు సాధ్యముకాదు కావున దానికి పెద్దశిక్ష వేయుట మంచిదికాదను హేతువుచేతనో యామెను త్యజింపరాదని చెప్పబడినదికాని యామె దోషవంతురాలు కాదనుభావముతో కాదు. వ్యాధితుడగు భర్త నవమానించు భార్య కుక్క పందియై పుట్టునని పరాశరుడు చెప్పుచున్నాడు.

దరిద్రం వ్యాధితం మూర్ఖం భర్తారం యావమన్యతే
సాశునీ జాయతే మృత్వా సూకరీచ పునః పునః

(పరాశర 4—16)

(దరిద్రుడు, వ్యాధితుడు, మూర్ఖుడు, నగు భర్తనే స్త్రీ యవమానించునో యామె కుక్కయై జన్మించును. అనేక జన్మలలో కుక్కయు పందియు నగుచుండును.)

పైన వర్ణింపబడిన పాతివ్రత్యము స్థిరమైనదనుట ప్రధానాంశము. ఈ స్థిరత్వము వధువునకు వివాహములోనే బోధింపబడును. ఎట్టి పరిస్థితులలోను గూడ నామె భర్తను వీడక రాతివలె స్థిరముగ నుండవలెననుటకై యామెను వివాహములో నొకరాతిపై నెక్కింతురు.

అశ్మానమాస్థాపయతి తిష్ఠేతి

(ఆ. గృ. సూ. 2-5—2)

‘అతిష్ఠేమమశ్మానమశ్మేవత్వగ్ స్థిరాభవ’ అనుమంత్రమును చదువుచు నామెను రాతిపై నెక్కింపవలెనని దీనియర్థము. ‘ఈ రాతి నధిష్ఠింపుము. దీనివలెనే స్థిరురాలవుగ నుండుము’ అని యీ మంత్రమున కర్థము.

పురుషుడుకూడ భార్య నట్లే యెన్నడును వదలరాదు. కాని భార్య యెట్టిదైనను నాతడు వదలరాదను నియమము లేదు. సాధ్వి నెన్నడును వదలరాదను నియమము మాత్రము గలదు.

దేవదత్తాం పతిర్భార్యాం విందతే నేచ్ఛయాత్మనః
తాంసాధ్వీం బిభృయాన్నిత్యం దేవానాం ప్రియమాచరన్
(మను 9—95)

(ఎవ్వడును భార్యను తనయిచ్ఛచే వివాహమాడుట లేదు. దేవతలు పురుషునకు భార్య నిచ్చుచున్నారు. అట్టిసాధ్వియైనభార్యను నెల్లపుడును భరింపవలెను. అట్లుచేయుచో దేవతలకు ప్రియమగును.)

భార్యనువదలినవారికి ఘోరమగుశిక్షను బోధాయనుడు విధించుచున్నాడు.

దారవ్యతిక్రమీ ఖరాజినం బహిర్లోమపరిధాయ దారవ్యతిక్రమిణే భిక్షామితిసప్తాగారాణిచరేత్ సాస్యవృత్తిష్షణ్మాసాన్.
(బో. ధ. సూ. 1—28—18)

(భార్యను వదలినవాడు గాడిదచర్మమును, వెంట్రుకలు పైకివచ్చునట్లు కప్పుకొని 'భార్యనువదలిన నాకుభిక్షవేయుడు' అని చెప్పుచు నారుమాసములు దినమున ఏడిండ్లచొప్పున భిక్షనెత్తుకొనవలెను.)

కొన్ని దుష్టగుణములుగల భార్యను వదలివేయవచ్చునని మన్వాదిస్మృతులు చెప్పుచున్నట్లు పునర్వివాహము అను నధ్యాయమున చూడగలము. దక్షస్మృతి యిట్లు చెప్పుచున్నది.

అదుష్టాంపతితాం భార్యాంయౌవనేయః పరిత్యజేత్
సజీవనాన్తే స్త్రీత్వంచవంధ్యత్వంచ సమాప్నుయాత్

(దుష్టురాలు కానట్టియు రోగాదులచే వడియున్నట్టియు భార్యను వదలినవాడు ఉత్తరజన్మలో వంధ్యస్త్రీయగును.)

భర్తను భార్య సేవించినట్లే భర్తకూడ నిరంతరము భార్యకు మనస్తృప్తిని గలుగజేయుచుండవలెను.

ఉభయులును సంతుష్టులైననే కాని గృహము శోభింపదు. ఆతడామె నెన్నడు నవమానింపరాదు.

మాన్యాచేన్మ్రియతే పూర్వంభార్యా పతివిమానితా
త్రీణిజన్మానిసా పుంస్త్వంపురుషస్త్రీత్వమర్హతి
(కాత్యాయన. 20-13)

(పూజ్యురాలైన భార్య భర్తచే నవమానింపబడి మరణించుచో మూడుజన్మలామె పురుషుడును నాతడు స్త్రీయు నగుట కర్హులు.)

సంతుష్టో భార్యయాభర్తా భర్త్రా భార్యాతథైవచ
యస్మిన్నేవ కులేనిత్యం కల్యాణం తత్రవైధ్రువం
యదిహిస్త్రీ నరోచతే పుమాంసం నప్రమోదయేత్
అప్రమోదాత్పునః పుంసః ప్రజనం నప్రవర్తతే
స్త్రియాంతురోచ మానాయాం సర్వంతద్రోచతేకులం
తస్యాంత్వరోచ మానాయాం సర్వమేవ నరోచతే
(మను 3-60, 61, 62)

(భర్తతో భార్యయు భార్యతో భర్తయు సంతుష్టులైన కులములో మంగళము నిత్యముగనుండును. స్త్రీ తృప్తురాలు కానిచో పురుషుడు సంతుష్టుడు కాడు. పురుషుడు సంతుష్టుడు కానిచో సంతతియే కలుగదు. స్త్రీ సుఖముగనుండుచో కులమెల్లయు ప్రకాశించును. స్త్రీ సుఖముగా నుండనిచో కులము కూడ ప్రకాశింపదు.)

కావున భర్త ఋతుకాలగమనమాత్రముననే కాక యితరమార్గములచే కూడ భార్యను సంతోష పెట్టవలెను.

అనృతావృతుకాలే చ మంత్రసంస్కారకృత్పతిః
సుఖస్య నిత్యం దాతేహ పరలోకే చ యోషితః

(మను 5—153)

ఈవిధముగ నన్యోన్యప్రేమతో నుండు దాంపత్యము దక్షస్మృతిలో నిట్లు కీర్తింపబడినది.

అనుకూలా న వాగ్దుష్టా దక్షా సాధ్వీ ప్రియంవదా
ఆత్మగుప్తా స్వామిభక్తా దేవతా సా న మానుషీ
అనుకూలకళత్రో య స్తస్య స్వర్గ ఇహైవ హి
ప్రతికూలకళత్రస్య నరకో నాత్ర సంశయః
స్వర్గేపి దుర్లభం హ్యేత దనురాగః పరస్పరం

(అనుకూల, ప్రియభాషిణి, కుశల, సాధ్వి, గుట్టుకలది, పతిభక్తికలదియగు స్త్రీ దేవతయే కాని మానుషి కాదు. అనుకూలురాలైన భార్య కలవానికి స్వర్గమిచ్చటనే కలదు.

ప్రతికూలురాలైన భార్య కలవానికి నరకమిచ్చుటనే కలదు. ఇట్టి యనురాగము స్వర్గములో కూడ నుండదు.)

భార్య యనుకూలురాలు కానిచో నామె నట్లు చేయవలసిన బాధ్యతకూడ భర్తపైననే కలదు. సకాలములో నామె నాతడు బాగుచేయనిచో నామె శాశ్వతముగ చెడిపోవును.

అవశ్యాసాభ వేత్పశ్చాత్ యథావ్యాధిరు వేక్షితః

(దక్ష 4—8).

అట్టి భార్యను జక్కచేయుటకై యామెను కొట్టుట యవసరమగుచో నట్లు చేయవచ్చునని లిఖితస్మృతి చెప్పుచున్నది.

లాలనీయా సదాభార్యా తాడనీయా తథైవచ
లాలితా తాడితాచైవ స్త్రీ శ్రీర్భవతినాన్యథా

(లిఖిత 4—16).

(భార్యను లాలనజేయుట యెట్లు కర్తవ్యమో యవసరమగుచో శిక్షించుటకూడ నట్లే కర్తవ్యము. అందువలన స్త్రీ శ్రీ యగుచున్నది.)

భిన్నాశయాదర్శప్రకృతులుండుచో దంపతులలో ననుకూలత ప్రవేశించును. ఎవరో యొకరు మఱొకరి మార్గమున బడుచో నా యననుకూలత నశించును. ఇరువురును గూడ నట్లు చేయుటకు యత్నింపవలసినదే కాని పైన వివరింపబడిన పురు

షుని యాధిక్యహేతువుచే భార్యయే యట్లు మారుట మంచిది. ఆదర్శాశయప్రకృతులలో భార్యను భర్తతో సమన్వయింప జేయుటకై బోధాయనగృహ్యసూత్రములో నొక ప్రక్రియ గలదు.

అథాస్యా ఉపోత్తానదక్షిణేన హస్తేన దక్షిణమంసం ప్రతిబాహుమన్వవహృత్య హృదయదేశమభిమృశతి 'మమ హృదయే హృదయంతే అస్తు. మమచిత్తే చిత్తమస్తు. మమ వాచమేకమనా శ్రుణు. మామేవాను వ్రతా సహాచర్యామయా భవ' ఇతి అథాస్యై దక్షిణే కర్ణేజపతి. మాం తేమనః ప్రవిశతు మాంచక్షుర్మాము పేతుభగః మయిసర్వాణి భూతాని మయి ప్రజ్ఞానమస్తు తే.

(బో. గృ. సూ. 1—4)

(వరుడు కుడిచేతితో వధువుయొక్క దక్షిణాంసమును గూర్చి బాహువునెత్తి హృదయదేశమును స్పృశించి యిట్లు చెప్పుచున్నాడు. 'నాహృదయమందు నీ హృదయముండు గాక! నాచిత్తమందు నీచిత్తముండుగాక! నావాక్కు నేక మనస్కవై వినుము. నన్ననుసరించియే వ్రతముగలదాన వగుము. నాతో సహచర్యవగుము.' ఆమె కుడిచెవిలో నిట్లు జపించుచున్నాడు. 'నీమనస్సు నన్ను ప్రవేశించుగాక! నీ నేత్రము, భగము నన్ను ప్రవేశించుగాక! నీకు నాయందే సర్వభూతములు గన్పట్టుగాక! నాయందే నీకు ప్రజ్ఞానముండు గాక!')

శారీరకముగ రెండువ్యక్తులైన స్త్రీ పురుషులు మానసికముగ నొకే వ్యక్తి యగుటయే దాంపత్యప్రధానలక్షణమని పైన జెప్పబడిన యంశమువలన దేలుచున్నది. భర్త శాసకు డగుటచే నాతని ననుసరించి భార్య మారును.

యొక్కడు సహజము.

యాదృగ్గుణేన భర్త్రాస్త్రీ సంయుజ్యేత యథావిధి
తాదృగ్గుణాసా భవతి సముద్రేణేవ నిమ్నగా

(మను 9—22)

(నది సముద్రముతో గలసి సముద్రోదకరుచినే పొందినట్లు స్త్రీ యెట్టిగుణములుగల భర్తతో గూడినట్టి గుణములు గలదే యగును.)

కాన నీచజన్మగల స్త్రీ యుత్కృష్టపురుషుని వివాహ మాడుచో నామెయు నుత్కృష్టత నొందును.

అక్షమాలావసిష్ఠేన సంయుక్తాధమయోనిజా
సారంగీమందపాలేన జగామాభ్యర్హణీయతాం
ఏతాశ్చాన్యాశ్చలోకే స్మిన్నపకృష్ట ప్రసూతయః
ఉత్కర్షం యోషితః ప్రాప్తాః స్వైస్స్వైర్భర్తృగుణైః శుభైః

(మను 9—23, 24)

(అధమయోనిజ యగు నక్షమాల వసిష్ఠునితోను, సారంగిమందపాలునితోను కూడి గౌరవము నొందిరి. వీరును నితర నీచకులజలగు స్త్రీలును వారివారి భర్తల సుగుణములచే ఘనతను పొందిరి.)

ఉత్కృష్టుడైన భర్త తన సుగుణప్రభావముచే భార్య యొక్క నైచ్యమును బోగొట్టి యామె నుద్ధరించునట్లే పతివ్రతయైన స్త్రీకూడ పాపియైన భర్తను పుణ్యాత్మునిగ జేయగలదు.

వ్యాలగ్రాహీ యథా వ్యాలం బలాదుద్ధరతేబిలాత్
తథా సా పతిముద్ధృత్య తేనైవ సహమోదతే

(దక్ష 4—20)

(పాములవాడు పామును బిలమునుండి పైకి లాగునట్లు సహగమనము చేసిన స్త్రీ పతి నీచుడైనను నాతని నుద్ధరించి స్వర్గములో నాతనితో మోదము నొందును.)

భర్త యుత్కృష్టతచే భార్యకుగూడ నుత్కృష్టత వచ్చుట కేవలము నాధ్యాత్మికవిషయములోనే కాదు. లౌకికవ్యవహారములలో గూడ నట్లే జరుగును. వయస్సు యొక్క యాధిక్యముచే జ్యేష్ఠుడు కనిష్ఠునకు పూజ్యుడు. జ్యేష్ఠుని భార్య కనిష్ఠునికంటెను వయస్సులో చిన్నదే యైనను నాతనికి పూజ్యురాలే యగును. ఏలన నట్టి సందర్భములలో భార్య భర్తతో సమానమైన వయస్సు గలదిగనే పరిగణింపబడును.

పతివయసః స్త్రియః

(బో. ధ. సూ. 1—16. 21)

(స్త్రీలు పతి వయస్సుతో సమానమైన వయస్సు గలవారు.)

అట్లే కేవల దాంపత్యప్రభావముచే గురుపత్ని గురువు వలెనే పూజ్యురాలగుచున్నది.

గురువత్ప్రతిపూజ్యాస్స్యుస్సవర్ణా గురుయోషితః

(మను 2—120)

ధనవిషయమునను కర్మవిషయమునను భార్య కెట్టిస్థానము గలదను సంశయము 'ధనము' 'కర్మకాండ' యను రెండధ్యాయములలో వివరింపబడును. ఇచట నొకముక్క చెప్పవలెను. ఆముష్మికసుఖసాధనమైన కర్మకాండయంతయు భార్యాధీనమే యై యున్నది. భార్య లేకుండనే యజ్ఞము చేయుటకును పురుషున కధికారము లేదు. అతిథిపూజమున్నగు సత్కర్మలెన్నియో భార్యాధీనములై యున్నవి. (కర్మకాండ యను నధ్యాయమును జూడుడు.) అనగా సత్కర్మలన్నిటికిని ఫలమగు స్వర్గముకూడ భార్యాధీనమే యని తెలుచున్నది.

దారాధీన స్తథాస్వర్గః

(మను 9—28)

(పురుషునకు స్వర్గమువచ్చుట భార్య యధీనమున నున్నది.)

భార్య లేనివానికి ధర్మమేకాక యర్థకామములుకూడ నుండవు. బ్రహ్మచారిగాని వానప్రస్థుడుగాని సన్యాసిగాని ధనము సంచుకొనరాదు. అనుభవింపనురాదు. ఇంద్రియ జయము వారి ప్రధానసంపాద్యము. గృహస్థునకన్నను

భార్యాగమనాది ధర్మావిరుద్ధ కామానుభవాధికారము గలదు. ఇది యంతయు భార్య యున్నంతమాత్రముననే జరుగదు. ఆమె వశవర్తినియై యుండుట యవసరము. ధర్మకార్యములలో పాల్గొనుట కామె నిరాకరించి గృహనిర్వాహణము చక్కగ చేయక, భర్తకు భోగములకు వీలుగల్పింపనిచో పురుషుడు ధర్మార్థకామములనెడు త్రివర్గము నుండి భ్రష్టుడగుచున్నాడు.

గృహాశ్రమ సమంనాస్తి యది భార్యా వశానుగా
తయా ధర్మార్థ కామానాం త్రివర్గఫలమున్నుతే
(దక్ష 1—1, 2)

(భార్య వశురాలైనచో గృహాశ్రమముతో సమానమైన యాశ్రమము లేదు. పురుషు డామె మూలమున ధర్మార్థకామముల ఫలము నొందుచున్నాడు.)

కావుననే యాజ్ఞవల్క్యుడు కూడ
యత్రానుకూల్యం దంపత్యో స్త్రివర్గ స్తత్రవర్తతే
(యాజ్ఞ 1—5)

(దంపతుల కానుకూల్యముండుచోట ధర్మార్థకామము లుండును.)

ప్రథమాధ్యాయములో తెలుపబడినట్లు పురుషునకు నరకనివారణమును పుణ్యలోకప్రాప్తిని గల్గించు పుత్రుని కూడ భార్యయే యిచ్చుచున్న దనుటచే నామె ప్రాముఖ్యము స్పష్ట

మగుచున్నది. నా పూర్వగ్రంథములో నవశ్యాపాకరణీయము లుగ నిరూపింపబడిన మూడు ఋణములలో రెండు ఋణములు (దేవపితౄణములు) భార్య యున్ననే కాని యపాకరింపబడుటకు వీలులేదని యీవిధముగ తెలుచున్నది. ఈఋణములను తీర్పకుండ మోక్షమునకు యత్నించుటకు కూడ వీలులేదని స్మృతులు తెల్పుచున్నవి.

అనధీత్య ద్విజో వేదాననుత్పాద్య తథా సుతాన్
అనిష్ట్వా చైవ యజ్ఞైశ్చ మోక్ష మిచ్ఛన్ వ్రజత్యధః
(మను 6—37)

(వేదములను జదువక, పుత్రులను కనక, యజ్ఞములను జేయక మోక్షము గోరువాడు పతితు డగును.)

మానవుడు తానే పుత్రరూపమున జన్మించుచున్నవాడగుటచేతను దుష్టమాతకు దుష్టపుత్రుడు గల్గును గావునను తనను దుష్టత్వమునుండి కాపాడుకొనదలచువాడు తప్పక భార్యను సన్మార్గవర్తిని గావింపవలెను. భార్య చెడ్డది యగుచో తన జన్మ చెడ్డది యగును; తన చరిత్రము చెడ్డ దగును; తాను చెడ్డవా డగుచున్నాడు. కావున భార్యను చక్కని స్థితిలో నుంచుకొనుట ప్రతిమానవునకును నవశ్యకర్తవ్యము.

పతిర్భార్యాం సంప్రవిశ్య గర్భో భూత్వేహ జాయతే
జాయాయాస్తద్ధి జాయాత్వం యదస్యాం జాయతే పునః
(మను 9—8)

(భర్త భార్యలో ప్రవేశించి గర్భమై జనించుచున్నాడు. భర్త యామెయందు జనించుచున్నాడు కావుననే భార్యకు జాయ యని పేరు.)

స్వాం ప్రసూతిం చరిత్రం కులమాత్మాన మేవచ
స్వంచ ధర్మం ప్రయత్నేన జాయాంరక్షన్హి రక్షతివా

(మను 9—7)

(భార్యను రక్షించుకొనువాడు తన జన్మను, చరిత్రను, కులమును, తనను, తన ధర్మమును రక్షించుకొనుచున్నాడు.)

పురుషుడు తానే భార్యనుండి పుట్టుచున్నాడని పైన తెల్పబడినది. అనగా పురుషుడు తన దేహమును వీడినను పుత్రరూపమున జీవించియుండును. కాన పుత్రుడు తండ్రికి నమృతత్వము నిచ్చినవా డగుచున్నాడు. పితరుల ఋణమును గూడ దీర్చుచున్నాడు.

ఋణమస్మిన్సన్నయత్యమృతత్వం వచగచ్ఛతి
పితాపుత్రస్య జాతస్య పశ్యేచ్చే జీవతోముఖం

(వసిష్ఠ 17—1)

(సజీవుడై జనించిన పుత్రుని ముఖము జూచిన తండ్రి తన పితౄణఋణమును తీర్చివైచి దానిని కుమారునియం దర్పించుచున్నాడు. మఱియు నమృతత్వము నొందుచున్నాడు.)

పై యంశముల నన్నిటిని జూడగా పురుషుని సమస్తసుఖములును భార్య యధీనములే యై యున్నవని తెలియగలదు. ఆమె యాతని కనేకములగు లౌకికసుఖముల నిచ్చుటయే కాక

యాతని యొక్కయు నాతని పితరులయొక్కయు స్వర్గప్రాప్తికి హేతు వగుచున్నది,

అపత్యం ధర్మకార్యాణి శుశ్రూషా రతిరుత్తమా
దారాధీన స్తథా స్వర్గః పితౄణా మాత్మనశ్చహా
(మను 9—28)

(సంతానము, ధర్మకార్యములు, సేవ, యుత్తమసుఖము, తనకును తన పితరులకును సుఖము. ఇవి యన్నియు భార్య యధీనములే యై యున్నవి.)

కావుననే యిదివఱలో తెల్పినట్లు మానవునకు వివాహ మవశ్యకర్తవ్య మైనది. యావజ్జీవము జితేంద్రియుడుగనే యుండు పురుషుడు మాత్రము వివాహ మాడకుండినను దోషము లేదని కొందఱి మతము. అట్లుండగోరువాడు స్నాతకుడైన పిమ్మట వివాహ మాడుటకు బదులు నైష్ఠికబ్రహ్మచర్యమున ప్రవేశించును.

తస్యాశ్రమ వికల్ప మేకే బ్రువతే.
(గౌ. ధ. సూ. 3—1)

(వాని కాశ్రమవికల్పమును గొందఱు చెప్పుచున్నారు.)

కావున సాధారణముగ దాంపత్యజీవిత మందఱకు నవశ్యమే యగుచున్నది. ఈ జీవితములో భార్యాభర్తలు శారీరకము గవృథక్వ్యక్తులే యై యున్నను సమస్త విషయములలోను నవినాభావమును నిర్విశేషమును నగు జీవయా

ప్రేమానుభవము గలవారై యుందురనియు, నీ యనుబంధమైహికము మాత్రమే కాదనియు, నీ సంబంధములో పురుషు డధికారి యనియు ప్రధానాంశములు ఇట్టి దాంపత్యము ప్రథమాధ్యాయములో తెలుపబడినట్లు పురుషునకు మనుమలును, తలనెఱపును, ముడతలును గలుగువఱకు నడుపబడవలెను. అనంతరము పురుషుడు వానప్రస్థాశ్రమములో ప్రవేశించును. వనమునకు బయలుదేరునపుడు భార్యను కుమారునియొద్ద నుంచి వెళ్ళవచ్చును. లేదా వనమునకు తీసికొనిపోవచ్చును.

పుత్రేషు దారాన్నిక్షిప్య వనం గచ్ఛేత్స హైవవా

(మను 6—3)

(భార్యను పుత్రునొద్ద నుంచి కాని కూడ తీసికొనిగాని వనమునకు పోవలెను.)

భార్యను తీసికొని పోయినను బ్రహ్మచర్యము నవలంబించియే యుండవలెను.

బ్రహ్మచారీ ధరాశయః

(మను 6—26)

(వానప్రస్థుడు బ్రహ్మచారియై నేలపై పరుండవలెను.)

వానప్రస్థునకు భార్యతో నవశ్య మాచరింపవలసిన కర్మయేదియు లేదు. కావున వనప్రవేశముతో దాంపత్యజీవితము ముగియుచున్నది.

# స్మృతికాలపు స్త్రీలు

## షష్ఠాధ్యాయము

### పునర్వివాహము

గృహస్థుడు వానప్రస్థాశ్రమములో ప్రవేశించుటకు తగిన కాలము రాకపూర్వ మాతని భార్య మరణించుచో నాతడు తప్పక మఱొక భార్యను చేసికొనవలసినదే యని స్మృతులు చెప్పుచున్నవి.

భార్యాయై పూర్వమారిణ్యై దత్వాఽగ్నీ నంత్యకర్మణి
పునర్దారక్రియాం కుర్యాత్పునరాధాన మేవచ.

(మను 5–168)

(తనకంటె ముందు చనిపోవు భార్య యంత్యకర్మయం దగ్నులను వినియోగించి, తాను మఱల వివాహమాడి మఱల యాధానము చేయవలెను)

పునర్వివాహమునకు హేతువు ధర్మమే యని గుర్తింపవలెను.

అనాశ్రమోనతిష్ఠేత్తుదినమేకమపిద్విజః.

(దక్ష. 1–10)

(ద్విజు డే యాశ్రమమునను నుండకుండ నొకదినమైన నిలువరాదు.)

(పురుషుడే యాశ్రమమునను నుండకుండ నిలువరాదు.)

కావున వానప్రస్థుడగుట కర్హతను బొందనివాడు గృహస్థుగనే యుండవలెను. అందులకై భార్యను జేసికొనవలెను ఆతని కెవ్వరును కన్య నీయనిచో నాతని గతి యేమి కావలెనను ప్రశ్న యుదయించును. అవు డాతడు తగిన సాధనసంపత్తి యున్నను లేకున్నను గూడ నరణ్యమునకు బోవలసినదే కాని యీ యపత్నీకస్థితిలో నుండరాదు.

అథ చేన్న లభేత కాన్యాం యాచమానోపి కన్యకాం
తమగ్నిమాత్మసాత్కృత్వాత్ ప్రవ్రజ్యాదుత్తరాశ్రమీ

(కాత్యాయన 15)

ఒకొక్కప్పుడు పురుషుడు భార్య యున్నను మఱొక భార్యను జేసికొనవలసి వచ్చుచుండును.

మద్యపాఽసాధు వృత్తాచ ప్రతికూలాచయా భవేత్
వ్యాధితా వాధివేత్తవ్యాహింస్రార్థఘ్నీ చ సర్వదా
వంధ్యాష్టమేఽధి వేద్యాబ్దే దశమేతు మృతప్రజా
ఏకాదశే స్త్రీజననీ సద్యస్త్వ ప్రియవాదినీ

(మను 9–8081)

(మద్యపానము చేయునట్టిదియు, చెడునడత గలదియు, తిరస్కరించునదియు, తెగులుగొంటిదియు, భృత్యులు మున్నగు వారిని హింసించునదియు, దుర్వ్యయము చేయునదియు నగు

భార్య యున్నను మఱొక భార్యను చేసికొనవలెను. భార్య గొడ్రాలుగ నుండుచో నేడేండ్లు చూచి యెనిమిదవయేట మఱొక వివాహము చేసికొనవలెను. పిల్లలు చనిపోవుచున్న దానిని తొమ్మిదేండ్లును, స్త్రీ శిశువులను మాత్రమే కనుదానిని పదేండ్లును నిరీక్షించి మఱొక వివాహము చేసికొనవలెను. అప్రియములు పల్కు భార్య యుండుచో వెంటనే మఱొకతెను వివాహ మాడవలెను.)

భార్య తెగులుగొంటిదే యైనను సత్ప్రవర్తన గల్గి భర్తకు హితురాలుగ నుండుచో భర్త యామె యనుజ్ఞ నొందినదనే కాని మఱొక వివాహము చేసికొనుటకు వీలులేదనియు నామె నెన్నడు నవమానము చేయరాదనియు మనువు చెప్పుచున్నాడు.

యారోగిణీస్యాత్తు హితా సంపన్నా చైవ శీలతః
సానుజ్ఞాప్యాధివేత్తవ్యా నావమన్యా చకర్హిచిత్
(మను 9–82)

భర్త మఱొక వివాహము చేసికొనినాడను కోపముతో నిల్లు విడచిపెట్టి పారిపోవు స్త్రీని భర్త నివారింపవలెను. లేదా యామెను పుట్టింట వదలిపెట్టవలెను.

అధివిన్నాతుయా నారీ నిర్గచ్ఛే(త్ పితా గృహాత్
సావద్యస్సన్నిరోద్ధవ్యా త్యాజ్యావా కులసన్నిధౌ
(మను 8–83)

పైన పేర్కొనబడిన భార్యలవలన ధర్మప్రజాసంపత్తి గల్గుటలేదు కావుననే వారున్నను భర్తకు పునర్వివాహాధికారము గల్గుచున్నది. పుత్రులను గల్గి ధర్మకార్యములలో భర్తకు పనికివచ్చు భార్య యుండగ మాత్రము పురుషుడు మఱొకతెను వివాహ మాడరాదు.

ధర్మప్రజా సంపన్నే దారే నాన్యాం కుర్వీత.

(అపస్తంబ ధ. సూ. 2—11—12)

(ధర్మయుక్తయు ప్రజాయుక్తయు నగు భార్య యుండగా మఱొక భార్యను జేసికొనరాదు.)

ధర్మము ప్రజయు కూడ లేని భార్య యున్నను మఱొక భార్యను వివాహ మాడవచ్చునని దీనివలన తేలుచున్నది. ఈ రెంటిలో నొకటి యుండి మఱొకటి లేకున్నను గూడ పునర్వివాహమునకు వీలున్నట్లు గూడ దీనివలన తెలియుచున్నది. కాని యగ్న్యాధానమైన పిమ్మట నట్లు పునర్వివాహము చేసికొనరాదని యాపస్తంబుడు చెప్పుచున్నాడు.

అన్యతరాభావే కార్యాప్రాగగ్న్యాధేయాత్,

(ఆ. ధ. సూ. 2—11—12)

(భార్యకు ధర్మ ప్రజలలోనే యొకటి లేకపోయినను నగ్న్యాధానమునకు పూర్వమైనచో మఱొకవివాహము చేసికొనవచ్చును)

పైన తెల్పబడిన దోషములలో నేదోషమును లేని భార్యయుండగా మఱొకభార్యను వివాహమాడుట చాలదోషము. అట్లు వివాహమాడువాడు పూర్వాధ్యాయములో తెల్పబడినట్లు గాడిదచర్మమును కప్పుకొని భిక్షనెత్తికొనవలెను. అట్లు పునర్వివాహము చేసికొన్నను దానివలన నేధార్మికప్రయోజనమును నుండదు. పురుషునకు దానివలన రతిమాత్ర ప్రయోజనమే కల్గును.

ప్రథమాధర్మపత్నీ చద్వితీయారతివర్ధినీ
దృష్టమేవఫలంతత్ర నాదృష్టముపయాయతే.

(దక్ష. 4–15)

మఱొకభార్యను జేసికొనినను గూడ మొదటిభార్య భార్యగనే యుండును. ఆమెను పోషింపవలసిన బాధ్యతకూడ భర్తపై కలదు.

అధివిన్నాతుభర్తవ్యా మహదేనోన్యథాభవేత్.

(యాజ్ఞ. 2–75)

(అధివిన్నను భరింపవలెను. లేనిచో గొప్పపాపము వచ్చును.)

అకారణముగ రెండవభార్యను జేసికొనువాడు మొదటి భార్యకు కొంతధనమును కూడ నిచ్చుకొనవలెను.

అధివిన్నస్త్రియైదద్యాదాధివేదని కంసమం
నదత్తం స్త్రీధనంయస్యై దత్తేత్వర్ధంప్రకల్పయేత్.

(యాజ్ఞ. 1–146)

(భార్యయుండగ మఱల వివాహమాడువాడు తన ద్వితీయవివాహవ్యయముతో సమమగు ధనమును మొదటిభార్యకీయవలెను. ఆమె కిదివఱలో కొంత ధనమిచ్చియున్నచో దానిని తగ్గించి యీయవలెను.)

ఆర్థికవిషయములోనే కాక ధార్మికవిషయములో కూడ కొంతభేదమున్నది. ఒకస్త్రీకి పుత్రులు లేకున్నను నామె సపత్నులలో నెవరికైనను పుత్రులుండుచో నామెయు పుత్రవంతురాలే యనదగును.

సర్వాసామేకపత్నీనామేకా చేత్పుత్రిణీ భవేత్
సర్వాస్తాస్తేనపుత్రేణ ప్రాహపుత్రవతీర్మనుః.

(మను 9—183)

కాని కర్మలన్నిటిలోను సహత్వము నొందుటకు ధర్మపత్నికే యధికారముగలదు. జ్యేష్ఠభార్యయే ధర్మపత్నియగును. అసవర్ణ స్త్రీలను వివాహమాడునపుడు పాణిగ్రహణము లేదని 'వివాహవిధాన'మను ప్రకరణమున జూచియుంటిమి. మఱియు పాణిగ్రహణమూలమున భార్యకు కర్మసహత్వము సిద్ధించునని కూడ చూచియుంటిమి. కాన సవర్ణస్త్రీలలో జ్యేష్ఠభార్యకే ధర్మములలో సహకర్తృత్వమని యాజ్ఞవల్క్యుడు చెప్పుచున్నాడు.

సవర్ణాసువిధౌధర్మ్యే జ్యేష్ఠయానవినేతరా.

(యాజ్ఞ. 1—89)

ఇంతవఱకును పురుషుని పునర్వివాహమును విచారించితిమి. ఇక నహజముగ స్త్రీపునర్వివాహమును చర్చింపవలసి యుండును. కాని యే స్మృతిలోను గూడ నే సమయముననుగూడ స్త్రీకి పునర్వివాహమంగీకరింపబడలేదు. మీఁదు మిక్కిలి స్త్రీకి పునర్వివాహము కూడదను ప్రత్యక్షవచనములనేకములున్నవి.

ఇంచుమించుగ నన్ని ధర్మశాస్త్రములనుగూడ 'పూర్వమితరునిచే వివాహిత కానిదానిని వివాహమాడవలెన'ని కలదు.

అనవర్ణాఽపూర్వశాస్త్ర విహితాయాం
యథర్తుగచ్ఛతః పుత్రా స్తేషాం కర్మభిస్సంబంధః.

(ఆ. ధ. సూ. 2–11–1)

గృహస్థస్సదృశీం భార్యాంవిందేతానన్య పూర్వాంయవీయసీం

(గౌ. 4–1)

అవిప్లుతబ్రహ్మచర్యోలక్షణ్యాంస్త్రియముద్వహేత్
అనన్యపూర్వికాంకాంతాంతామసపిండాం యవీయసీం.

(యాజ్ఞ. 1–53)

(ఈ వాక్యముల యర్థములు 'వధూవరార్హతలు' అను నధ్యాయములో తెలిసికొనవచ్చును)

ఇంకను ననేకవిధముల స్త్రీ పునర్వివాహమును నిషేధించు వాక్యములు స్మృతులలో నెన్నియో కలవు.

యస్మై దద్యాత్పితా త్వేనాం భ్రాతా వానుమతేపితుః
తంశుశ్రూషేతజీవంతం సంస్థితంచనలంఘయేత్.

(మను 3—151)

(తండ్రికాని తండ్రియనుమతితో సోదరుడుకాని కన్య నెవనికిత్తురో యాతడు జీవించియున్నపుడును చనిపోయినపిమ్మ టనుగూడ నామె యాతని నతిక్రమింపరాదు).

దీనిం బట్టి దాంపత్యము మరణానన్తరమున కూడ నుండునని తెలియుచున్నది.

పాణిగ్రాహస్యసాధ్వీ స్త్రీ జీవతోనామృతస్యవా
పతిలోకమభీప్సంతీనా చరేత్కించిదప్రియం.

(మను. 5—156)

(సాధ్వియైన స్త్రీ భర్తజీవించియున్నను మృతిచెందినను భర్త లోకమునే కోరుచు భర్తకేమియు నప్రియము చేయ రాదు.)

స్త్రీ జీవించియుండుటే భర్తకొఱకనియు నాతడు చని పోయినపిమ్మట నామె జీవించియుండుట వ్యర్థమనియు స్మృతు లయభిప్రాయము. భర్తతో ప్రాణత్యాగముచేయుట మిక్కిలి ప్రశంసింపబడినది.

తిస్రఃకోట్యర్ధకోటీచయాని లోమానిమానుషే
తావత్కాలం వసేత్స్వర్గే భర్తారం యానుగచ్ఛతి.

(సహగమనము చేయు స్త్రీ మూడున్నరకోట్లు స్వర్గలోకములో నుండును)

అట్లు సహగమనముచేయు సాధ్వి తనపుణ్య ప్రాబల్యమున పతితుడగు భర్తనుగూడ నుద్ధరించునని పూర్వాధ్యాయమున జూచియున్నాము. సహగమనము చేయనిపక్షమున సాధ్వియగు వితంతువు శరీరమును పెంచుకొనదు. కేవలము దేహధారణమునకే భుజించును గాని భోగములకొఱకు గాదు.

కామంతుక్షపయేద్దేహం పుష్పమూలఫలైః శుభైః
నతునామాపి గృహ్ణీయాత్పత్యౌ ప్రేతే పరస్యతు.
(మను. 5—157)

(పతి చనిపోయినపిమ్మట స్త్రీ పుష్పములను, దుంపలను, పండ్లను నాహారముగ తీసికొనుచు శరీరమును శుష్కింపజేయవలెను. కాని మఱొకపురుషుని నామమునైనను స్మరింపరాదు)

స్త్రీల కింతకంటెను నుత్తమధర్మములేదు

ఆసీతామరణాత్ క్షాంతా నియతా బ్రహ్మచారిణీ
యోధర్మ ఏకపత్నీనాం కాంక్షంతీతమనుత్తమం.
(మను. 5—158)

(వితంతువు మరణాన్తర మోర్పుగలదై, యింద్రియ నిగ్రహముగలదై బ్రహ్మచారిణియై సర్వోత్తమమైన యేకపత్నీ ధర్మమును కోరుచున్నదై యుండవలెను.)

ఒకసారి వివాహమైన స్త్రీకి మఱొకసారి వివాహము చేయుట కెంతమాత్రమును వీలులేదు. ఏలన, కన్యాదానమగుటతోడనే భర్త కామెపై స్వామిత్వము వచ్చుచున్నది.

ప్రదానం స్వామ్యకారణం.

(మను. 2—152)

కావున నామెను మఱొకరికిచ్చుట కెవ్వరికి నధికారము లేదు. వివాహితను మఱల దానముచేయుటకే కాక పాణిగ్రహణము చేయుటకు కూడ వీలులేదు. ఏలన: పాణిగ్రహణ మంత్రములు కన్యలందు వర్తించును గాని యకన్యలయందు వర్తింపవు.

పాణిగ్రహణికామంత్రాః కన్యాస్వేవప్రతిష్ఠితాః
నాకన్యాసుక్వచిన్నౄణాం లుప్తధర్మక్రియాహితాః.

(మను 2—226)

(దీనియర్థము పూర్వాధ్యాయమున వివరింపబడినది)

మనువు మతములో వాగ్దత్తయై వివాహిత కాకుండగనే వాగ్దానపతిని కోల్పోయినస్త్రీకికూడ మఱొకపురుషుని వివాహమాడుట కధికారములేదు. ఆమెకూడ వివాహితయై భర్తనుకోల్పోయిన యపుత్రవలెనే నియోగము చేసికొన

వలెను. కాని యీరెండు నియోగములకును నొకభేదము గలదు. వివాహితనియుక్తయగుటకు మంత్రసంస్కారములేదు. అవివాహితనియుక్తయగుటకు మంత్రసంస్కారమున్నది. అట్టి యవివాహిత యథావిధిగ వాగ్దానపతిసోదరుని వివాహమాడవలెను. కాని యావైవాహికసంబంధమొక పుత్రుడు కల్గువఱకేయుండును. ఆపిమ్మటకూడ నాసంబంధముండుచో నది సామాన్యవివాహమే యయ్యెడిది. అట్లే మంత్రసంస్కారములేనిచో సామాన్యనియోగమే యయ్యెడిది. కావున నిది వివాహమంత్రములతో కూడిన నియోగము. దీనివలన గలుగు పుత్రుడు వివాహము చేసికొనిన వానియన్నకు (మృతుడైన వానికి) చెందును. లేకుండుచో నొకపుత్రుడు కల్గువఱకే యాతడామెతో నుండవలెనను నియమముండుటకు వీలులేదు. గర్భధారణముతోనే వారిరువురకు సంబంధము పోవుచున్నది. ప్రసవానన్తరము ఋతుమతియైనపుడామె నాతడు పొందుటకు వీలులేదు. ఆమెతో ధర్మకార్యములను జేయుటకు వీలులేదు. కావున నాతడు గృహస్థాశ్రమమును నడపుటకు మఱొక భార్యను చేసికొనవలసినదే యుండును. దీనిబట్టి యామె యాతనికి భార్యయే కాదనియు, నామె కన్యాత్వమును బూర్తిగ బోగొట్టి యామెను తనగోత్రములోనికి దెచ్చి తనయన్నకు పుత్రునుగ నుండదగిన (దత్తతచేసికొనుటకు గూడ సగోత్రికుడు కావలెనుగదా! అట్టిచో నియోగమునకు చెప్పనదేమి ?) వానిని నుత్పాదించుటకే యామెతో వివాహసంస్కారము

చేసికొనుచున్నాడు. ఈయంశములన్నియు నీక్రిందిశ్లోకముల వలన తెలియుచున్నవి.

యస్యామ్రియేత కన్యాయావాచా సత్యేకృతేపతిః
తామనేన విధానేన నిజోవిందేశ దేవరః

(మను. 9–69)

యథావిధ్య ధిగమ్యైనాం శుక్లవస్త్రాంశుచివ్రతాం
మిథోభజేతా ప్రసవాత్సకృత్సకృదృతావృతౌ

(మను. 9–69, 70)

(వాగ్దానపతిని కోల్పోయినస్త్రీని నామెమఱది యీ క్రిందివిధముగ వివాహమాడవచ్చును. ఆమెనాతఁడు యథా విధిగవివాహమాడి శుక్లవస్త్రయు, మంచినియమములు గల దియునగు నామెను నొకపుత్రుఁడు కల్గువఱకును ప్రతిఋతు కాలములోను నొక్కొకసారి పొందుచుండవలెను.)

ఒక్క సంతానము గల్గువఱకు మాత్రమే యాతఁడా మెను పొందుచుండవలెనని చెప్పుటచేతనే యిది వివాహము కాక నియోగమేయని స్పష్టమగుచున్నది వివాహసంస్కార మును పొందుట మాత్రము విశేషము. వాగ్దత్తమాత్రమే కాక వివాహితకూడనై భర్తనుకోల్పోయినస్త్రీకి సామాన్య వివాహము కూడదని స్పష్టమగుచున్నది. సంతానములేక వితంతువులైన సామాన్యగృహిణి వివాహసంస్కారము లేకుం డనియోగింపబడవలెనని మనము పూర్వమే చూచియుంటిమి.

ఇక మిగిలియున్న సందేహమేమనగా : వివాహితయైయక్షతయో నికాని వితంతువు యవివాహితవలె వివాహసంస్కారము నొంది నియోగము నొందవలెనా ? లేక వివాహితవలె సంస్కారములేకనే నియోగము నొందవలెనా యనునదియే. అట్టి యక్షతయోనికూడ నవివాహితవలెనే సంస్కారమునొంద వలెనని మనుస్మృతి చెప్పుచున్నది.

సాచేదక్షతయోనిస్స్యాద్గత ప్రత్యాగతాపివా
పౌనర్భవేన భర్త్రాసా పునస్సంస్కారమర్హతి.
(మను. 9–176)

(అక్షతయోనియగు వితంతువు భర్తను విడచి మఱొకనిపొంది మరల భర్తను జేరికొను స్త్రీయును పునర్భువునితో మఱల సంస్కారము నొంద నర్హులు)

స్త్రీ భర్తగోత్రములో ప్రవేశించుటకే వాగ్దత్తకు వివాహమని పైననూహచేయబడినది. ఇదివఱకు వివాహితయైన యక్షతయోనికి మఱల వివాహమగుట యెందులకనియు, నాసంస్కారము లేకుండనే నియోగము కారాదాయనియు ప్రశ్నలు బయలుదేరును భర్తనువిడచి యన్యునాశ్రయించి మఱల భర్త యొద్దకువచ్చుదానికా సంస్కారమెందులకో యీమొకునందు లకే యనిమాత్రమీ శ్లోకమువలన స్పష్టమగుచున్నది. నడలింపబడిన వివాహానుబంధమును బాగుగ దృఢపఱచుటకే యీసంస్కారమని తోచుచున్నది.

వివాహిత స్త్రీకి పునర్వివాహముచేయుట నే స్మృతియు గూడ నంగీకరించుటలేదు.

పరాశరస్మృతి యిట్లు చెప్పుచున్నది:—

మృతేభర్తరియానారీ బ్రహ్మచర్యే వ్యవస్థితా
సామృతాలభతేస్వర్గం యథాతే బ్రహ్మచారిణః
తిస్రఃకోట్యర్ధ కోటీచయానిలోమానిమానుషే
తావత్కాలంవసేత్స్వర్గే భర్తారం యానుగచ్ఛతి
వ్యాళగ్రాహీ యథావ్యాళం బలాదుద్ధరతే బిలాత్
ఏవం స్త్రీపతిముద్ధృత్య తే నైవసహామోదతే

(పరాశర 4–31,32,33)

(భర్తపోయినపిమ్మట బ్రహ్మచర్యముతో నుండు స్త్రీ చనిపోయినపిమ్మట కణ్వాదిబ్రహ్మచారులవలె నే స్వర్గమునొందును. సహగమనముచేయు స్త్రీ మూడున్నరకోట్ల సంవత్సరములు స్వర్గములోనుండును పాములవాడు పామునెట్లు బిలమునుండి లాగునో యామెయునట్లే పతితుడైన భర్తనుద్ధరించి యాతనితో నానందించును)

భర్త చనిపోయినపిమ్మట దేహత్యాగమును చేయుటకును బ్రహ్మచర్యము నవలంబించుటకును హెచ్చరించుచున్న పరాశరస్మృతి పునర్వివాహమును విధించుట యసంభవము గదా! 'నష్టేమృతే ప్రవ్రజితే' యను శ్లోకములోని పతి

వాగ్దానపతియేకాని వివాహితపతికాదని 'వివాహావిధాన' మను ప్రకరణములో చేయబడిన సిద్ధాన్తమునకిది మఱింత బలము నొసగుచున్నది. భర్తచనిపోయినపుడే పునర్వివాహము లేదని తేలుచుండగా నాతడు నష్టుడు ప్రవ్రజితుడు, క్లీబుడు, పతితుడునైన జీవించియున్నపుడు పునర్వివాహము కూడదని వేరుగ చెప్పనక్కరలేదుగదా. ఈ'నష్టేమృతే' యను శ్లోకమే నారదస్మృతిలో నున్నపుడు (12-97) కూడ నట వివాహిత పతి యుద్దేశింప బడలేదని చెప్పుటకా స్మృతినుండియే కొన్ని శ్లోకముల జూపవచ్చును.

నారదస్మృతిలో నీక్రింది శ్లోకములు గలవు

అనుత్పన్న ప్రజాయాస్తుపతిః ప్రేయాద్యదిస్త్రియః
నియుక్తాగురుభిర్గచ్ఛే ద్దేవరం పుత్రకామ్యయా
సచతాం ప్రతిపద్యేత తథై వాపుత్రజన్మతః
పుత్రేజాతే నివర్తేత నరకస్స్యా త్తతోన్యథా

(నారద 12—80,81)

(స్త్రీకి సంతానముకలుగకుండ భర్తచనిపోవుచో నామె పెద్దలచే నియమింపబడినదై సంతానకాంక్షతో మఱదిని పొందవలెను. ఆమెకు పుత్రుడు కల్గువఱకును నాతడామెను పొందవలెను. ఆపుత్రుడు గల్గుటతోడనే వారి సంబంధ మంత రించును. ఆపిమ్మట నాసంబంధముండుచో వారికి నరకము వచ్చును.)

సంతానములేని వితంతువు నియోగముచేసికొనవలెనని యిందుగలదు. కాన నీస్మృతియే స్థలాంతరమున వివాహము విధింపదు. అంతియేకాదు, సంతానముగల స్త్రీకి నియోగము కూడ పనికిరాదని దీనివలన తెలియుచున్నది. ఇక వివాహము పనికిరాదని వేఱుగ చెప్పనక్కరలేదు కదా! పునర్వివాహ మునిషిద్ధము కావుననే నియోగము విధింపబడినది కాని పున ర్వివాహమునిషిద్ధము కానిచో నట్టి యావజ్జీవ సుఖదాయ కావకాశముండగా స్వల్పకాల భోగ్యమైన నియోగమే యేల గలియగును?

సంతానము లేక పోయినను గూడ వితంతువు పునర్వివా హము చేసికొనరాదని నారదుని మతమైనట్లీ క్రింది శ్లోకము కూడ స్పష్టముగ తెల్పుచున్నది.

మృతేభర్తర్య పుత్రాయాః పతిపక్షః ప్రభుః స్త్రియాః
వినియోగాత్మరక్షాసు భరణేచస ఈశ్వరః

(నారద 13—28)

(అపుత్రకు భర్తపోయిన వాడగు చుండగా నాతని పక్షమువారే యధికారులగుచున్నారు. నియోగమందును, నాత్మరక్షయందును, భరణమునందును వారే ప్రభువులు)

గాత్రముడనన్య పూర్వనే వివాహము చేసికొనవలెనని చెప్పినట్లిదివరలో చూచియున్నాము. అన్యపూర్వను వివా హము చేసికొనినవాడు (దిధిషూపతి) స్తేన క్లీబపతిత నాస్తి

కులవలె శ్రాద్ధభోజనమున కనర్హుడని యీక్రింది సూత్రము చెప్పుచున్నది.

నభోజయేత్ స్తేనక్లీబ పతితనాస్తికతద్వృత్తి
వీరహాగ్రే దిధిషుదిధిషూపతి స్త్రీగ్రామయాజకా
జపాలోత్సృష్టాగ్ని మద్యపకుచరకూట
సాక్షిప్రాతిహారికాన్.

(గౌ. ధ. సూ, 11–16)

సంతానములేని వితంతువు సంతానముపొందదలచుచో మఱదివలన పొందవలెననియు

(అపతి రపత్య లిప్సుర్దేవరాత్). గౌ. 18–4)

నట్లు భర్తతోకలియుట యొక సంతానము గలుగు వఱకేయనియు తర్వాత కూడదనియు

(నాతిద్వితీయం) గౌ. 18–8)

చెప్పుటచే కూడ గౌతముడు సంతానములేని వితంతువుకు నియోగమే గతిగ నంగీకరించినాడు కాని పునర్వివాహమున కంగీకార మీయలేదు.

యాజ్ఞవల్క్యుడుకూడ 'అనన్యపూర్వికనే' వివాహమాడవలెనని శాసించినట్లు చూచియున్నాము. క్షతయోని యైనను నక్షతయోనియైననుగూడ భర్తనువిడచి కామముతో మఱొకని (సవర్ణునైనను) నాశ్రయించు "పునర్భూ"వు నతడు "స్వైరిణి" యని చెప్పుచున్నాడు.

అక్షతా చక్షతా చైవ పునర్భూస్సంస్కృతా పునః
స్వైరిణీయాపతింహిత్వా సవర్ణం కామతః శ్రయేత్
(యాజ్ఞ. 1—68)

పునర్భువునుగూర్చి యంగిరఃస్మృతి యిట్లు చెప్పుచున్నది.

అన్యదత్తాతుయానారీ పునరన్యస్య దీయతే
తస్యాశ్చాన్నం నభోక్తవ్యం పునర్భూసా ప్రగీయతే
(అంగిరః 1—66)

(ఒకని కీయబడి మఱల నింకొకనికీయబడు స్త్రీ పునర్భువనబడును. ఆమె చేతియన్నమును తినకూడదు)

వసిష్ఠుడుకూడ పునర్భువునిట్లు రెండు విధములుగ నిర్వచించుచున్నాడు.

యాకౌమారం భర్తారముత్సృజ్యా న్యైస్సహచరిత్వా
తస్యైవకుటుంబ మాశ్రయతి సాపునర్భూర్భవతి
యాక్లీబం పతిమున్మత్తం వాభర్తారముత్సృజ్యా
న్యంపతింవిన్దతే మృతేవాసా పునర్భూర్భవతి
(వసి. 27—19,20)

(భర్తనువిడచి యితరులతో తిరిగి మఱల నాభర్త కుటుంబమునే యాశ్రయించునది పునర్భువు. పతి క్లీబుడు, పతితుడు, పిచ్చివాడు మృతుడునైనవు డన్యుని చేసికొనుచో నామెయు పునర్భువే.)

భర్త నపుంసకుడు, పతితుడునైనను గూడ మఱొకని వివాహ మాడరాదనుచో సంతానములేని యట్టివాని భార్య యేమిచేయవలెనన ;

ప్రేతపత్నీ షణ్మాసాన్ వ్రత చారిణ్యక్షారలవ
ణంభుంజానాధః శయీత
ఊర్ధ్వంషడ్భ్యో మాసేభ్యః స్నాత్వా శ్రాద్ధం
చ పత్యై దత్త్వా విద్యాకర్మగురుయోని సంబంధాన్
సన్నిపాత్య పితా భ్రాతా వా నియోగంకారయేత్

(వసి. 18—55, 56)

(భర్తపోయిన స్త్రీ క్షారలవణ రహితమైన భోజనము ను చేయుచు కటికినేలపై బరుండుచు నాఱునెలలుగడపి విద్య చేతను వర్తన చేతను ఘనులైనవారిని రక్తబంధువులను సమీా పించి వారి సమీాపమున తండ్రిచేతగాని సోదరునిచేతగాని నియోగము చేసికొనుటకు నియమింపబడవలెను.) 4

మఱొకని భార్యను తనయొద్ద నుంచుకొనినవాడు కృచ్ఛ్రాతికృచ్ఛ్ర ప్రాయశ్చిత్తములను చేసికొని యామెను మఱల నాతని కొప్పగింపవలెనని కూడ వసిష్ఠుడు చెప్పు చున్నాడు.

దిధిష్వూపతిః కృచ్ఛ్రాతి కృచ్ఛ్రౌచరిత్వా తస్మై
దత్త్వా పునర్నివిశేత్

(వసి. 20—10)

ఆపస్తంబుడుకూడ పూర్వమితరుని వివాహము చేసికొనినదానిని పెండ్లాడరాదని చెప్పినట్లికటలో చూచియున్నాము.

రెండవపెండ్లి చేసికొనిన స్త్రీ చనిపోయినచో నెవరికిని కూడ దశరాత్రాశౌచము లేదని స్మృతులు చెప్పుటచేతనే యాచార మెంతభ్రష్టగ పరిగణింపబడినదో తెలియగలదు.

పరపూర్వాసుచస్త్రీ షుత్ర్యహాచ్ఛుద్ధిరిష్యతే.

(లిఖిత. 15–16)

(పరపూర్వలగు స్త్రీలు చనిపోవుచో మూడునాళ్లతోనే శుద్ధి)

మను, గౌతమ, వసిష్ఠ, పరాశరా, పస్తంభాంగిరో, యాజ్ఞవల్క్యాది స్మృతులన్నియు స్త్రీకి పునర్వివాహమును నిషేధించినవనియు, పతిపోయినపిమ్మట పూర్ణమయిన యింద్రియనిగ్రహముతో నుండుటయే యామె కర్తవ్యమనియు సంతానములేని వితంతువులుమాత్ర మొకసంతానము కల్గుటకై మఱదిని ఋతుకాలమున పొందవచ్చుననియు చూచియుంటిమి. నియోగము చేసికొనవచ్చునను ననుజ్ఞయే కాని చేసికొనవలెనను నియమములేదని కూడ గుర్తింపవలెను. పైనుదాహరింపబడిన కొన్నివాక్యములలో ('అపత్యలిప్సుః,' సంతానమును కోరినట్టిస్త్రీ, మున్నగుపదములలో) నీయంశము స్పష్టముగనే చెప్పబడియున్నది. భర్తనియోగము చేసికొనవల

దని స్పష్టముగ చెప్పియుండినచో నియోగముచేసికొననే కూడదు.

అపత్యలోభాద్యాతుస్త్రీ భర్తారమతివర్తతే
సేహనిందామవాప్నోతి పరలోకాచ్చహీయతే.

(మను. 5—161)

(ఏ స్త్రీ సంతానమందలి లోభముచే భర్త నతిక్రమించునో యామె యిహలోకమున నిందను పొందును. పరమున పతిలోకమునుండి భ్రష్టయగును.)

భర్తృపక్షపు పెద్దలయనుమతితోనే నియోగము చేసికొనవలెనని పైన నుదాహరింపబడిన వాక్యములలో గలదు. వారు నియోగమువలదనినచో మానవలసినదేయని దీనివలననే తెలియుచున్నది. వారు చేసికొనవలసినదని చెప్పినను తనకిష్టములేనిచో వితంతువు నియోగము మానివేయుట కెట్టియాటంకము గన్పట్టదు.

'స్వర్గంగచ్ఛత్యపుత్రాపి యథా తేబ్రహ్మచారిణః' అనుటచే పతివ్రతకు పిల్లలులేకున్నను స్వర్గప్రాప్తి కలదని యిది వరలో చూచియున్నాముగదా!

నియోగము భర్తజీవించియుండగా కూడ కావచ్చును. ఆతడు షండత్వాదులచే పుత్రోత్పాదనా సమర్థుడగుచో తానే భార్యచే నియోగము చేయింపవచ్చును.

జీవతశ్చక్షేత్రే,

(గౌ. ధ. సూ. 28—11)

మఱదితోనే కాని నియోగము పనికిరాదని కొందఱి మతము.

నాదేవరాదిత్యేకే.

(గౌ. 28-7)

దేవరుడు లేనిచో నీ క్రిందివారు క్రమముగ నియోగమున కర్హులు: సపిండులు, సగోత్రులు, సమానర్షులు గలవారు సమానవర్ణులు.

పిండగోత్రర్షి సంబంధేభ్యో యోనిమాత్రాద్వా.

(గౌ. 28-6)

నియోగమువలన నొకపుత్రుని కనుటకే యధికారమున్నట్లు పైన చూచియున్నాము.

మనువుకూడ నొకపుత్రునికంటె నెక్కుడుపుత్రులను కనరాదని చెప్పుచు కొందఱి మతములో రెండవపుత్రుడు కూడ గల్గువఱకు నియోగముండు ననుచున్నాడు.

ఏకముత్పాదయేత్పుత్రం ద్వితీయం ఒకధంచన.

(మను. 9-60)

ద్వితీయమేకే ప్రజనం మన్యంతే స్త్రీషుతద్విదః
అనిర్వృతం నియోగార్థం పశ్యన్తోధర్మతస్తయోః.

(మను. 9-61)

నియోగము సంతానప్రాప్తికొఱకే యేర్పడిన సంస్థ యగుటచే నందు కామమునకు తావులేదు. ఒకపుత్రుడు కల్గి

నపిమ్మట గూడ కలియుచుండు నియుక్త స్త్రీపురుషులకు కోడలిని గురుభార్యను పొందినదోషముతో సమానమయినదోషము గల్గుననియు వారు పతితులగుదురనియు చెప్పబడియున్నది.

"నియుక్తౌయౌవిధిం హిత్వావర్తే యాతాంతుకామతః
తావుభౌ పతితౌస్యాతాం స్నుషాగ గురుతల్పగౌ"

(మను 9–63)

యోగకాలము పూర్తియగుటతోడనే గురువుపలెను కోడలివలెను వర్తింపవలెను. కాని కామభావములతో నుండరాదు.

'విధవాయాం నియోగార్థే నిర్వృత్తేతు యథావిధి
గురువచ్చ స్నుషావచ్చ వర్తేయాతాం పరస్పరం'

(మను 9–62)

ఇట్లు నియోగ విధానము నంగీకరించిన మనుస్మృతి వెనువెంటనే యీక్రింది విధముగ చెప్పుచున్నది

"అయంద్విజై ర్హివిద్వద్భిః పశుధర్మో విగర్హితః
మనుష్యాణా మపిప్రోక్తో వేనేరాజ్యం ప్రశాసతి
సమహీ మఖిలాంభుంజన్రాజర్షి ప్రవరఃపురా
వర్ణానాం సంకరం చక్రే కామోపహతచేతసః
తతఃప్రభృతి యోమోహాత్ ప్రమీతపతికాంస్త్రియం
నియోజయత్య పత్యార్థంతం విగర్హన్తి సాధవః"

(మను 9–66,67,68)

(వేనుడు రాజ్యపాలనము చేయుచుండగా నీ నియోగము సామాన్య మానవులకుగూడ, ననగా ధర్మైకదృష్టులుకానివారికి గూడ, చెప్పఁబడినదై తత్ఫలితముగ పశుధర్మముగ గర్హింపఁబడినది. ఏలన; భూమండలము నంతయు పాలించుచుండిన యా రాజు కామబుద్ధికలవాడై నియోగము మూలమున వర్ణసంకరము చేసెను. అదిమొదలు రితంతువును సంతానముకొరకు జ్ఞానముచే నియోగము చేయువానిని సాధువులు నిందించుచున్నారు.)

ఎంతో ధార్మిక భావముతో నెన్నో నియమములతో నింద్రియ జయముకలవారిచేతనే జరుపుటకు వీలయిన నియోగవిధానము వేనుని పాలనకాలమున అనేకవిధముగ నాచరింపబడినదై, వర్ణసంకరమునకు కారణమయినదనియు, నాటినుండియు నట్లజ్ఞానముచే చేయబడు నియోగము గర్హింపఁబడుచున్నదనియు వీనిలో నేదయిన నొకటి సక్రమముగ జరిగినను నదికూడ సహజముగ దుర్నియోగము చేయబడిన నియోగములలోనే చేర్పబడు చున్నదనియు పై శ్లోకాల తాత్పర్యము.

కావుననే కాబోలు పరాశరస్మృతిలో కలియుగములో నియోగము చేయకూడదని చెప్పబడినది.

'అశ్వాలంభం గవాలంభం సన్న్యాసం పలపైతృకం
దేవరాచ్చసుతోత్పత్తిః కలౌపంచ వివర్జయేత్'

(కలియుగములో అశ్వమేధము, గోమేధము, సన్యాసము, శ్రాద్ధములో మాంసముపెట్టుట, మఱదివలన సంతానముకనుట యను నైదును విడిచిపెట్టవలెను.)

స్త్రీకి పునర్వివాహము నిషిద్ధమగుటచేత భర్త్రాజ్ఞననుసరించి కామభావోపేతము కానట్టి మార్గముచేత నశించిపోవుచున్న భర్తృవంశమును నిలబెట్టుటలో దోషములేదను భావముతో నితర స్మృతికారులు నియోగము నంగీకరించియున్నారు.

# స్మృతికాలపు స్త్రీలు.

## సప్తమాధ్యాయము.

### కర్మకాండ

కర్మకాండలో స్త్రీ పురుషులకుగల భేదము ముఖ్యముగ నుపనయనముమీద నాధారపడియున్నది. ఉపనయనము వేదపఠనాధికార మిచ్చుచున్నది. అట్టి యుపనయనము స్త్రీకి లేనేలేదు. కావున వేదమంత్రములతో చేయవలసిన యనేక కర్మలు చేయుటకు స్త్రీ కర్త్రతయే లేకపోవుచున్నది. కాని

'పాణిగ్రహణాద్ధి సహత్వం సర్వకర్మసు,

(ఆ. ధ. 2-14-17)

(పాణిగ్రహణమువలన స్త్రీకి కర్మలలో పురుషునితో సహత్వము కల్గుచున్నది.) అని చెప్పుటచేత పురుషుడే కర్మ చేసినను దానిని భార్యకూడ చేయుచున్నట్లే యర్థము. ఆమె కొన్ని కర్మలలో పాల్గొనవలసికూడ నుండును. అంతే కాదు, కొన్నిటిలో నామె వేదమంత్రములనుగూడ నుచ్చరింపవలసి యుండును. ఉపనయనములేని యామెకు వేదపఠనాధికారములేను కాన తాత్కాలిక పఠనాధికారము గల్గుటకై పత్నీసన్నహనమను క్రియ చేయబడును. శ్రౌతకర్మలలో

వచ్చుటచ్చుట నీపత్నీసన్నహానము జరుగుటను "వేదకాలపు స్త్రీలు" అను గ్రంథమున చూచియున్నాము. ఈమంత్రము లను జదువనవసరము లేనపుడు గూడ పత్ని పతితోపాటు కర్మ నొనర్చుచున్నట్లే యెంచవలెను. అంతేకాక పుణ్యకర్మ ఫలము నామెయు భర్తతోపాటు పొందుచున్నది.

"తథాపుణ్య ఫలేషుచ"

(ఆ. ధ. 2—14=18)

(పాణిగ్రహణమువలన భార్యకు కర్మల యందువలెనే కర్మఫలములయందుగూడ సహత్వము గల్గుచున్నది.) పురుషున కుపనయనమగుటతోడనే యెట్లు కర్మాధికారము గల్గుచు న్నదో యట్లే స్త్రీకిని వివాహమగుటతోడనే కర్మలో భర్తృ సహత్వము గల్గుచున్నది. పురుషునుపనయనమునకు పూర్వము కర్మచేయుట కనర్హుడే కాని యాతడు పుట్టినదిమొదలు జాతక ర్మాది సంస్కారములకు లోనుగావలసియున్నాడు. ఈకర్మ లన్నియు స్త్రీ శిశువునకుగూడ జరుగవలసినవే. కాని యవి యన్నియు నమంత్రకముగ జరుగును.

"అమంత్రికా తుకార్యేయం స్త్రీణామావృదశేషతః
సంస్కారార్థం శరీరస్య యథాకాలం యథాక్రమం"

(మను 2—66)

(జాతకర్మాది కర్మకలాప మంతయు స్త్రీకి నకాల ములో నక్రమముగ జరుగవలెను.)

"నాస్తిస్త్రీణాం క్రియామంత్రైరితిధర్మే వ్యవస్థితః
(మను 9—18)

(స్త్రీలకు సమంత్రకముగు క్రియకూడదని ధర్మము)

ఈకర్మలయినపిమ్మట పురుషునకుపనయనమును స్త్రీకి వివాహమునునగును. వివాహము వైదికముగనే జరుగును.

"వైవాహికోవిధిస్త్రీణాం సంస్కారోవైదికస్స్మృతః"
(స్త్రీలకువివాహ సంస్కారము వైదికము)

"తూష్ణీమేతాః క్రియాఃస్త్రీణాం
వివాహస్తు సమంత్రకః"

(యాజ్ఞ 1—13)

(ఈక్రియలుస్త్రీల కూరకనేచేయవలెను. వివాహము సమంత్రకము) పురుషుడుపనయనమగుటతోడనే గురుకులము నకుబోయి యగ్నికార్యము చేసికొనుచుండును. అట్లే వివాహ మయినస్త్రీ భర్తృసేవచేయుచు గృహకృత్యములను చేసికొను చుండును.

"పతిసేవాగురౌవాసోగృహార్థోఽగ్నిపరిక్రియా"
(మను —2-67)

(పతిసేవయే గురుకులవాసము. గృహకృత్యమే యగ్ని కార్యము.) స్త్రీకుపనయనములేదు గావున సాధారణముగ నీమె యనుపనీతునివలె హోమాదులుచేయుట కనర్హురాలు.

"నస్త్రీజుహుయాత్"
"నానుపేతః"

(ఆ.ధ—2—15—17,18)

(స్త్రీయు ననుపనీతుడును హోమము చేయరాదు)

కావుననే స్త్రీ చేయవలసియున్న లాజహోమము గూడ వరుడే చేయుచు 'జుహోతీయంనారీ' (ఈ స్త్రీ హోమము చేయుచున్నది) అని చెప్పును.

జుహోతీయం నారీతి.

(ఆ. గృ. సూ. 2—4—5)

భర్త వేయుబలులు గాక భార్య ప్రతిసాయంకాలమునను బలి వేయవలెను. ఆమె మంత్రము లేకుండనే యట్లు వేయవలెను.

"సాయంత్వన్నస్య సిద్ధస్యపత్న్యమంత్రం బలింహరేత్
వైశ్వదేవంహి నామైతత్సాయం ప్రాతర్విధీయతే.

(మను. 3—121)

(సాయంకాలము వండినయన్నమును పత్నిమంత్రరహితముగ బలి వేయవలెను. ఇదియు వైశ్యదేవమే)

స్త్రీ గర్భిణియై యున్నప్పుడు ప్రత్యేకముగ కొన్నిసంస్కారములను పొందవలెను. ఇందు కొన్ని గర్భస్థశిశువు నుద్దేశించి చేయబడునవే. కొన్నిటియందు మంత్రాలను కూడ పఠింపవలసియుండును.

"సీమంతోన్నయనం ప్రథమేగర్భే చతుర్థేమాసి"

(అ. గృ. సూ. 6–14)

(సీమంతోన్నయనము సంస్కారము స్త్రీకి ప్రథమగర్భమందు నాల్గవమాసమున చేయవలెను.)

గర్భము స్ఫుటమగుటతోడనే పుంసవనము సంస్కారముచేయవలెను. ఇది పుష్యమీ నక్షత్రమున చేయబడును.

"పుగ్‌సువనం వ్యక్తేగర్భే తిష్యేణ"

అ. గృ. 6–14–9)

గర్భిణిపురుష శిశువును గనవలెనను కోరికతో నిది చేయబడును. సుఖప్రసవము గల్గుటకై "క్షిప్రగ్‌సువన" మను కర్మచేయబడును.

"యదిజరాయు నపతేదేవం
విహితాభిరేవాద్భిరుత్తరాభ్యామవోక్షేత్"

(అ. గృ. సూ. 6–14, 15)

(మావిపడనిచో "అనాప్రీతేసళరావేణ" అనుదానిచే తీసికొనబడిన యుదకముచేత "ఐతుగర్భోఅక్షితః" అను రెండు ఋక్కులతో నామెను మార్జనచేయవలెను.)

పైకర్మలన్నిటిలోను గృహ్యసూత్రములు మంత్రవినియోగమును చెప్పుచున్నవి. జననమయినపిమ్మట జరుగు జాతకర్మనామకరణాన్నప్రాశన చౌలములు స్త్రీకి మంత్రరహితములుగనే జరుగునని యిదివరలో చూచియున్నాము.

నామకరణములో స్త్రీకి బేసిసంఖ్యగల యక్షరముల పేరు నిడవలెను.

'అయుజాక్షరం కుమార్యాః'

(ఆ. గృ. 6-15-11)

పుత్రుడు కల్గుచో తండ్రి ప్రవాసమునుండి వచ్చి "అంగాదంగాత్" అనునట్టియు "అశ్మాభవ" అనునట్టియు ఋక్కులచే వాని నభిమంత్రించి వాని శిరస్సుమూర్కొని, వానికుడి చెవిలో "అగ్నిరాయుష్మాన్" మున్నగు మంత్రములను చదువవలెను. స్త్రీ శిశువు కల్గుచో నివియేవియు నుండవు. "సర్వస్మాదాత్మనః" అను మంత్రముచే దాని నభిమంత్రింపవలెను. ఈ క్రింది సూత్రముల కిదేయర్థము.

"ప్రవాసాదేత్యపుత్రస్యోత్తరాభ్యా మభిమంత్రణం
మూర్ధన్యవఘ్రాణం దక్షిణేకర్ణ ఉత్తరాన్ మంత్రాన్ జపేత్
కుమారీముత్తరేణ యజుషాభి మంత్రయతే"

(ఆ. గృ. 6-15-12, 13)

ప్రేతకర్మశ్రాద్ధములను స్త్రీలకు కూడ పురుషులకువలెనే చేయవలెను. అందేమియు భేదము చెప్పబడలేదు. సపిండీకరణము తండ్రికి పితామహప్రపితామహులతోను తల్లికి పితామహీప్రపితామహులతోను చేయవలెను. పుత్రికాసుతుడిట్లు చేయరాదు.

'మాతుస్సపిండీకరణం పితామహ్యాసహోదితః
యథోక్తేనైవకల్పేన పుత్రికాయానచేత్సుతః'

(కాత్యా 16–21)

పుత్రికాపుత్రుడెట్లు చేయవలెనో ప్రథమాధ్యాయము నఁ జూచియున్నాము. నవకులలో నొకతె పుత్రవంతురా లగునేని యుండఁబను పుత్రవంతురాండ్రే యైనట్లు పూర్వా ధ్యాయమున జూచియుంటిమి. దానింబట్టి సవతితల్లులకుఁగూడ శ్రాద్ధాదికము చేయవలెనని తేలుచున్నది.

వివాహముకాని స్త్రీలకు నుపనయనము కాని పురుషు లకువలెనే పిండదానము లేదు.

"అసంస్కృతప్రమీతానాం త్యాగినాం కులయోషితాం
ఉచ్ఛిష్టభాగధేయం స్యాద్దర్భేషువికిరశ్చయః''

(మను 3–245)

(ఉపనయన సంస్కారము జరుగకుండ చనిపోయినవా రికిని, తల్లిదండ్రులు మున్నగువారిని వదలివైచినవారికిని వివా హముకాకుండ పితృకులమున నుండగనే మరణించిన స్త్రీల కును దర్భలయందు చిమ్మబడిన యుచ్ఛిష్టమే భాగధేయము)

ఇచట 'కులయోషితాం త్యాగినాం', అనుదానికి 'మంచి భార్యలను విడిచిపెట్టినవారికి, అని యర్థమని కొందఱు చెప్పు చున్నారు. మఱికొందఱు 'కులయోషితాం', అనగా స్వకుల

మును వీడి మఱియొక కులమునకు వెళ్ళిపోయిన (చెడిపోయిన) స్త్రీలకు' అని చెప్పుచున్నారు.

చౌలమైన మృతినొందిన స్త్రీకిని పురుషునకును కూడ సపిండు లుదకదాన మీయవలెను.

'ఉదకదానం సపిండైః కృతజటస్య'

'తత్స్త్రీణాంచ'

(గౌ. 14-34-35)

వివాహమయిన స్త్రీలకు భర్తృపక్షము వారే యుదకదానము చేయవలెనని కొందఱును పితృపక్షము వారుకూడ చేయవచ్చునని కొందఱును చెప్పుచున్నారు.

'ఏకేఽప్రత్తానాం,

(గౌ. 14-34-36)

పురుషుల విషయమున సపిండత్వము సాప్తపురుషమని యు స్త్రీలవిషయమున త్రిపురుషమనియు వసిష్ఠుడు చెప్పుచున్నాడు.

'ప్రత్తానాంచ స్త్రీణాం త్రిపురుషం విజ్ఞాయతే'

(వసిష్ఠ 4-18)

శ్రాద్ధభోక్తృత్వమున నుపనీతుడే యర్హుడైనను పితరుల నుద్దేశించి స్త్రీనిగూడ గూర్చుండబెట్టుట తేకపోలేదు.

"అమావాస్యాయాం బ్రాహ్మణం సముద్దిశ్యపితామహం
బ్రాహ్మణీం స్త్రీం సమభ్యర్చ్యముచ్యతే సర్వపాతకైః"

(ఉశనః. 105)

(అమావాస్యనాడు పితామహునుద్దేశించి బ్రాహ్మణుని బ్రాహ్మణస్త్రీని నర్చనచేయుచో పాపములుపోవును.)

కుమారుడుగలుగవలెనని కోరుచున్న స్త్రీ శ్రాద్ధములో మధ్యమపిండమును తినవచ్చునట.

'పతివ్రతాధర్మపత్నీ పితృపూజనతత్పరా
మధ్యమంతుతతఃపిండమద్యాత్సమ్యక్సుతార్థినీ'

(మను 3—262)

(పతివ్రతయు, ధర్మపత్నియు, పితృపూజనతత్పరయు, సుతులను కోరునట్టియు స్త్రీమధ్యమ పిండమును తినవలెను)
అట్లుతినుచోనామె

'ఆయుష్మంతం సుతంసూతే యశోమేధా సమన్వితం
ధనవంతం ప్రజావంతం సాత్వికం ధార్మికంతథా'

(మను 3—263)

(ఆయుష్మంతుడు, యశోవంతుడు, మేధావంతుడు, ధనవంతుడు, సంతానవంతుడు, సాత్వికుడు, ధార్మికుడు నగు పుత్రుని కనును.)

విధవ భర్తకు శ్రాద్ధాదికములను చేయించుచుండవలెను.

'తంశుశ్రూషే తజీవంతం
సంస్థితం చనలంఘయేత్'

(మను 5—151)

(భర్త బ్రతికియుండగ సేవచేయవలెను. చనిపోయిన పిమ్మటగూడ నతిక్రమింపరాదు.)

షష్ఠాధ్యాయములో వివరింపబడిన 'ప్రేతపత్నీ షణ్మాసా' మున్నగు వశిష్ఠసూత్రములో గూడ నీయంశము స్పష్టముగ నున్నది.

స్త్రీ స్వాయముగ శ్రాద్ధకర్మ చేయలేదు. ఏలన:

'న స్త్రీజుహుయాత్'

(స్త్రీ హోమముచేయరాదు.) అను నియమముగలదు. అంతేకాదు. భర్తృరహితయగు స్త్రీ కేకర్మ చేయుటకు నధికారములేదు. మనువు పితంతువులనగూర్చి "లుప్తధర్మక్రియాహితాః" (వారులోపించిన ధర్మక్రియగలవారు.) అని చెప్పినట్లు పూర్వాధ్యాయములో చూచియుంటిమి. పాణిగ్రహణమువలన స్త్రీ భర్తతో కర్మచేయుట కర్హురాలగుచున్నది. అతడు చనిపోవుచో నామెకాకర్మ సహత్వముకూడ పోవుచున్నది. ఆమె స్వతంత్రముగ కర్మచేయరాదా ? యన

'అస్వతంత్రా ధర్మే స్త్రీ'

(గౌ. 18–1)

(ధర్మమునువిషయమున స్త్రీ యస్వతంత్రురాలు) అని చెప్పబడినది.

పురుషుడయినను తానొక్కడే క్రతువును జేయరాదు. గృహస్థాశ్రమములో నున్నపుడే యనగా భార్యతో నున్నపుడే యాతడు యజ్ఞములను జేయుట కర్హుడనియు భార్యారహితు

డైనచో నాతడు యజ్ఞములను చేయుట కనర్హుడనియు గృహమునువీడి యరణ్యమునకు బోవలసినవాడేయనియు పంచమాధ్యాయమున జూచియుంటిమి. ఇట్లు కర్మలలో పాల్గొనవలసినది జ్యేష్ఠభార్యయేనా ? యున్న భార్యలందరును గూడనా ? యుననావిషయమై స్మృతులలో నభిప్రాయభేదము గలదు. ప్రథమభార్య ధర్మప్రజా సంపన్నయై యుండగా రెండవ భార్యను జేసికొనుట కేవలము నింద్రియసుఖముకొఱకే యనియు నామె ధర్మకార్యముల కక్కరకురాదనియు పూర్వాధ్యాయమున చూచియుంటిమి. పరాశరస్మృతి యిట్లు చెప్పుచున్నది.

'సవర్ణాసు విధౌధర్మ్యే జ్యేష్ఠయాన వినేతరా'

(4—89)

(ధర్మములో భర్తతో నుండదగినది సవర్ణభార్యలలో జ్యేష్ఠయే.)

ఎంతమంది భార్యలున్న నంతమందితోను కలిసియే క్రతువులను జేయవలెనని కొన్ని స్మృతులలో గలదు.

'నైకయాపి వినాకార్య మాధానం భార్యయాద్విజైః'

(కాత్యాయన 8—5)

(ద్విజుడొక భార్యను గూడ విడువకుండ యందఱు భార్యలతోను నాధానము చేయవలెను)

కర్మలో స్త్రీ కెంత ప్రాధాన్యమున్నదన నాధానము చేసినవాని జ్యేష్ఠభార్య భ్రష్టురాలగుచో నామెభర్త మరల నాధానము చేసికొనవలెను.

జ్యేష్ఠాచేద్బహుభార్య స్యాతిచారేణగచ్ఛతి
పునరాధానమత్రైకె ఇచ్ఛన్తి నతుగోతమః

(కాత్యాయన. 20—4)

(బహుభార్యలుగలవాని ప్రథమభార్య చెడిపోవుచో నాతడు మఱల నాధానము చేయవలెనని కొందఱు చెప్పుచున్నారు. చేయనక్కరలేదని గౌతముడు చెప్పుచున్నాడు.)

జ్యేష్ఠభార్యకు మిగిలినభార్యలకంటె కర్మాధిక్యమెచట నంగీకరింపబడినదన: తనకంటె ముందుగ జ్యేష్ఠభార్య చనిపోవుచో నాహితాగ్ని యామెను వైతానికాగ్నులచే దహనము చేయవలెను. జ్యేష్ఠభార్యయుండగా రెండవభార్య చనిపోవుచో నామెను వైతానికాగ్నులచే దహింపరాదు.

"దాహయిత్వాగ్నిభిర్భార్యాం సదృశీం పూర్వమారిణీం
పాత్రైశ్చాగ్నిమాదధ్యాత్ కృతదారో విలంబితః
ద్వితీయాంచైవయః పత్నీందహేద్వైతాని కాగ్నిభిః
జీవన్త్యాం ప్రథమాయాంతు బ్రహ్మఘ్నేనసమం హితత్.

(కాత్యాయన. 20—5, 7)

(ముందు చనిపోయిన సవర్ణభార్య నగ్నులతోడను పాత్రలతోడను దహింపజేసి యాలసింపక మఱొకభార్యను

చేసికొనవలెను. ప్రథమభార్యజీవించియుండగా రెండవభార్య చనిపోవుచో నామెను వైతానికాగ్నులతో దహింపచేయుచో నది బ్రహ్మహత్యాతుల్యపాపమగును.)

భార్య చనిపోయినపుడామెతో పాత్రలను నగ్నులను దహింపజేయవలెనని చెప్పుటచే శ్రౌతకర్మప్రయోజనము చాల వఱకు పూర్వమారణియైన భార్యకే ముట్టుచున్నదని తెలియు చున్నది. ఆమెపోయినపిమ్మట పురుషుడిక నాహితాగ్ని కానే కాడు. సాయంప్రాతరగ్నిహోత్రములను దర్శపూర్ణమా సేష్టులను చేయుట కాతని కధికారములేదు. ద్వితీయభార్యను గైకొనినను నాతని కధికారములేదు. ఆమెతో మఱల నాధా నము చేయవలసినదే.

దీనినిబట్టి యజ్ఞఫలము నొందుటలో స్త్రీ పురుషుని కంటె తక్కువయర్హురాలు కాదని తెలియుచున్నది. ఒకభా ర్యను వివాహమాడిన పిమ్మట నామె మరణించినను మఱొక భార్యను జేసికొనకుండ నామె ప్రతిమతో ధర్మకార్యములను జేయవచ్చునని కొలదిస్మృతులు చెప్పుచున్నవి. రాముడు సీతాప్రతిమతో క్రతువులు చేయలేదా?

"మృతాయామపిభార్యాయాం వైదికాగ్నిం నహిత్యజేత్
ఉపాధినాపితత్కర్మయావజ్జీవం సమాపయేత్
రామోపికృత్వా సౌవర్ణాంసీతాం పత్నీంయశస్వినీం
ఈజేయజ్ఞైర్బహువిధైస్సహ భ్రాతృభిరావృతః
(కాత్యా 20—9, 10)

శ్రౌత కార్యములలో నగ్ని మథనమునకై పత్నులను నియోగింపవలెను.

"కార్యమగ్నిచ్యుతే రాభిః సాధ్వీభిర్మథనంపునః.

(కాత్యా 8—6)

గృహస్థు ప్రవాసమున కేగి నపుడగ్నులను నిర్వహించు బాధ్యత గృహిణిపై గలదు. శ్రాద్ధములో వలెనే నిటగూడ నామె యితరులతో జేయింపవలసిన దేకాని తాను జేయుటకు వీలులేదు. కాన ఋత్విక్కు కావలెను. గృహస్థేయా ఋత్విక్కును నియమించి వెళ్లును.

"నిక్షిప్యాగ్నిం స్వదారేషుపరికల్ప్య ఋత్విజంతథా
ప్రవసేత్కార్యవాన్ విప్రోవృథైవనచిరం క్వచిత్
పత్న్యాచాప్యవియోగిన్యా శుశ్రూష్యోగ్ని ర్వినీతయా
సౌభాగ్యవిత్తా వైధవ్యకామ యాభర్తృభు క్తయా
యావాస్యాద్వీరసూరాసామాజ్ఞా సంపాదినీచయా
దత్తా ప్రియం వదాశుద్ధా తామత్ర వినియోజయేత్.

(కాత్యా. 19—1, 3, 4)

పనిగల్గి ప్రవాసముపోవు విప్రుడు అగ్నులను భార్య కొప్పగించి ఋత్విక్కు నేర్పాటిచిపోవలెను. వ్యర్థముగా నెచ్చ టను నిలువరాదు. వినయము గల్గినట్టియు, సౌభాగ్య ధన ములను నయిదవతనమును భర్తృ సహవాసమును గోరు నట్టియు స్త్రీ యెన్నడును వీడక యాయగ్నులను సేవించు

చుండవలెను. భార్యలలో నెవతె వీకులను గనునో యెవతె యాజ్ఞను నెరవేర్చునో సమర్థురాలో, (ప్రియభాషిణియో, పరిశుద్ధురాలో యామెనే వనిలో నేర్పఱుపవలెను.)

ఇట్లు భర్తచేయుధర్మములలో పాల్గొని వానికి తోడ్పడుటకే కాని వేఱుగ నేకర్మ చేయుటకు స్త్రీకి నధికారములేదు. ఆమె యట్లు తోడ్పడనిచో పురుషుడు మఱొక భార్యను చేసికొనవలెనని పూర్వాధ్యాయమున జూచియుంటిమి. పెద్ద యజ్ఞయాగాదులమాట నటుంచి సామాన్యముగ నుపవాసములు మున్నగువానినిగూడ భార్య వేఱుగ జేయరాదు.

నాస్తి స్త్రీణాం పృథక్ యజ్ఞోనవ్రతం నాప్యుపోషితం

(మను. 5—155)

తుదకాచమనము గూడ స్త్రీలకు శారీరకశుద్ధి కొఱకు మాత్రముపయోగించును.

త్రిరాచామేదపః పూర్వం ద్విఃప్రమృజ్యా త్తతో ముఖం
శారీరం శౌచమిచ్ఛన్ హి స్త్రీశూద్రస్తుసకృత్సకృత్

(మను. 5—39)

బ్రహ్మక్షత్రియ వైశ్యులకాచమనోదకము క్రమముగ నాభికంఠతాలు గతముకావలెను. స్త్రీ శూద్రులకు స్పృష్టమాత్రమయిన చాలును.

స్త్రీశూద్రం స్పృష్టాభిరేవ,

(వశిష్ఠ 3—34)

ఆశ్రమధర్మములలో గూడ స్త్రీపురుషులకు జాల భేదమున్నది.

స్త్రీకి బ్రహ్మచర్యాశ్రమము లేనట్లును పతిశుశ్రూషయే గురుకులవాసమయినట్లును జూచియున్నాము. వానప్రస్థాశ్రమముగూడ స్త్రీకి వికల్పమే యైనట్లు (వనప్రస్థుడు భార్యను గూడ తీసికొని యైనను పోవచ్చుననియు లేదా యింటియొద్ద కుమారుల సన్నిధిని విడిచిపోనైనను వచ్చుననియు) పంచమాధ్యాయములో జూచియున్నాము. సన్యాసాశ్రమము స్త్రీలకు లేదు. సన్యాసినియగు స్త్రీ పతితురాలగునని కలదు.

"జప స్తప స్తీర్థయాత్రా ప్రవ్రజ్యామన్త్రసాధనం ।
దేవతారాధనం చైవ స్త్రీ శూద్రపతితాని షట్"

(అత్రి 135)

(జపము, తపము, తీర్థయాత్ర, సన్యాసము, మన్త్రసాధన, దేవతారాధనము అను నాఱును స్త్రీలకు శూద్రులకును పతితత్వమును కల్గించును.)

భర్తృసహిత కాకుండ జపతపస్తీర్థయాత్ర, దేవతారాధనలను గూడ జేయరాదను నీభావముపైన నీయబడిన "నాస్తి స్త్రీణాం పృథక్ యజ్ఞః" అనుదానిలోనే యున్నది.

స్త్రీలు ప్రాయశ్చిత్తరూపములగు చాంద్రాయణాదు లున్నగు వ్రతములను ప్రత్యేకముగ జేయవలసి యుండును. ఆవ్రతములనైనను వారు గృహమునకు బయటను బంధువరోక్షమునను జేయరాదు.

"బంధుమధ్యే వ్రతం తాసాం కృచ్ఛ్ర చాంద్రాయణాదికం।
గృహేషు సతతం తిష్ఠేచ్ఛుచిర్నియమమాచరేత్"
(పరాశర 9–58)

(స్త్రీలకు కృచ్ఛ్రచాంద్రాయణాదికములగు వ్రతములు బంధుమధ్యమునే చేయతగినవి. వారు నిత్యము గృహమందే యుండి శౌచమును నియమమును పాటింపవలెను.)

భార్యచేసిన పాపములకు భర్త ప్రాయశ్చిత్తము చేసి కొనుటగూడ గలదు. ఏలన: వారిరువురును నొకేశరీరముగదా!

"పతత్యర్ధం శరీరస్య యస్యభార్యాసురాం పిబేత్
పతితార్ధశరీరస్య నిష్కృతిర్నవిధీయతే
గాయత్రీం జపమానస్తు కృచ్ఛ్రంసాతం వసంచరేత్
గోమూత్రం గోమయక్షీరం దధిసర్పిః కుశోదకం
(పరాశర. 10–26, 27)

(ఎవని భార్య సురాపానము చేయునో నాతనిభార్య పతితురాలగుచున్నది. కాన నర్ధశరీరమగు భర్తకు ప్రాయశ్చిత్తము చెప్పబడినది. అతడు గాయత్రిని జపించుచు గోమూత్ర గోమయ గోక్షీర దధిసర్పిస్సులను భుజించుచు కృచ్ఛ్రసాంతపనము చేయవలెను.)

దీనింబట్టి భార్య పాపమును భర్త పంచుకొనునని తెలియుచున్నది. అంతియే కాదు. భార్యచేయు పాపములు భర్తకే యంటునను వచనముకూడ గలదు.

"అన్నాదే భ్రూణహా మార్ష్టి పత్యౌ భార్యాపచారిణీ
గురౌశిష్యస్తు యాజస్తేనో రాజనికిల్బిషం

(వసిష్ఠ. 19–44)

(భ్రూణహత్య చేసినవాని పాపము వానికి తిండిపెట్టిన వాని కంటును. భార్యచేసిన పాపము భర్తకంటును. గురువు చేసిన పాపము శిష్యునకంటును. దొంగచేసిన పాపము రాజున కంటును.)

భార్యపై భర్తకు పూర్ణాధికారము గలదు. కాన నామె పాపములను జేయుటను భర్త యెఱిగియుండియు నేహేతువుచేతనైనను నామెను నివారింపకుండినచో నాపాపము తానే చేసినట్లగునని దీనివలన తెలియుచున్నది.

భర్తృపుణ్యములో భార్య పాల్గొనునని (తథా పుణ్యఫలేషు) మన మిదివఱలో చూచియుంటిమి.

భర్తృపాపములో భార్య పాల్గొనునని మాత్ర మెచ్చటను లేదు. కాని భార్య పుణ్యముచే భర్త పాపియైనను స్వర్గమునకు బోవునని యిదివఱలో జూచియుంటిమి. భార్య పాపములో భర్త పాల్గొనునని కూడ తెలిసి కొంటిమి. భార్యాభర్త లిరువురు నొకే వ్యక్తి యనుటకీ కర్మఫలైక్యమే గొప్ప సాక్ష్యము.

# స్మృతికాలపుస్త్రీలు

## అష్టమాధ్యాయము

### ధనము.

కుమారులతోబాటు కుమార్తెలుగూడ తండ్రియాస్తిని పంచుకొనుట కేస్మృతియు నంగీకరించుటలేదుకాని కుమాళ్లు లేనిచో తండ్రియాస్తి కుమార్తెలకే సంక్రమించునని చాల స్మృతులును చెప్పుచున్నవి.

మనువిట్లు చెప్పుచున్నాడు:

ఊర్ధ్వంపితుశ్చమాతుశ్చ సమేత్యభ్రాతరస్సమం
భజేరన్పైతృకం రిక్థమనీశాస్తే హిజీవతోః

(మను 9–92)

(తలిదండ్రులు చనిపోయినపిమ్మట సోదరులందఱును గలసి పిత్ర్యధనమును పంచుకొనవలెను. తలిదండ్రులు జీవించి యుండగ సోదరులు పంచుకొనుట కర్హులుగారు.)

ఊర్ధ్వంపితుః పుత్రారిక్థం భజేరన్.

(గౌ. 29–1)

(తండ్రియనంతరము పుత్రులు దాయమును పంచుకొనవలెను.)

విభజేరన్సుతాః పిత్రోరూర్ధ్వం రిక్థమృణంసమం
(యాజ్ఞ. 2-114)

(తలిదండ్రుల యనంతరము పుత్రులు దాయమును ఋణమును సమముగా పంచుకొనవలెను.)

పితర్యూర్ధ్వంగతే పుత్రావిభజేరన్ధనం క్రమాత్
(నారద. 13-2)

(తండ్రి చనిపోయిన వాడగుచుండగా పుత్రులు ధనమును క్రమముగ పంచుకొనవలెను.)

కుమారులు లేనివాని పుత్రిక తన సంతతివలన తండ్రి వంశమును నిలబెట్టునని ప్రథమాధ్యాయమున జూచియుంటిమి. కాన నామెయే పుత్రస్థానము నాక్రమించుచున్నదని చెప్పవచ్చును. అందువలననే యపుత్రకుని ధనమాతని కుమార్తెకు వెళ్లునని చెప్పబడినది.

యథైవాత్మాతథాపుత్రః పుత్రేణదుహితాసమా
తస్యాత్మనితిష్ఠన్త్యాంకథ మన్యోధనంహరేత్
(మను 9-130)

(పురుషుడు తానే పుత్రుడగుచున్నాడు. కుమార్తె పుత్రునితో సమానురాలు, కాన నామె యుండగా మఱొకడెట్లు ధనము హరించును?)

అనగా పర్యవసానములో నామె పుత్రునకే ధనము వచ్చును.

దౌహిత్రఏవచహరే దపుత్రస్యాఖిలంధనం

(మను 9—131)

(అపుత్రకుని ధనమును దౌహిత్రుడే పొందును)

ప్రథమాధ్యాయములో తెలుపబడినట్లు భ్రాతృరహిత పుత్రికగా చేయబడినపిమ్మట తండ్రికి పుత్రుడుగల్గుచో నాపుత్రుడును నామెయు తండ్రి ధనమును సమముగనే పంచుకొందురు. కాని పుత్రికకు జ్యేష్ఠ్యాధిక్యము లేదు.

పుత్రికాయాం కృతాయాంతు యదిపుత్రోనుజాయతే
సమస్తత్రవిభాగస్స్యాత్ జ్యేష్ఠతానాస్తిహిస్త్రియాః

(మను 9=134)

అభ్రాతృదుహితయొక్క పుత్రికాత్వమునుగూర్చి ప్రథమాధ్యాయములో పూర్తిగ వివరింపబడియే యున్నది.

సోదరులు దాయము పంచుకొనునప్పటికి వారి యొక్క చెల్లెండ్రవరైన నవివాహితలుగ నుండుచో వారికిగూడ కొంత ధనము వచ్చును.

స్వేభ్యోంశేభ్యస్తుకన్యాభ్యః ప్రదద్యుర్భ్రాతరః పృథక్
స్వాత్స్వాదంశాచ్చతుర్భాగం పతితాస్స్యురదిత్సవః

(మను. 9—118)

(కన్యలకు సోదరులు తమతమ భాగములనుండి వేర్వేరుగా నాల్గవభాగము నీయవలెను. అట్లీయనిచో వారు పతితులగుదురు.)

పెండ్లికాని భగినుల కిట్లు ధనమీయవలెనని చెప్పు టచే నీ ధనముతో వారికి పెండ్లిండ్లు చేయుట సోదరుల విధి యని తేలుచున్నది. యాజ్ఞవల్క్యస్మృతి యీ యంశమును స్పష్టముగ చెప్పుచున్నది.

అసంస్కృతాస్తు సంస్కార్యా(భ్రాతృభిః పూర్వసంస్కృతైః
భగిన్యశ్చనిజాదం శాద్దత్వాంశంతు తురీయకం

(యాజ్ఞ. 2—122)

(సంస్కృతులైన సోదరులు వివాహితలుగాని తోబుట్టువులకు తమ భాగములోని నాల్గవయంశము నిచ్చి వివాహము చేయవలెను.)

అవివాహితగనున్న సోదరికి జ్యేష్ఠ కనిష్ఠసోదరులు దక్క మిగిలిన సోదరులతో సమానభాగము నీయవలెనని నారదుడు తెల్పుచున్నాడు.

జ్యేష్ఠాయాం శోధికో జ్ఞేయః కనిష్ఠాయామావరః స్మృతః
సమాంశభాజశ్శేషాస్స్యురప్రత్తా భగినీతథా

(నారద. 13—13)

కన్యలకు మాతామహి ధనమునుండి కూడ కొంత యీయవలెనని మనువు చెప్పుచున్నాడు.

యస్తాసాంస్యుర్దుహిత రస్తాసామపి యథార్హతః
మాతా మహ్యాధనాత్కించిత్ప్రదేయం ప్రీతిపూర్వకం

(మను. 9—193)

తల్లియొక్క ధనము నామె యనంతరము కుమార్తెలు పంచుకొనవలెనని స్మృతులు చెప్పుచున్నవి.

మాతుర్దుహితరశ్శేషమృణాత్

(యాజ్ఞ. 2–121

(తల్లి ధనమును కుమార్తెలు తీసికొని యామెకు ఋణమున్నచో దానిని తీర్చివేయవలెను.)

మాతుస్తుయౌతకం యత్స్యాత్కుమారీ భాగఏవసః

(మను. 9–121)

(తల్లి ధనము కుమార్తెదే.)

నారదు డిట్లు చెప్పుచున్నాడు:

మాతుర్దుహితరోఽభావేదుహిత్రాణాం తదన్వయః

(నారద. 13–2)

(తల్లియొక్క ధనమును కుమార్తెలు పొందుదురు. కుమార్తెలు లేనిచో వారి వంశీయులు పొందుదురు.)

స్త్రీ దుహితృత్వములోనే కాక మాతృత్వములోగూడ నొక్కప్పుడు దాయమును పొందుట కర్హురాలు కాగలదని మనువు చెప్పుచున్నాడు. సంతతిలేని కుమారునిధనము తల్లికి చెందును.

అనపత్యస్య పుత్రస్య మాతాదాయమవాప్నుయాత్
మాతర్యపిచవృత్తాయాం పితుర్మాతాహరేద్ధనం

(మను. 9–217)

(సంతానహీనుని దాయమును తల్లి పొందును. తల్లి లేనిచో నామె తండ్రి పొందును.)

కాని మనుస్మృతి స్థలాంతరమున సంతానరహితుని ధనము తండ్రికిని సోదరులకును పోవునని చెప్పుటచే తల్లిదండ్రులు సోదరులుగల యనపత్యుని ధన మూ ముగ్గురకు కలసి వెళ్లుననియు వారిలో నెవరు లేకున్నను మిగిలినవారికి వెళ్లుననియు తెలియుచున్నది.

పితామాతేదపుత్రస్య రిక్థ భ్రాతర ఏవచ

(మను 9—185)

(అపుత్రకుని ధనమును తండ్రి, సోదరులు పొందుదురు.)

ఒక డనపత్యుడై మృతిచెందిన పిమ్మట వాని భార్య జీవించియుండుచో వాని ధనము భార్యకే చెందునని యాజ్ఞవల్క్యస్మృతి చెప్పుచున్నది. భార్యాపుత్రులు లేక కుమార్తెలే యుండుచో వారికే యాస్తి పోవును. వారును లేనిచో తల్లిదండ్రులకు సంక్రమించును.

పత్నీదుహితర శ్చైవ పితరౌ భ్రాతర స్తథా
తత్సుతో గోత్రజో బంధుశ్శిష్యస్స బ్రహ్మచారిణః
ఏషామభావే పూర్వస్య ధనభాగుత్తరోత్తరః
సర్వాతస్స్వహ్య పుత్రస్య సర్వవర్ణేష్వయం విధిః

(యాజ్ఞ 2—134)

(అన్నివర్ణములలోను కూడ పుత్రులులేనివాని ధనమును పొందుటకీ క్రిందివారు క్రమముగ నర్హులగుచున్నారు. భార్య, కుమార్తెలు, తలిదండ్రులు, సోదరులు, వారి కుమారులు, సగోత్రులు, బంధువులు, శిష్యులు, సహాధ్యాయులు. ఈ క్రమములో ముందు చెప్పబడినవారు లేనపుడు తర్వాతి వారికి దాయము పొందుట కర్హత గలుచున్నది.)

తండ్రి చనిపోయిన పిమ్మట నాతని ధనమును కుమారులు పంచుకొనునపుడు తల్లికి కూడ కుమారులతో బాటు భాగము వచ్చునని యాజ్ఞవల్క్యుడు చెప్పుచున్నాడు.

పితురూర్ధ్వం విభజతాం మాతాప్యంశం సమం హరేత్

(యాజ్ఞ 2-121)

ఒకడు తాను జీవించియుండగనే కుమారులకు భాగములు పంచుచో వారితో సమముగ తన భార్యలకు కూడ భాగముల నీయవలెను. వారిదివరలో తనవలనగాని తన తండ్రివలనగాని ధనమును పొందియున్నచో నా భాగము నిపుడు తగ్గింపవలెను.

యదికుర్యాత్సమానంశాన్పత్న్యః కార్యాస్సమాంశకాః
నదత్తం స్త్రీధనం యాసాం భర్త్రా వాశ్వశురేణవా

(యాజ్ఞ 2-113)

దాయభాగముగ వచ్చిన సొత్తుగాక యింకను ననేక విధములుగ స్త్రీకి ధనము వచ్చుటకు వీలున్నది. స్మృతికారుల చేత స్త్రీధనము మొత్తము మారువిధములుగ విభజింపబడినది.

అధ్యగ్న్యధ్యావాహానికం దత్తంచ ప్రీతికర్మణి
భ్రాతృమాతృపితృప్రాప్తం షడ్విధం స్త్రీధనం స్మృతం
(మను 9–194)

(స్త్రీధన మారువిధములు :—(1) వివాహకాలమున నగ్నియెదుట పిత్రాదులచే కూతున కొసగబడిన ధనము. (2) కుమార్తె యత్తింటి కేగునపు డామె కీయబడిన ధనము. (3) భర్త సంతోషముతో భార్యకిచ్చిన సొమ్ము. (4) (5) (6) సోదరుడు, తల్లి, తండ్రి యితరసమయములలో నిచ్చిన సొత్తు)

యాజ్ఞవల్క్యుడు గూడ నిట్లే చెప్పుచున్నాడు.

పితృమాతృ పతిభ్రాతృ దత్తమధ్యగ్న్యుపాగతం
ఆధివేదనికాద్యంచ స్త్రీధనం పరికీర్తితం
(యాజ్ఞ 2–141)

తండ్రి, సోదరుడు, పతి మున్నగువారు స్త్రీకి తరచుగ నేదో కొంతసొమ్మును ముట్టచెప్పు చుండవలెను. అట్లు స్త్రీలు గౌరవింపబడుచోట సంపత్తియు కల్యాణము నుండును.

పితృభిర్భ్రాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా
పూజ్యాభూషయితవ్యాశ్చ బహుకల్యాణమీప్సుభిః
జామయోయాని గేహానిశపంత్య ప్రతిపూజితాః
తానికృత్యాహతానీవ వినశ్యన్తి సమంతతః
తస్మాదేతాస్సదా పూజ్యాభూషణాచ్ఛాదనాశనైః
భూతికామైర్నరైర్నిత్యం సత్కారేషూత్సవేషుచ
(మను 3–55, 58, 59)

(మిక్కిలి కల్యాణమును కోరునట్టి తండ్రి, సోదరుడు, భర్త, మఱది స్త్రీలను పూజించి వారికలంకారాదికములనిచ్చు చుండవలెను. తోఁబుట్టువులు పూజింపబడనివారై యేయింటిని శపింతురో యాయిల్లు శక్తిచే కొట్టబడినదానివలె నశించును. కాన నైశ్వర్యమును కోరువారెల్లప్పుడును భూషణముల తోను, వస్త్రములతోను, చక్కని భోజనములతోను శుభకార్యములలోను నుత్సవదినములలోను స్త్రీలను పూజింపవలెను.)

ఈవిధముగ వచ్చు నలంకారాదులన్నియు స్త్రీ ధనమగును. స్త్రీలకు భర్త్రాదులవలన వచ్చు కానుక లనేకవిధములు గలవు. వివాహములో వరుడు కన్యాదాతకు శుల్కము నిచ్చుటకాక కన్యకే కొంతధనము నిచ్చుట కలదు. దానిని కన్యతలిదండ్రు లనుభవింపరు. అది పూర్తిగ కన్యకే చెందును.

యాసాంనాదద తే శుల్కం జ్ఞాతయో నవిక్రయః
అర్హణం తత్కుమారీణాం మానృశంస్యంచ కేవలం

(మను. 3—54)

వివాహమునకు పూర్వముగూడ తల్లి తండ్రి సోదరుడు ననువారు కన్యకు భూషణముల నిచ్చుట స్మృతులవలన తెలియుచున్నది. కన్య స్వయముగ వరుని కోరుకొని యాతని వివాహమాడిననే తప్ప యాసొమ్ము శాశ్వతముగ నామెదే యగును.

అలంకారం నాదదీతషిత్ర్యం కన్యాస్వయంవరా
మాతృకం భ్రాతృదత్తం వాస్తేనాస్యాద్యదికిం హారేత్
(మను. 9—92)

భార్యయుండగ భర్త పునర్వివాహము చేసికొనుచో నాతని ద్వితీయ వివాహమునకగు వ్యయముతో సమమగు ధనమును ప్రథమభార్య కీయవలెను. ఆమె కిదివఱకే కొంత స్త్రీధన మిచ్చుచో నిపుడు దానిని తగ్గించి యీయవలెను.

అధివిన్నః స్త్రియైకద్యాదాధివేదనికం సమం
నదత్తం స్త్రీధనం యస్యైదత్త్వేత్యర్థం ప్రకల్పయేత్
(యాజ్ఞ. 1—146)

ఇవన్నియు స్త్రీకి ప్రత్యేకముగ చెందు ధనములే యైయున్నవి.

స్త్రీ ధనమును ప్రత్యేకశ్రద్ధతో కాపాడుట రాజు ధర్మము.

వశాపుత్రాసుచైవం స్యాద్రక్షణం నిష్కులాసుచ
పతివ్రతాసుచ స్త్రీషు విధవాస్వాతురాసుచ
(మను. 8—28)

(బిడ్డలు లేక భర్తవలన భరణము కొనుచున్నట్టియు వంశహీనలైనట్టియు స్త్రీలయొక్కయు, పతివ్రతలయొక్కయు, విధవలయొక్కయు, రోగిణులయొక్కయు ధనమును బాలుర ధనమువలె రాజు కాపాడవలెను.)

స్త్రీ ధనము నపహరించుట మహాపాపముగ చెప్పబడి నది. స్త్రీల వస్తువులనుకూడ నితరులు వాడుకొనరాదు.

స్త్రీ ధనానితుయే మోహాదుపజీవన్తి బాంధవాః
నారీయానాని వస్త్రంవా తే పాపాయాన్త్యధోగతిం
(మను. 3—52)

(అజ్ఞానముచే స్త్రీ ధనము ననుభవించునట్టియు స్త్రీల వాహనములను వస్త్రములను నుపయోగించు నట్టియు బంధువులు పాపులు. వారధోగతికి పోదురు.)

కాని కొన్ని పరిస్థితులలో భార్యయొక్క ధనమును భర్త వాడుకొనవచ్చును.

దుర్భిక్షే ధర్మకార్యే చవ్యాధౌ సం ప్రతిరోధనే
గృహీతం స్త్రీధనం భర్తానస్త్రియై దాతుమర్హతి
(యాజ్ఞ. 2—145)

(కఱవులోను, ధర్మకార్యములోను, వ్యాధిలోను, కష్టము నుండి తప్పించుకొనుటలోను భర్త భార్య ధనమును తీసికొనుచో నాతడాధనము నామెకు తిరిగి యియ్యనక్కరలేదు.)

భార్యాభర్తలిరువురు నొకే సంసారము నిర్వహించు వారగుటచేతను నైహికాముష్మిక విషయములన్నిటిలోను సమత్వముగలవారగుటచేతను భర్తకు స్త్రీధనము వాడుకొనుటలో నాశ్చర్యము లేదు. భార్య సమస్త విషయములలోను భర్తకనువర్తనగ నుండవలెను గాన నామెకుగల పృథగ్ధనము నామ

మాత్రమే. అట్లే భర్త కెంతధనముపై నధికారమున్నను భార్యకు కూడ క్రియలో దానిపై నధికారము రాకతప్పదు. కాన నీసొత్తు భార్యది యీసొత్తు భర్తది యను విభాగమే సాధ్యముకాదు. కావుననే ఆపస్తంబు డిట్లు చెప్పుచున్నాడు.

జాయా పత్యోర్న విభాగోదృశ్యతే

(ఆ. ధ. సూ. 2—14—16)

(భార్యాభర్తలకు విభాగము లేదు.)

కాన నిఱువురకును నామమాత్రముగ వేర్వేరుగ నున్న సొత్తుపైన నిర్వురకు నధికారము గలదనియే చెప్పవలెను. ఈయంశ మీక్రింది సూత్రములలో స్పష్టము చేయబడినది.

కుటుంబి నౌధనస్యేశాతే

(ఆ. ధ. సూ. 2—29—3)

(భార్యాభర్త లిఱువురును ధనమున కధికారులు)

వారికి ద్రవ్యవిషయములో సమానస్వామిత్వము పాణిగ్రహణము వలననే కల్గుచున్నది. పాణిగ్రహణమువలన దంపతులకు కర్మలో సహత్వము గల్గునట్లే.

ద్రవ్యపరిగ్రహేషుచైవం. ఆ. ధ. సూ. 2—14—19)

ధనమును నిర్వహించుటలో గూడ సహత్వము వచ్చుచున్నదని యాపస్తంబుడు చెప్పుచున్నాడు. భర్త ధనము నార్జించుటయు భార్య యా ధనమును నిర్వహించుటయు జరు

గుచో నది చక్కని మహత్త్వముగును. ద్రవ్యమును నిర్వహించుట యను పనిని భర్త భార్య కిచ్చునదియే కాని యామె కందుపై స్వతస్సిద్ధముగు నధికారములేని మాట వాస్తవమే.

అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్

(మను. 9—11)

(ధనమును రక్షించుటయందును వ్యయపఱచుటయందును స్త్రీని నియోగింపవలెను.)

ఈవిధముగ భర్తచే నధికారములో ప్రతిష్ఠింపబడిన భార్య తన యధికారమును దుర్వినియోగము చేయరాదు. భర్త్రాజ్ఞలేనిదే కుటుంబధనము నుండి యలంకారాదులను చేయించుకొనరాదు.

న నిర్హారం స్త్రియః కుర్యుః కుటుంబాద్బహుమధ్యగాత్
స్వకాదపి చ విత్తాద్ధి స్వస్య భర్తురనాజ్ఞయా

(మను. 9—199)

(సోదరులు మున్నగువారనేకులుగల కుటుంబము నుండి ధనమును సంగ్రహించి స్త్రీలాభరణాదులను చేయించుకొనరాదు. తమ భర్త సొత్తునుండియైనను నాతని యాజ్ఞ లేనిదే యలంకారాదులను చేయించుకొనరాదు.)

న్యాయములగు వ్యయములను జేయుట కామె కధికారము గలదు. భర్త గ్రామాంతరములో నున్నపుడు నైమిత్తిక దానములను జేయుటకు గూడ నామె కధికారమున్నది.

నహిభర్తుర్విప్రవాసే నైమిత్తికే దానేస్తేయ
ముపదిశంతి

(ఆ. ధ. సూ. 2-14-20)

(భర్త ప్రవాసములో నుండగ నైమిత్తికదానము చేయుట దొంగతనము కానేరదు.)

పైన తెల్పబడిన దాయరూపస్త్రీ ధనరూపమైన ధనము కాక మఱి యేవిధమగు ధనమును స్త్రీ యార్జించినను నాధనము భర్తదే యగును.

భార్యాపుత్రశ్చదాసశ్చత్రయ ఏవాధనాః స్మృతాః
యత్తేసమధిగచ్ఛన్తి యస్యతేతస్య తద్ధనం

(మను. 8-416)

(భార్య, పుత్రుడు, దాసుడు—ఈ ముప్వురకు వేరుగ ధనముండదు. వారేధనము సంపాదింతురో యాధనము వారెవనికి చెందుదురో వానిదే.)

ఇదివఱలో దాంపత్యమను ప్రకరణమున ధర్మార్థకామములలో భార్యాభర్తలొకే వ్యక్తివలె నుండవలెనను నంశమును చూచి యుంటిమి. దాని ననుసరించియే పైన వివరింపబడిన ధనవిషయకానుబంధము దంపతులకు గల్గు చున్నది. కాని ఋణవిషయములో నిట్టి సమాన బాధ్యత లేదు. భర్త్రృ మరణానన్తర మాతని ధనమునెల్ల పొందుటకు నపుత్రయగు భార్య కధికారమున్నది కాని యాతడు చేసిన ఋణమునెల్ల తీర్పవలెనను విధి యామెకు లేదు.

నయోషిత్పతిపుత్రాభ్యాం నపుత్రేణ కృతంపితా
దద్యాదృతే కుటుంబార్థాన్నపతిః స్త్రీకృతంతథా

(యాజ్ఞ 2-45)

(పతి, పుత్రుడు చేసిన కుటుంబార్థముకాని ఋణమును స్త్రీ తీర్పనక్కరలేదు. అట్లే పుత్రునిచేత చేయబడిన ఋణమును తండ్రియూ భార్యచేత చేయబడిన ఋణమును భర్తయు తీర్పనక్కరలేదు.)

మూడు విధములగు ఋణములను తీర్చుటకే స్త్రీకి విధికలదు.

ప్రతిపన్నం స్త్రీయాదేయం పత్యావాసహయత్కృతం
స్వయంకృతం వాపియదృణం నాన్యం స్త్రీదాతుమర్హతి

(యాజ్ఞ 2-48)

(ఈ మూడు ఋణములను స్త్రీ తీర్పవలెను; (1) భర్త చనిపోవుచునే ఋణమును తీర్పవలసినదని భార్యకాదేశింపగా భార్య యందులకు సమ్మతించునో యాఋణము (2) భర్తతో కలసి చేసిన ఋణము (3) స్వయముగ చేసిన ఋణము. మరే ఋణమును స్త్రీ తీర్పనక్కరలేదు.)

స్త్రీ చేసిన ఋణమును పతి తీర్పనక్కరలేదు. కాని యేకులములలో స్త్రీలు కూడ ధనసంపాదనముచేసి కుటుంబయాత్రకు తోడ్పడుదురో యాకులములలో భార్యచేసిన ఋణమును భర్త తీర్పవలెనని యాజ్ఞవల్క్యుడు తెల్పుచున్నాడు.

గోపశౌండిక శైలూష రజకవ్యాధయోషితాం
ఋణందద్యాత్పతిస్తాసాం యస్మాద్వృత్తిస్తదాశ్రయా
(యాజ్ఞ 2-47)

(గొల్ల, కలార, చాకలి, బెస్తల కులములలోను నటకుల కులములోను స్త్రీ చేసిన ఋణమును భర్త తీర్పవలెను. ఏలన నందు వృత్తి స్త్రీల నాశ్రయించి యుండును.)

యాజ్ఞవల్క్యుని కాలమునాటి కీకులములలోని స్త్రీలు పనిచేసి ధనము సంపాదించెడివారని దీనివలన తెలియుచున్నది. వీరుకాక వివిధవర్ణములకు చెందిన స్త్రీలు ధనికుల యిండ్లలో పరిచారకురాండ్రుగనుండి ధనమార్జించు చుండినట్లు స్మృతుల వలన తెలియుచున్నది. వారు తఱచుగ 'స్త్రియః' అను పదముచేతనే తెలుపబడుచున్నారు.

వస్త్రం పత్రమలంకారం కృతాన్నముదకం స్త్రియః
యోగక్షేమం ప్రచారంచ నవిభాజ్యం ప్రచక్షతే
(మను 9-219)

(వస్త్రములు, వాహనములు, అలంకారములు, పక్వముచేసిన తినుబండ పదార్థములు, బావిలోని నీరు, స్త్రీ సేవకురాండ్రు, మంత్రి పురోహితుడు మున్నగువారు రాకపోకల దారులు—వీనిని పంచుకొనరాదు.)

ధార్మిక జీవనముగల కులములలో స్త్రీకి స్వతంత్ర జీవనములేదు.

పితారక్షతి కౌమారే భర్తారక్షతి యౌవనే
రక్షంతిస్థావిరే పుత్రాన స్త్రీస్వాతంత్ర్యమర్హతి.

(మను 9–3)

(స్త్రీని బాల్యములో తండ్రియు, యౌవనములో భర్తయు, వార్ధకములో పుత్రులును రక్షింపవలెను. స్త్రీ స్వాతంత్ర్యమున కర్హురాలుకాదు)

భర్త మరణించిన పిమ్మట స్త్రీకి పుత్రులతో బాటు భాగమువచ్చుటను పైన చూచియున్నాము. అయినను నామె పుత్రుని యధీనముననే యుండవలెను. వ్యభిచారిణియగు స్త్రీకి భర్త యాస్తిలో భాగమురాదు.

తామరిక్థ్యా ముపేయాత్ (వసిష్ఠ 13–53)

దాయభాగము పొంద నర్హులుకాని క్లీబాదులను వారి భార్యలను కూడ తక్కినవారు పోషింపవలెను. వారి పుత్రులు పెద్దవారగుచో పుత్రులే పోషింపవలెను. కాని యీక్లీబాదుల భార్య లపుత్రలై వ్యభిచారిణులగుచో వారిని మిగిలినవారు పోషింపనక్కరలేదు.

అపుత్రా యోషితశ్చైషాం భర్తవ్యా సాధువృత్తయః
నిర్వాస్యా వ్యభిచారిణ్యః ప్రతికూలాస్తథైవచ

(యాజ్ఞ 2–140)

(అపుత్రులైన క్లీబ, పతిత, పంగూన్మత్త, జరడాంధా చికిత్స్యరోగార్తుల భార్యలు మంచివారగుచో వారిని పోషింప

వలెను. వ్యభిచారిణులుకాని ధిక్కరించువారుకాని యగుచో వారి నింటినుండి వెళ్లగొట్టవలెను.)

భర్తృ సంబంధమైన ధనమేమియు లేకపోయినను గూడ వితంతువును భర్తృపక్షమునారు పోషింపవలెను.

మృతేభర్తర్య పుత్రాయాః పతిపక్షః ప్రభుఃస్త్రియాః
వినియోగాత్మరక్షా సుభరణేచ స ఈశ్వరః

(నారద. 13–28)

(భర్తపోయిన యపుత్రయగు స్త్రీకి నియోగమునందును, నాత్మరక్షయందును, భరణమునందును పతిపక్షము వారే గతి.)

అట్టి స్త్రీలు బ్రాహ్మణేతర కులమునకు చెందినవారగుచో వారిని రాజే పోషింపవలెనని నారదుడు చెప్పుచున్నాడు.

అన్యత్రబ్రాహ్మణే భ్యస్తాన్య్రదాజా ధర్మపరాయణః
తత్స్త్రీభ్యోజీవనం దద్యాదేవదాయ విధిఃస్మృతః

(నారద. 13–52)

సమిష్టి కుటుంబములో నుండగానే యొకడపుత్రకుడై మరణించుచో వాని భార్యను వాని సోదరులే పోషింపవలెనని నారదుడు చెప్పుచున్నాడు.

భ్రాతౄణామప్రజాః ప్రేయాత్కశ్చిచ్చేత్ప్రవజేత్తువా
విభజేరన్ధనంతస్య శేషస్తు స్త్రీధనం వినా
భరణం చాస్యకుర్వీరన్ స్త్రీణామా జీవితక్షయాత్.

రక్షన్తి శయ్యాం భర్తుశ్చే దాచ్ఛిన్ద్యురితరాసు చ
యాతస్య దుహితాతస్యాః పిత్ర్యోంశే భరణేమతః
ఆసంస్కారం భజేరంస్తాం పరతోబి భయాత్పతిః

(నారద. 13–25 26,27)

(సోదరులలో నొకడు కుమాళ్లులేకుండ చనిపోవుచో గాని సన్యాసియగుచో గాని వాని సోదరులాతని ధనమును పంచుకొని యాతని భార్యయొక్క స్త్రీ ధనమును మాత్రము వారు పంచుకొనరాదు—ఆతని భార్యలను చిరజీవులకు పోషింపవలెను. వారు వ్యభిచారిణులగుచో పోషింప నక్కర లేదు. వానికి కుమార్తె యుండుచో నామెకు తండ్రి యాస్తి లోనుండి రొుక భాగమిచ్చి, వివాహము చేయవలెను. వివాహమైనపిమ్మట నిక వారామెను భరింపనక్కరలేదు. భర్తయే భరించును.)

పైన నీయబడిన యాజ్ఞవల్క్యాది వాక్యములను బట్టి విభక్త కుటుంబములో గూడ పితంతువునకు భర్త యాస్తి వచ్చునని తేలుచున్నది. కాని నారదుని యభిప్రాయము వేరైన ట్లీ శ్లోకములవలన తెలియుచున్నది.

మొత్తముపైన ధర్మశాస్త్రములలో నార్థికవిషయమున స్త్రీలు పురుషులకంటె విస్తారముగ వెనుబడి యున్నారని చెప్పుటకు వీలులేదని పైన వివరింపబడిన యంశములవలన తెలియగలదు.

# స్మృతికాలపుస్త్రీలు

## నవమాధ్యాయము

### గౌరవము, స్వాతంత్ర్యము.

దాంపత్యము, కర్మకాండ, ధనము మున్నగు వంశము లలో స్త్రీల కెట్టి స్థానమును స్మృతు లంగీకరించుచున్నవో యిదివరలో చూచియుంటిమి. కాన వారి గౌరవ స్వాతంత్ర్యములు గూడ కొంతవఱకు మనకు వ్యక్తములైనవి. స్త్రీల గౌరవస్వాతంత్ర్య విషయములలో పూర్వాధ్యాయములలో పేర్కొనబడని యంశములను పేర్కొనబడినవానిలో ముఖ్యములగు వానిని నీయధ్యాయమున పరిశీలింతము.

జీవితములోని వివిధసందర్భములలో వివిధపరిమాణములుఁగల గౌరవము స్త్రీల కంగీకరింపబడినట్లే వివిధపదవుల లోనుండు స్త్రీలకుగూడ వివిధపరిమాణములుగల గౌరవమంగీకరింపబడినవి. అనగా తల్లికొక విధమగు గౌరవమును, భార్యకొక విధమగు గౌరవమును, కూతునకొక విధమగు గౌరవమును వితంతువునకొక విధమగు గౌరవమును ఇట్లే యొక్కొక స్థానములోనున్న స్త్రీకొకవిధమగు గౌరవము నంగీకరింపబడినవి. అందందఱికంటె మాతకు చూపబడిన గౌరవము సర్వాధికమై యొప్పుచున్నది.

తల్లి, తండ్రి, గురువునను ముప్పురపైనను భక్తిగల్గి యుండుట పరమధర్మము.

ఇమంలోకంమాతృభక్త్యా పితృభక్త్యాతుమధ్యమం
గురుశుశ్రూషయాత్వేవ బ్రహ్మలోకం సమశ్నుతే
(మను 2-233)

(ఈలోకమును మాతృభక్తిచేతను మధ్యమలోకమును పితృభక్తిచేతను బ్రహ్మలోకమును గురుశుశ్రూషచేతను పొందవచ్చును.)

తఏవత్రయోలోకాస్తఏవ త్రయఆశ్రమాః
తఏవత్రయోవేదాస్తఏవోక్తా స్త్రయోగ్నయః
(మను 2-230)

(తల్లి, తండ్రి, గురువునను వారలే మూడు లోకములు, వారే మూడాశ్రమములు, వారే మూడు వేదములు, వారే మూడగ్నులు.)

ఈముప్పురిలోను కూడ మాతయే హెచ్చుగ పూజ్యురాలు.

ఉపాధ్యాయాన్దశాచార్య ఆచార్యాణాంశతంపితా
సహస్రంతుపితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే
(మను 2-145)

(పదిమంది యుపాధ్యాయులకంటె నొక యాచార్యుడు హెచ్చు గౌరవార్హుడు. నూరుమంది యాచార్యులకంటె

తండ్రి హెచ్చుగ పూజ్యుడు. తండ్రికంటె వేయిరెట్లు తల్లి యెక్కుడు పూజ్యురాలు.)

తల్లికిమించిన దైవములేదని యౌశనస్మృతి చెప్పు చున్నది.

నాస్తి పితృసమం దైవం (ఔశనః 1—35)

(తల్లితో సమానమైన దైవములేదు.)

ఆచార్యుడు, తండ్రి, తల్లియనువారలలో నాచార్యుడే హెచ్చుగ పూజ్యుడని కొన్ని స్మృతులు చెప్పుచున్నవి.

ఆచార్యః శ్రేష్ఠో గురుణాం (గౌ. 2—56)

కొందఱిమతములో తల్లియే యెక్కుడు పూజ్యురాలను నంశమునుగూడ గౌతము డంగీకరించుచున్నాడు.

మాతేత్యేకేమాతేత్యేకే (గౌ. 2—57)

అనగా నీలోకములో గౌరవింప తగినవారిలో తల్లియే ప్రథమురాలనియు నీయంశము నంగీకరింపనివారి మతములో గూడ తల్లి గౌరవములో ద్వితీయస్థానము నలంకరించుచు న్నదనియు తేలుచున్నది. తలిదండ్రులిద్దరిలో తల్లియే యధి కురాలని కూడ స్పష్టమైనది.

మాతయే శిశుజనమునకు హెచ్చు బాధపడునదియు, శిశుపోషణమునకుకూడ హెచ్చు కారకురాలగుటయు నిందు లకు కారణమై యుండవచ్చును.

యథామాతరమా శ్రిత్యసర్వే జీవన్తి జన్తవః

(వసిష్ఠ 8—16)

(తల్లి ననుసరించి సమస్త జంతువులు జీవించునట్లు)

అను నొక యుపమానము వసిష్ఠస్మృతిలో వాడబడి నది. తల్లి భరించునది కావునను భౌతిక దేహమున కామె కారకురాలగుచున్నది కావునను నామె భూదేవియొక్క రూపమని చెప్పబడినది. సహిష్ణుత సహనభావములో గూడ మాత పృథివిని పోలుచున్నది.

మాతా మూర్తిః పృథివ్యాస్తు (మను 2–225)

(తల్లి పృథివియొక్క మూర్తి)

అట్టి జీవహేతువైన తల్లిని పోషింపవలసిన విధి పుత్రునిపై గలదు. మనుస్మృతి పదునొకండవ యధ్యాయమున నుపపాతకములను జెప్పుచు.

గురుమాతృ పితృత్యాగః (మను 11–59)

అని గురుమాతృ పితృత్యాగమును గూడ నందుచేర్చినది. నూరు సంవత్సరములు సేవచేసినను తలిదండ్రుల ఋణము తీరదని మనుస్మృతి చెప్పుచున్నది.

యంమాతాపితరౌ క్లేశం సహేతే సంభవేనృణాం
నతస్యనిష్కృతి శ్శక్యాకర్తుం వర్షశతైరపి

(మను 2–227)

అవసరమగుచో నిత్యకర్మలను వదలియైనను తలిదండ్రులను సేవింపవలెను. అంతేకాదు. వారి యనుజ్ఞలేనిదే ధర్మకార్యములను జేయరాదు.

నతాభ్యామననుజ్ఞాతో ధర్మమేవ సమాచరేత్

(ఉశనః. 1—36)

వర్జయిత్వాముక్తిఫలం నిత్యనైమిత్తికం తథా

(ఉపశనః. 1—37)

ఒక విశేషమేమన: తండ్రి పతితుడైనచో కుమారుడాతనివల్ల భక్తి చూపనక్కరలేదు. కాని తల్లి పతితురాలైనను కుమారుడామెవల్ల భక్తి చూపవలసినదే. తల్లి దోషములను గూర్చి చింతించుటకైనను కుమారునకధికారములేదు.

పతితఃపితా పరిత్యాజ్యో మాతాతుపుత్రేనపతతి

(వసిష్ఠ. 13—47)

(పతితుడైన తండ్రిని వదలివేయవలెను. తల్లి యన్ననో పుత్రునిదృష్టిలో నెప్పుడును పతితురాలు కాదు.)

తలితండ్రులపట్ల నిట్లు గౌరవము కనబరుపవలసిన విధి పుత్రునకే చెప్పబడినది కాని కుమార్తెకు కాదు. స్త్రీ కందరికంటెను భర్తయే యెక్కువవాడు.

పతిరేకః ప్రభుః స్త్రీణాం

(భర్త యొక్కడే స్త్రీకి ప్రభువు)

స్త్రీభిర్భర్తృవచః కార్యమేషధర్మః పరస్త్రియాః

(స్త్రీకి భర్తృవచనమును పాటించుటకంటెను నెక్కుడు ధర్మము లేదు.)

మున్నుగు నంశములను దాంపత్యమను ప్రకరణమున చూచియే యుంటిమి.

పురుషునకు తల్లియే కాక మఱికొందరు స్త్రీలు కూడ గౌరవార్హులు గలరు.

మాతామాతా మహీగుర్వీపితృమాతృష్వ స్రాదయః
శ్వశ్రూఃపితామహీ జ్యేష్ఠాజ్ఞాతవ్యా గురవఃస్త్రియః
(ఉశనః 1—26)

(తల్లి, మాతామహి, గురుభార్య తలిదండ్రుల యక్క చెల్లెండ్రు, అత్తగారు, నాయనమ్మ, అక్క—అను స్త్రీలు గురువులు)

గురుభార్య గురువువలెనే పూజ్యురాలు.

గురువత్ప్రతిపూజ్యాశ్చ సవర్ణాగురుయోషితః
అసవర్ణాస్తు సంపూజ్యాః ప్రత్యుత్థానాభివాదనైః
(ఉశనః 2—27)

(సవర్ణలైన గురుభార్యలు గురువువలెనే పూజింపతగిన వారు. అసవర్ణలన్ననో యెదురేగుట నమస్కరించుట మున్నగువానిచే పూజింపతగిన వారు.)

గురువునకువలెనే గురుపత్నులకు గూడ పాదములను బట్టి నమస్కరింపవలెను. కాని యౌవనములో నున్న గురుపత్నియొక్క పాదములను తాకకుండ భూమిమీదనే యభివాదము చేయువలెను.

కామంతు గురుపత్నీనాం యువతీనాం యువాభువి
విధివద్వందనం కుర్యాదసావహమితి బ్రువన్.

(మను. 2—216)

నైష్ఠిక బ్రహ్మచారి గురువు చనిపోయిన పిమ్మట గురుభార్యకు శుశ్రూష చేయవలెను.

గురుదారే సపిండే వా గురువద్వృత్తిమాచరేత్.

(మను. 2—247)

ఆడపడుచులకు గూడ గృహములో గొప్ప గౌరవమీయబడినది.

జామయో యాని గేహాని శపంత్యప్రతిపూజితాః
తానికృత్యాహతానీవ వినశ్యన్తి సమంతతః

(మను. 3—58)

(ఎవరి యక్కచెల్లెండ్రు పూజింపబడని వారై శపింతురో వారిగృహములు దయ్యము చేత కొట్టబడినవివలె నశించును)

సౌభాగ్యవంతురాండ్రగు నింటి యాడపడుచులకును గర్భిణులకును నతిథులకు కంటెను గూడ ముందుగ భోజనము పెట్టవలెను.

సువాసినీః కుమారీశ్చ రోగిణో గర్భిణీస్త్రియః
అతిథిభ్యోగ్ర ఏవైతాన్ భోజయేదవిచారయన్.

(మను. 3—114)

గర్భిణి రేవు నావను దాటునపుడామె యొద్ద నేమియు తీసికొనరాదని కూడ చెప్పబడినది.

గర్భిణీతు ద్విమాసాది స్తథా ప్రవ్రజితో మునిః
బ్రాహ్మణోలింగి నశ్చైవనదాప్యా స్తారికంతరే.

(మను. 8—407)

గర్భిణికిట్టి పూజ్యత గలదనుట కిట్టి యుదాహరణము లెన్ని యోకలవు.

గర్భిణి కోరికలను మన్నింపవలెను.

దోహదస్యా ప్రదానేన గర్భోదోష మవాప్నుయాత్
వైరూప్యం మరణంవాపి తస్మాత్కార్యం ప్రియంస్త్రియాః.

(యాజ్ఞ 2—79)

(గర్భిణి వాంఛను తీర్పనిచో గర్భము దోషమును, వైరూప్యమును, మరణమును పొందును కాన నామె యభీష్టము నెరవేర్పవలెను.)

గర్భిణి యేదైన తప్పుచేసినను నామెను మాటలతో మందలింపవలసినదే కాని యంతకంటెను నామెను శిక్షింప రాదు.

ఆపద్గతో థవావృద్ధోగర్భిణీ బాలఏవవా
పరిభాషణమర్హంతి తచ్ఛశోధ్యమితిస్థితిః

(మను. 9—283)

సాధారణ స్త్రీలకుగూడ దండనపురుషులకు కంటె తక్కువగనే చెప్పబడినది.

స్త్రీబాలోన్మత్తవృద్ధానాం దరిద్రాణాంచ రోగిణాం
శిఫావిదలరజ్జ్వాద్యైర్వి దద్యాన్నృపతిర్దమం.

(మను. 91—23)

(స్త్రీలు, బాలురు, పిచ్చివారు, వృద్ధులు దరిద్రులు, రోగులు—వీరు తప్పుచేయుచో రాజు వేళ్లు, బద్దలు, త్రాళ్లు మున్నగువానితో కొట్టింపవలెను)

స్త్రీలయందతి కోపము చూపరాదని పరాశరుడు చెప్పుచున్నాడు.

స్త్రీబాల నృపగోవిప్రేష్వతికోపం వివర్జయేత్

(పరాశర. 9-61)

సాధారణముగ స్త్రీలందఱును పూజింపతగినవారే.

భర్తృభ్రాతృపితృ జ్ఞాతిశ్వశ్రూశ్వశుర దేవరైః
బంధుభిశ్చ స్త్రియః పూజ్యాభూషణాచ్ఛాదనాశనైః

(యాజ్ఞ. 1-88)

(భర్తలు, భ్రాతలు, తండ్రులు, జ్ఞాతులు, మామలు, అత్తలు, మఱదులు, బంధువులు గూడ స్త్రీలను భూషణముల తోను, భోజనములతోను, వస్త్రములతోను పూజింపవలెను.)

స్త్రీలు దేవతలవలె పూజింపతగినవారు. వారు పూజింపబడనిచోట దేవతలుగూడ సంతోషింపరు.

యత్రనార్యస్తుపూజ్యన్తే రమన్తే తత్రదేవతాః
యత్రైతాస్తునపూజ్యన్తే సర్వాస్తత్రాఫలాఃక్రియాః

(మను. 3-56)

(స్త్రీలెచట పూజింపబడుచున్నారో దేవతలచట క్రీడింతురు. స్త్రీలెచట పూజింపబడరో యచట జరుగుక్రియలన్నియు నిష్ఫలములే యగును.)

స్త్రీలను పలుకరించుటలో గూడ గౌరవమును గన్పఱుపవలెను.

వరపత్నీతుయా స్త్రీస్యాదసంబంధాచ యోనితః
తాంబ్రూయాద్భవతీత్యేవం సుభగేభగినీతిచ

(మను. 2—129)

(రక్తబంధుత్వములేనట్టియు, పరుని భార్యయైనట్టియు స్త్రీని 'భవతి' పూజ్యురాలా—'సుభగే'—సౌభాగ్యవంతురాలా 'భగిని'—సోదరీ—యని సంబోధింపవలెను.)

మార్గమధ్యమున స్త్రీ యెదురగుచో పురుషుడు ప్రక్కకు తప్పుకొని యామెకు దారి యొసగునట్టి గౌరవము చేయవలెను.

వధూస్నాతకరాజభ్యః పథోపదానం

(గౌ. 6—24)

(స్త్రీకిని స్నాతకునకును రాజునకును మార్గము నీయవలెను.)

స్త్రీ కుపనయనము లేకపోవుటచే నామెకు బ్రహ్మణ్యసిద్ధి లేకపోవుటచే కాబోలు నామె బ్రాహ్మణవర్ణములో జన్మించినను బ్రాహ్మణ పురుషునకు గల పవిత్రత, ప్రాముఖ్యము నామె కంగీకరింపబడలేదు. బ్రాహ్మణుని చంపినచో మహాపాతకము వచ్చుననియు నది పతనహేతువనియు చెప్పబడినది. కాని బ్రాహ్మణస్త్రీని చంపినచో నట్టిపాపము రాదు. కాని ఋతుస్నాతను జంపుచో నట్టిపాపమే వచ్చును.

ఆత్రేయీం చస్త్రియం

(ఆ. ధ. సూ. 1—24—9)

సామాన్య బ్రాహ్మణస్త్రీని చంపుచో క్షత్రియాదులను జంపునపుడు వచ్చు పాతకమే వచ్చును.

స్త్రీశూద్రవిట్ క్షత్రవధో నాస్తిక్యంచో పపాతకం

(మను. 11—66)

పురుషశిశువును గర్భమున ధరించుటకు తగిన స్థితిలో నున్నది కావుననే యాత్రేయి యెక్కుడు నహాంతవ్యురాలని తోచుచున్నది. ఈయంశ మీక్రింది సూత్రమువలన స్ఫురించుచున్నది.

గర్భంచశేస్యావిజ్ఞాతం

(ఆ. ధ. 1—24—8)

(బ్రాహ్మణగర్భము స్త్రీ పున్నపుంనకభేదము స్పష్టము కాకుండ చంపబడినను బ్రహ్మహత్యాదోషమే వచ్చును.)

ఆగర్భము పురుషుడగుట కవకాశమున్నది కావున నా యవకాశము ననుసరించియే యాదోషమునకు ప్రాబల్యము వచ్చినది.

స్త్రీ పురుషుల కిట్టి భేదము చాలవిషయములలో నంగీకరింపబడినది. బ్రాహ్మణుని యుచ్ఛిష్టము దినవచ్చును గాని స్త్రీ యొక్కయు ననుపనీతుని యొక్కయు నుచ్ఛిష్టము తినరాదు.

స్త్రీణామనుపేతస్య చోచ్ఛిష్టం వర్జయేత్

(ఆ. ధ. 2–5–7)

స్మృతులలో స్త్రీలకు గౌరవ మంగీకరింపబడినదే కాని స్వాతంత్ర్య మంగీకరింపబడలేదు. ఎట్టి స్త్రీయు గూడ స్వాతంత్ర్యము పొందరాదని స్మృతులు చెప్పుచున్నవి. బాల్యమున తండ్రి చెప్పుచేతలలోను, యౌవనమున భర్త చెప్పుచేతలలోను, వార్ధకమున (భర్త మరణించినపుడు గాని వానప్రస్థుడైనపుడు గాని) కుమారుని చెప్పుచేతలలోను నుండవలెను.)

బాల్యేపితుర్వశేతిష్ఠేత్ పాణి గ్రాహస్యయౌవనే
పుత్రాణాం భర్తరిప్రేతేనభజేత్ స్త్రీస్వతంత్రతాం

(మను. 3–148)

కాన గృహకృత్యములలో గూడ స్త్రీలు స్వతంత్రలై యేపనియు చేయరాదు.

బాలయా వాయువత్యావావృద్ధయావాపియోషితా
నస్వాతంత్ర్యేణకర్తవ్యం కించిత్కార్యం గృహేష్వపి

(మను. 3–147)

(బాల కాని యువతి కాని వృద్ధ కాని గృహములో గూడ దేనిని స్వాతంత్ర్యముతో చేయరాదు.)

బాల్యమున తండ్రిని యౌవనమున భర్తను వార్ధకమున పుత్రులను వదలి యుండుటకు స్త్రీ యెన్నడును కోరరాదు. వారితో విరహము పొందు స్త్రీ రెండు కులములను గర్హ్యములనుగ జేయును.

పిత్రా భర్త్రా సుతైర్వాపి నేచ్ఛేద్విరహమాత్మనః
ఏషాం హి విరహేణ స్త్రీ గర్హ్యే కుర్యాదుభేకులే.

(మను. 3—149)

సత్కార్యములను జేయుటకు గూడ స్త్రీ భర్త యను మతిని పొందవలెను.

అపృష్ట్వాచైవ భర్తారం యానారీకురుతే వ్రతం
సర్వం తద్రాక్షసాన్గచ్ఛేదిత్యేవం మనురబ్రవీత్

(పరాశర. 4—18)

(భర్త నడుగకుండ స్త్రీ వ్రతముచేయునో నావ్రతము రాక్షసులను జెందునని మనువు చెప్పినాడు.)

కావుననే గౌతముడు

అస్వతంత్రా ధర్మే స్త్రీ. (గౌ. 18—1)

(ధర్మవిషయములో స్త్రీ యస్వతంత్రురాలు) అని చెప్పియున్నాడు.

వసిష్ఠు డిట్లు చెప్పుచున్నాడు.

అస్వతంత్రా స్త్రీ పురుషప్రధానా (వసిష్ఠ. 5—1)

(స్త్రీ యస్వతంత్రురాలు. పురుషుడు ప్రధానుడుగా గలది.)

భర్త యనుజ్ఞనిచ్చుటచే స్త్రీకి కొన్ని ముఖ్యములగు ధర్మకార్యములను జేయుట కర్హత గల్గుచున్నది. కుమారుని దానమిచ్చుటకు గాని దత్తత చేసికొనుటకు గాని స్వతస్సిద్ధ

ముగ స్త్రీ కధికారము లేదు. కాని భర్త యనుజ్ఞనిచ్చుచో నామె కాయధికారము గల్గును.

> నస్త్రీపుత్రం దద్యాత్ప్రతిగృహ్ణీయాద్వాన్య
> త్రానుజ్ఞానాద్భర్తుః (వసిష్ఠ. 15–5)

(భర్త యనుజ్ఞనిచ్చినచో కాని స్త్రీకి పుత్రుని దానము చేయుటకు గాని ప్రతిగ్రహణము చేయుటకు గాని యధికారము లేదు.)

మనుస్మృతి మున్నగు కొన్ని స్మృతులు తండ్రి కాని తల్లి కాని పుత్రుని దానము చేయవచ్చునని చెప్పుచున్నవే కాని యామె భర్త్రాజ్ఞను పొందుట మాట చెప్పుటలేదు.

> మాతాపితా వా దద్యాతాం యమద్భిః పుత్రమాపది
> సదృశం ప్రీతిసంయుక్తం సజ్ఞేయోదత్త్రిమః స్మృతః (మను. 9–168)

లౌకిక వ్యవహారములలో కూడ స్త్రీకి స్వాతంత్ర్యము లేదు. భర్త యనుమతిలేకుండ స్త్రీ న్యాయస్థానములో నభియోగము కూడ తేరాదు. అట్టి యభియోగములను న్యాయాధికారి విచారించి తీర్పు చెప్పినను నాతీర్పు చెల్లదు.

> స్త్రీనక్తమంతరాగారబహిశ్శత్రుకృతాం స్తథా (యాజ్ఞ. 2–31)

సాధారణముగ భర్త భార్యతో నాలోచించియే గృహకృత్యములను నిర్ణయింపవలెను గాని కేవలము నామెను

నిర్లక్ష్యము చేయరాదను నంశము పూర్వాధ్యాయములలో చూచియున్నాము. పిల్లలకు పేర్లను పెట్టుట మున్నగు నంశములలో గూడ నామె యభిప్రాయమును తీసికొనవలెను.

దశమ్యాముత్థితాయాగ్ స్నాతాయాం పుత్రస్య
నామదధాతి పితామాతేతి

(ఆ. గృ. 15–6–8)

(పదవనాడు స్నానమైన పిమ్మట తలిదండ్రులు పుత్రునకు పేరు పెట్టవలెను.)

భర్త చనిపోయి పుత్రులులేకుండినగాని ప్రాజ్ఞులు గాకుండిన గాని స్త్రీకి భర్తృపక్షమువారే ప్రభువులగుదురుగాని పితృపక్షమువారు కారు.

మృతేభర్తర్యపుత్రాయాః పతిపక్షః ప్రభుః స్త్రియాః
వినియోగాత్మరక్షాసు భరణేచస-ఈశ్వరః
పరిక్షీణేపతికులే నిర్మానుష్యేనిరాశ్రయే
తత్సపిండేషువాసత్సు పితృపక్షః ప్ర[illegible]స్త్రియాః

(నారద. 12–28,29)

(భర్తపోయిన యపుత్రకు [illegible]తిపక్షము వారే ప్రభువులు. నియోగము, ఆత్మరక్ష, పోషణయను విషయములలో వారే యామె కధికారులు. పతికులమంతయు నశించి నిర్మానుష్యము నిరాశ్రయము నైనచో పతియొక్క సపిండులు గాని తండ్రిపక్షమువారు గాని ప్రభువులగుదురు.)

భర్త జీవించియున్నంతకాలము భార్య యాతని కన్ని విధముల ననువర్తనగ నుండవలెనను నంశమును దాంపత్యమను నధ్యాయమున చూచియున్నాము. బాల్యములో తండ్రివిషయమున నొక సందర్భములో కుమార్తె స్వాతంత్ర్యమును వహింపవచ్చునను నంశము 'వివాహకాలము' 'వివాహవిధానము' అనునధ్యాయములలో చూచియుంటిమి. రజస్వలయైన మూడుమాసములలో గాని కొన్ని స్మృతుల ననుసరించి మూడుసంవత్సరములలోగాని తండ్రి కన్యను దానముచేయనిచో నామె స్వయముగ నెవరినైన వరించుకొనవచ్చునను నంశమును చూచియుంటిమి. అట్లే గాంధర్వవివాహములో నామెకు గల స్వాతంత్ర్యమును కూడ చూచియుంటిమి.

స్త్రీలకు స్వాతంత్ర్యము లేకుండుట యన వారికి గౌరవము లేకుండుట యని భావించుటకు వీలు లేదు. ఈలోకములో నందఱికంటె నెక్కుడు పూజ్యురాలు, నిహదైవతమునని చెప్పబడిన తల్లియే కుమారుని వశముననుండవలెనని స్మృతులు చెప్పుటచేతనే యీయంశము స్పష్టమగుచున్నది. అనగా వారిక్షేమము నాలోచించియే వారికి స్వాతంత్ర్యము నిషేధింపబడినదని తేలుచున్నది.

స్వాతంత్ర్యా ద్విప్రణశ్యనికులే జాతాఅపిస్త్రియః
అస్వాతంత్ర్యమతస్తా సాంప్రజాపతిరకల్పయత్

(నారద. 12—30)

(సత్కులమందు పుట్టిన స్త్రీలుకూడ స్వాతంత్ర్యము వలన నశింతురు. కాన బ్రహ్మ స్త్రీల కస్వాతంత్ర్యమును విధించెను.)

స్త్రీస్వాతంత్ర్యమును పొందకూడదను నిషేధధర్మమెంత బలీయమో పురుషుడామెకు స్వాతంత్ర్యము నీయ కూడదను విధికూడ నంత బలీయమైనదిగనే యున్నది.

అస్వతంత్రాః స్త్రియః కార్యాః పురుషైర్దివానిశాం

(మను 9—2)

(పురుషులు రేబవలు స్త్రీల నస్వతంత్రలనుగ జేయవలెను.)

అట్లు కాక స్త్రీలకు లొంగిపోవు పురుషులు మిక్కిలి గర్హింపబడినారు. పరాశరస్మృతి కలియుగములోని యధర్మాచరణమును వర్ణించుచు స్త్రీలకు పురుషులు లొంగిపోవుట యనుదానిని కూడ పేర్కొనినది,

జితాశ్చోరైశ్చ రాజానః స్త్రీభిశ్చ పురుషాః కలౌ.

(పరాశర. 1—30)

(కలియుగములో రాజులు చోరుల చేతను పురుషులు స్త్రీల చేతను జయింప బడుదురు)

స్త్రీచేత జయింపబడిన వానితో భుజింప కూడదని మనుస్మృతి చెప్పుచున్నది.

మృష్యంతి చోపపతిం స్త్రీజితానాంచసర్వశః

(మను 4—217)

(భార్య కుపపతి యుండుటను సహించువారితోను, స్త్రీలచేత జయింపబడిన వారితోను నెన్నడును భుజింపరాదు.)

స్త్రీ గౌరవార్హయే యైనను నామె యెల్లవుడును పురుషుని యధీనముననే యుండవలెనని యీ విధముగ తెలుచున్నది. సంగ్రహముగ చెప్పవలెనన్నచో స్త్రీని పురుషుడు సగౌరవముగ కాపాడవలెనని చెప్పవలెను. పాశ్చాత్యదేశములలో 'షివల్రీ' యని చెప్పబడునది స్మృతులలో గలదని పైన నీయబడిన యుదాహరణములవలన వ్యక్తమగుచున్నది. దీని యవధి యీ క్రింది శ్లోకములో గలదు.

స్త్రీవిప్రాభ్యుపపత్తౌచఘ్నన్ ధర్మేణనదుష్యతి,

(మను. 8—349)

(స్త్రీలను బ్రాహ్మణులను విపత్తునుండి తప్పించుటకై నెవరినైనను చంపినను దోషములేదు)

# స్మృతికాలపు స్త్రీలు

## దశమాధ్యాయము

### వృత్తి, విద్య

స్త్రీల వృత్తి మనుస్మృతిలో సంగ్రహముగ నిట్లు చెప్ప బడినది:

ప్రజనార్థం మహాభాగాః పూజార్హా గృహదీప్తయః
(మను. 9–26)

ఉత్పాదనమపత్యస్య జాతస్య పరిపాలనం
ప్రత్యహం లోకయాత్రాయాః ప్రత్యక్షం స్త్రీనిబంధనం
(మను. 9–27)

(స్త్రీలు సంతానముకొఱకు కున్నారు. సౌభాగ్యవంతు రాండ్రు గృహమునకు దీపములవంటివారు. పూజార్హులు. సంతానము కనుటయు, పోషించుటయు వారి కృత్యములు. ప్రతిదినము భర్త, యతిథి మున్నగువారి లోకయాత్రకు వారే కారణము)

స్త్రీకి సంతానము కనుట పెంచుట యంత ముఖ్యధర్మములు కావుననే సంతానములేని స్త్రీ యింట నన్నము తినరాదను నియమము మనుస్మృతిలో నున్నది.

అనపత్యాతు యానారీనాశ్నీయాత్తస్య హేపివై

స్త్రీకి పతిసేవయే గురుకులవాసము, గృహకృత్యములు చేసికొనుటయే యగ్నికార్యమునని యిదివఱలో సూచియుంటిమి. ఆమెకుగల నైపుణ్యమును, బుద్ధిని వినియోగించి గృహమును భూలోక స్వర్గము చేయుటయే యామెవిధి. ఆమె నిత్యము కలకలలాడుచు గృహము నంతయు ప్రకాశవంతముగ చేయవలెను. అట్లు చేయునపుడే స్త్రీలకు పైన వాడబడిన 'గృహాదీప్తయః' అను విశేషణము సార్థకమగును. చీకటి దుఃఖమునకు చిహ్నము. వెలుగు సుఖమునకు సంతోషమునకు చిహ్నము. కాన వెలుగుతెచ్చు దీపముతో పోల్చబడిన స్త్రీ యింటికి సంతోషమును గూర్చవలెను. తానసంతృప్తురాలై రోజుకొనుచునుండుచో నితరులకు సంతోషమును గలుగ జేయుటకు బదులు విచారమును గలుగజేయును. కాన నామె యెల్లపుడు సంతోషముతో నుండవలెను. మనుస్మృతి యీ యంశమును స్పష్టముగ చెప్పుచున్నది.

సదాప్రహృష్టయా భావ్యం గృహకార్యేషు దక్షయా

(మను. 5–150)

(గృహిణి యెల్లపుడు సంతోషించునదిగ నుండవలెను. గృహకృత్యముల జేయుటలో సమర్థురాలై యుండవలెను.)

ఎంత యోగ్యురాలైనను పనిచేత కానిదగుచో నింటిలోనివారిని సుఖపెట్టలేదు. కాన పనులలో నేర్పును సంపా

దించుట కూడ స్త్రీకి విధియే. శిశువులను శుభ్రముగ నుంచుటయు నెవరి కేమి కావలసినదియు కనిపెట్టి చూచుచుండుటయు నందఱకు భోజనములు పెట్టుటయు నింటిలోని వస్తువులను భద్రపఱచుటయు నామె కృత్యములు.

శౌచేధర్మేన్న పక్త్యాంచ పారిణాహ్యస్య వేక్షణే

(మను. 9—11)

అతిథులకును నింటిలోని యితరులకును పరిచారకులకును భోజనముపెట్టి తుదను గృహిణియు గృహస్థుడును భుజింపవలెను.

శేషం దమ్పతీ భుఞ్జీయాతాం

(వసిష్ఠ. 10—6)

అప్పుడైనను గృహస్థునకు బిమ్మటనే గృహిణి భుజింపవలెను. భార్యాభర్తలిరువురును గలసి భుజింపరాదు.

భార్యయాసహనాశ్నీ యాదవీర్యవదపత్యం
భవతీతివాజసనేయకే విజ్ఞాయతే

(వసిష్ఠ 10—31)

(భార్యతోకూడ భుజించుచో సంతతి వీర్యరహితమగును గాన నట్లు భుజింపరాదని వాజసనేయసంహిత చెప్పుచున్నది.)

అతిథి మున్నగువారికి భోజనమును బెట్టుటలో గూడ వారి వారి హెచ్చుతగ్గుల నాలోచించి ముందువెనుకల వారిని భుజింపజేయవలెను.

తతో౽తిథిం పూజయే చ్ఛ్రేయాం సంశ్రేయాం
సమానుపూర్వ్యేణ.

అత్తమామలకు స్త్రీ విశేష గౌరవము చూపుచుండ వలెను. వారు భర్తద్వారమున తనకు పూజ్యులగుచున్నారు. కాన వారిని పూజించుచో భర్త కూడ పూజితు డగును. భర్తకు నిరాదరణము చూపి వారిని పూజించుట ధర్మము కానేరదు.

కుర్యాచ్ఛ్వశురయోః పాదవందనం భర్తృతత్పరా.
(యాజ్ఞవల్క్య, 1-34)

(భర్తయందు పూర్ణభక్తికలదై యత్తమామలకు పాదాభివందనము చేయవలెను.)

గృహము నీవిధముగ చక్కబెట్టుకొనవలసిన గృహిణికి చేత కొంత ధన ముండుట యుగత్యము. కాన గృహస్థుడీమెను

(అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవనియోజయేత్)
(మను. 9-11)

ధనము దాచుటయందును వ్యయము చేయుటయందును నియోగింపవలెను.

ధనమును వ్యర్థముగ పాడుచేయక సక్రమమగు విధమున వ్యయము చేయుట స్త్రీకి ధర్మము.

వ్యయే చాముక్తహస్తయా
(మను. 5-150)

(స్త్రీకి వ్యాయమందు చేయి వదలుగా నుండరాదు)

భర్త ప్రవాసమున కేగునపుడు తిరిగివచ్చువఱకు గృహ నిర్వహాణమునకు వలయు ధనమును భార్య కిచ్చి పోగవలెనని పూర్వాధ్యాయమున చూచియుంటిమి. భర్త యట్లు ధనము నిచ్చి పోనిచో గృహిణి నింద్యములు కాని నూలు వడకుట మున్నగు శిల్పములతో ధనసంపాదనము చేసికొనవలెను.

ప్రోషితేత్వ నిర్దామైవ జీవేచ్ఛిల్పైరగర్హితైః

(మను. 9–75)

భర్త ప్రవాసమున కేగినపుడే కాక యాతఁ డింటనున్న పుడు కూడ ధనార్జనమున కర్హలగు స్త్రీలు (గొల్ల మున్నగు జాతులవారు) కొందఱు గలరని 'ధన' మను నధ్యాయమున చూచియుంటిమి. రాజాస్థానములు మున్నగుచోట్ల స్త్రీ సేవకు రాం డ్రుండుట కాననగుచున్నది. వారు తమ యధికారికి విసరుట, నీరిచ్చుట, ధూపము వేయుట మున్నగు పనులు చేయుచుండెడివారు. రాజున కీ పనులను చేయు స్త్రీలు రాజునకు ద్రోహము చేయకుండునట్లు పరీక్షింపవలెనని మనుస్మృతి చెప్పుచున్నది.

పరీక్షితాః స్త్రియశ్చైనం వ్యజనోదక ధూపనైః

(మను. 7–219)

స్త్రీలయం దిట్టి యవిశ్వాసము మనుస్మృతిలో చాల చోట్ల కాననగుచున్నది. కావుననే వారు బాహ్యప్రపంచములో చాల పనుల కనర్హలని కూడ తెలుచున్నది.

స్త్రీ మ్లేచ్ఛవ్యాధితవ్యం గాన్మంత్రకాలేప సారయేత్
భిందంత్యవమతామంత్రం తైర్యగ్యోనా స్తథైవచ
స్త్రియశ్చైవ విశేషేణ తస్మాత్తత్రాదృతో భవేత్.
(మను. 7—149, 150)

(రాజితరులతో రాజకీయముల నాలోచించునపుడు స్త్రీలను, మ్లేచ్ఛులను, రోగులను, వికలాంగులను బయటకు పారద్రోలవలెను. ఏలన: వీరవమానితులై యా యాలోచనలు బయట పెట్టెదరు. ముఖ్యముగ స్త్రీలను, తిర్యగ్యోనులను బయటకు పంపివేయుటలో శ్రద్ధ బూనవలెను.)

స్త్రీలకిట్టి నైతిక స్థైర్యము లేకపోవుటచేతనే వారు న్యాయస్థానములలో సాక్షులుగ నుండుటకుగూడ నర్హులుగారు.

ఏకోలుబ్ధస్తు సాక్షీస్యాద్బహ్వ్యశ్శుచ్యోపి నస్త్రియః
స్త్రీబుద్ధే రస్థిరత్వాత్తుదో షైశ్చాన్యేపియేవృతాః
(మను. 8—77)

(శుద్ధవర్తనముగల యనేక స్త్రీలకంటె లుబ్ధుడైన యొకపురుషుడైనను సాక్షిగనుండుట కెక్కుడుగ నర్హుడు. స్త్రీలబుద్ధి యస్థిరమైనదగుటచే వారును దోషయుక్తులగు పురుషులును సాక్ష్యమున కనర్హులు)

స్త్రీ లనృత స్వరూపిణులని కూడ చెప్పబడినది.

స్త్రియోనృతమితిస్థితిః (మను. 9—17)

ద్రోహభావం కుచర్యాం చ స్త్రీభ్యో మనురకల్పయత్

(మను: 9—17)

(ద్రోహభావమును, చెడ్డపనులను మనువు స్త్రీలకొఱకు కల్పించెను.)

కాని స్త్రీల విషయములో మాత్రము స్త్రీలే సాక్షులుగ నుండవలెను.

స్త్రీణాం సాక్షిణః స్త్రియః

(యాజ్ఞ 2—30)

స్త్రీలు గృహమును కనిపెట్టుకొని యుండవలసిన వారగుటచే వారిని న్యాయస్థానములకు త్రిప్పుటవలన నష్టముండునను నూహ కూడ వారు సాక్షులుగ నుండుటకు తగరని చెప్పుట కొక కారణమై యుండవచ్చును. స్త్రీల యభియోగములను న్యాయాధికారి త్వరలో పరిష్కరింప వలెననుటకు కూడ నిదియే కారణము కావచ్చును.

ధేన్వనడుత్ స్త్రీ ప్రజనన సంయుక్తేన

(గౌ. 13—29)

(ఆవులు, ఎద్దులు, స్త్రీలు, పిల్లలు—వీరితో కూడిన యభియోగములను త్వరలో పరిష్కరింపవలెను.)

బాహ్యప్రపంచముతో కొంచెము సంబంధ మున్నను మొత్తముమీద స్త్రీకి గృహమే ముఖ్యస్థానమనుట స్పష్టము. బాహ్యప్రపంచములోని కెన్నడును రాక కేవలము గృహము

లోపలనే యుండు స్త్రీలు కొంద ఱుండిరి. అట్టివారు ముఖ్యముగ ధనికులై యుందురు. అంతఃపురముల ప్రశంసస్మృతులలో కొన్నిచోట్ల వచ్చును.

అంతఃపురప్రచారం చ (మను. 7—153)

(రాజు చారులవలన నంతఃపురములోని యంశములను కూడ తెలిసికొనవలెను.)

పైన వివరింపబడినట్లు స్త్రీలు గృహముకొఱకే పుట్టి యుండుటచేతను బాహ్య ప్రపంచములో పనిచేయుటకు వారనర్హులు కావునను సమస్త విషయములలోను వారు భర్తనను సరింపవలసినవారే యగుటచేతను వారికి విద్య యక్కరలేదనియే స్మృతికారు లభిప్రాయపడిరి. బాలునకు వేదము చదువుటయను విధియుండగా బాలిక కట్టివిధి లేకపోవుటయే కాక యామెకు భర్తృశుశ్రూషయే గురుకుల వాసము గృహకృత్యమే యగ్నికార్యమునని చెప్పబడినట్లు చూచియున్నాము. వారికి సక్రమమైన విద్య లేదేకాని విజ్ఞానము లేకపోలేదు. పారంపర్యముగ వచ్చుచుండు ననేకాచారములును ధర్మములును, పురుషులెఱుగని వానిని కూడ, స్త్రీ లెఱుగుదురని యాపస్తంబుడు చెప్పుచున్నాడు. ఆతడు ధర్మములను చెప్పి చెప్పి తుదకా ధర్మశాస్త్రము పూర్ణముకాదనియు స్త్రీల యందును శూద్రుల యందును కొంత విద్య యున్నదనియు నుడివినాడు.

సానిష్ఠా విద్యాస్త్రీ షుశూద్రేషుచ

(ఆ. ధ. సూ. 2—29—11)

ఆవిద్య యాధర్వణ వేదముయొక్క శేషమని చెప్పుదురట.

ఆథర్వణస్య వేదస్య శేషఇత్యుపదిశంతి

(ఆ. ధ. సూ. 2—29—11)

కావున

(స్త్రీభ్యస్సర్వవర్ణేభ్యశ్చ ధర్మశేషాన్ ప్రతీయా
దిత్యేక ఇత్యేవే

(ఆ. ధ. సూ. 2—29—15)

సమస్తవర్ణ స్త్రీలనుండియు మిగిలిన ధర్మములను తెలిసికొనవలెనని కొందఱు చెప్పుచున్నారు.

కొన్ని కర్మలను కూడ స్త్రీలనుండి తెలిసికొనవలెను. ఆపస్తంబుడు గృహ్యసూత్రములో వివాహ సంస్కారమును వర్ణించుచు తాను చెప్పుదానినే కాక స్త్రీలుచెప్పు మఱికొన్నిటిని గూడ చేయవలెనని యాదేశించుచున్నాడు.

ఆవృతశ్చాస్త్రీభ్యః ప్రతీయేరన్

(ఆ. గృ. సూ. 1—2—15)

(వివాహసంబంధములైన కర్మలను స్త్రీలనుండి తెలిసికొని చేయవలెను.)

ఇచట 'కర్మ'లనగా గృహ్యసూత్రములో చెప్పబడని యంకురారోపణము మున్నగు సమంత్రక కర్మలును, నాకబలి

మున్నగు నమంత్రక కర్మలును నని వ్యాఖ్యాతలు చెప్పు చున్నారు.

భార్య మున్నగువారు మరణించునపుడు చేయవలసిన కర్మకలాపమును వివరించుచు నాపస్తంబు డిట్లు చెప్పు చున్నాడు.

తత్ర్సత్యయముదక ముత్సిచ్యాప్రతీక్షా గ్రామ
మేత్యయత్ స్త్రియ ఆహుస్తత్కుర్వన్తి
(ఆ. ధ. 2–15–19)

(ఈ యుదకము తమకే విడువబడినదని నమ్మకము గల్గు విధమున నుదకదానము చేసి వెనుకకు చూడకుండ గ్రామములోనికి వచ్చి స్త్రీ లేదిచెప్పిన దానిని చేయవలెను.)

ప్రస్తుత మలభ్యములై యున్న శ్రుతిస్మృతులలోని ధర్మములను కొన్నిటిని స్త్రీసంఘ ముపదేశింపగలదని యీ విధముగ తేలుచున్నది. ఇంతేకాక శ్రుతిస్మృతులలో స్త్రీల కొఱకై చెప్పబడిన ధర్మములనైనను వా రెఱిగియుండవలెను. కాన పురుషులవలె కాకపోయినను స్త్రీలేదో యొక విధమున విద్య నార్జించుచుండెడివారని చెప్పవలసి యున్నది.

స్మృతులలో స్త్రీల కళాశిల్పవిషయిక ప్రవేశ మొకింత గోచరించుచున్నది. నృత్యగానములలో స్త్రీలకు ప్రవేశముం డెననియు వారిలో కొందఱీ నృత్యగానములను పురుషులతో గలసి చేసెడివారనియు నూహించుటకు మనుస్మృతిలోని

రజస్వలతో నృత్యగానములను సలుపరాదను నిషేధమే యాధారముగ నున్నది.

నన్నృత్యేదధవాగాయయేత్ (మను. 3—64)

స్త్రీల ప్రకృతిపట్ల స్మృతికారులకు గల యభిప్రాయముల ననుసరించియే స్త్రీల వృత్తులను వారు నిర్ణయించినట్లు కన్పట్టును.

శయ్యాసన మలంకారం కామంక్రోధమనార్జవం (మను. 9—17)

(శయ్య, ఆసనము, అలంకారము, కామము, క్రోధము, వక్రవర్తనము.)

ఇవి స్త్రీలకుగల కొన్ని ముఖ్యలక్షణములుగ చెప్పబడినవి. కావుననే వారికి లోకములోని యున్నతకార్యములతో నేమియు సంబంధము కల్పింపబడక గృహనిర్వహణధర్మమే విధింపబడినది. అదియైనను పురుషుని యాధిపత్యమునకు లోనయియే యున్నది.

# స్మృతికాలపుస్త్రీలు

## ఏకాదశాధ్యాయము

### వివిధ విషయములు

#### వ్యభిచారము.

వ్యభిచరింపకుండుట కంటెను నుత్కృష్టమగు ధర్మము స్త్రీ పురుషులకు లేదు.

అన్యోన్యస్యావ్యభీచారో భవే దామరణాంతికః
ఏషధర్మస్సమాసేన జ్ఞేయః స్త్రీపుంసయోః పరః

(మను 9—101)

(భార్యాభర్తలు జీవితకాలములో నొకరినుండి యొకరు వ్యభిచరింపరాదు. మొత్తముమీద స్త్రీ పురుషుల కింతకంటెను గొప్ప ధర్మములేదు.)

అత్యంతము వ్యభిచరించు నగర్భిణియగు స్త్రీని ఱాయి కట్టి నీటిలో దింపవలెనని యాజ్ఞవల్క్యస్మృతి చెప్పుచున్నది.

విప్రదుష్టాంస్త్రియం భ్రూణపురుషఘ్నీమగర్భిణీం
సేతుభేదకరీం చాప్సుశిలాం బధ్వాప్రవేశయేత్

(యాజ్ఞ 2—276)

గురుభార్యను పొందిన పురుషునకు గూడ మరణమే ప్రాయశ్చిత్తము.

సూర్మీం జ్వలంతీం వాశ్లిష్యేన్మృత్యునా స విశుద్ధ్యతి
(మను 11–89)

(గురు భార్యను పొందినవాడు కాలుచున్న స్తంభము నాలింగనము చేసికొనవలెను. వాడు మరణమువలన శుద్ధుడగును.)

బంధుత్వము దగ్గఱయిన కొలదియు వ్యభిచారమునకు దోషమెక్కువగ చెప్పబడినది.

రేతస్సేకః స్వయోనీషు కుమారీష్వంత్యజాసుచ
సఖ్యుఃపుత్రస్యచస్త్రీషు గురుతల్ప సమంవిదుః
(మను 11–58)

(సోదరి, చండాలి, మిత్రుని భార్య, కోడలు—వీరితో వ్యభిచరించుట గురుపత్నీ గమనతుల్యము.)

నీచపు పురుషుని పొందుట స్త్రీ కత్యంతము పతన హేతువు.

నీచాభిగమనం గర్భపాతనం భర్తృహింసనం
విశేషపతనీయాని స్త్రీణామేతాన్యపిధ్రువం
(యాజ్ఞ 2–299)

వ్యభిచార మాత్రముననే స్త్రీ నింద్యురాలగుచున్నది.

వ్యభిచారాత్తుభర్తుః స్త్రీలోకే ప్రాప్నోతినింద్యతాం.
సృగాలయోనించాప్నోతి పాపరోగైశ్చపీడ్యతే
(మను. 9–30)

'స్త్రీ వ్యభిచారమువలన నీ లోకములో నింద్యురాల గును. ఉత్తరజన్మమున నక్కయగును. మఱియు పాపరోగ ములచే పీడింపబడును'

వ్యభిచారమువలన గల్గిన సంతానము కూడ నింద్యమే యగుచున్నది. అనింద్యములగు వివాహముల వలన జనించిన వారే వంశము నిలబెట్టు పుత్రులని 'వివాహవిధాన' మను నధ్యాయమున చూచియుంటిమి. ఔరసులుకాని పుత్రులకు తండ్రి యాస్తిలో భాగమురాదు కాని వారికి భరణ మీయ వలెను.

ఏక ఏవౌరసః పుత్రః పిత్ర్యస్యవసునః ప్రభుః
శేషాణామానృశం స్యార్థం ప్రదద్యాత్తుప్రజీవనం.

(మను. 9—163)

వ్యభిచారమువలన గలిగిన పుత్రులు గూఢజుడు, కానీ నుడు, సహోఢుడు, పౌనర్భవుడునని యయిదువిధములుగ నున్నారు.

ఉత్పద్యతేగృహేయస్య నచజ్ఞాయేతకస్యసః
సగృహేగూఢ ఉత్పన్న స్తస్యస్యాద్యస్యతల్పజః

(మను 9—170)

(ఎవనికి జనించినాడో తెలియని పుత్రుడెవని యింట పుట్టుచున్నాడో యాతని పుత్రుడా తల్లికి భర్తయగువాని గూఢజపుత్రుడని చెప్పబడుచున్నాడు)

పితృవేశ్మని కన్యాతుయం పుత్రంజనయేద్రహః
తంకానీనం వదేన్నామ్నా వోఢుః కన్యాసముద్భవం
(మను. 9—172)

(కన్యను తండ్రియింట పుట్టిన పుత్రుడామెను వివాహ మాడినవాని కానీన పుత్రుడని చెప్పబడుచున్నాడు.)

యాగర్భిణీసంస్క్రియతే జ్ఞాతాఽజ్ఞాతాపివాసతీ
వోఢుస్సగర్భోభవతి సహోఢ ఇతిచోచ్యతే.
(మను. 9—173)

(గర్భిణిగా నున్నదానిని వివాహమాడువాని కాగర్భిణికి పుట్టినవాడు సహోఢుడను పుత్రుడగును.)

యాపత్యావా పరిత్యక్తా విధవావాస్వయేచ్ఛయా
ఉత్పాదయేత్పునర్భూత్వా సపౌనర్భవ ఉచ్యతే.
(మను. 9—175)

(పతిపరిత్యక్తగాని వితంతువుగాని మఱొకని పొంది కనిన పుత్రుడు పౌనర్భవుడు.)

ఇట్టిపుత్రులవలన పరలోకమున నేమియు లాభముండ దని మనువు చెప్పుచున్నాడు.

యాదృశం ఫలమాప్నోతికుప్లవైస్సంతరన్ జలం
తాదృశం ఫలమాప్నోతి కుపుత్రైస్సంతరంస్తమః
(మను. 9—161)

(సముద్రమును పనికిమాలిన దోనెతో దాటయత్నించుటవలన నెట్టిఫలముండునో పైన పేర్కొనబడిన కుపుత్రుల

వలన పరలోక తమస్సును దాటయత్నించుటవలన నట్టిఫల ముండును.)

స్వవీర్యమువలన జనింపని పుత్రుడిచ్చిన తిలోదకాదులు గూడ పురుషునకు ముట్టవనియు వా డెవనివీర్యమునకు జనించెనో వానికే యవి ముట్టుననియు నాపస్తంబుడు చెప్పుచున్నాడు.

రేతోధాః పుత్రంనయతిపరేత్యయమసానే
తస్మాద్భార్యాంగ్ రక్షంతిబిభ్యన్తిపరరేతసః

(ఆ. ధ. సూ. 7—28—20)

(రేతస్సు నుంచినవాడు చనిపోయి యమలోకములో పుత్రునివలన లాభము నొందుచున్నాడు. కాన పరరేతస్సు నుండి భయపడి భార్యను రక్షించుకొందురు.)

వ్యభిచారమువలన గల్గిన కుమారుడు లౌకికవిషయములలో మాత్రము వ్యభిచరించిన పురుషునకు గాక యాస్త్రీ యొక్క భర్తకే చెందునని పైయంశములవలన తెలియుచున్నది. మనుస్మృతి మఱొకచోట నీయంశము నిట్లు స్పష్టపఱచుచున్నది.

యదన్యగోషువృషభో వత్సానాంజన యేచ్ఛతం
గోమినామేవ తేవత్సామోఘం స్కందితమార్షభం
తథైవాక్షేత్రిణోబీజం పరక్షేత్రప్రవాపినః
కుర్వంతిక్షేత్రిణామర్థం నబీజీ లభతేఫలం.

(మను. 9—51

(ఎద్దు గోవులకు నూరుదూడలను పుట్టించినను నాదూడలు గోవులు కలవానివే యగును. వృషభము వ్యర్థముగనే రేతస్సును విడచినది. అట్లే పరక్షేత్రములో బీజము వేయువానికా ఫలము రాదు. ఆ ఫలము క్షేత్రముగల వానికే పోవును.)

వ్యభిచారము వలన జనించినవారు పైన వివరించబడిన యర్థములోనే పుత్రులగుచున్నారు. కాని మఱొకయర్థమున కాదు. వ్యభిచారమువలన స్వచ్ఛమైన సంతానము గలుగదని స్పష్టమగుచున్నది. వ్యభిచారమువలన వర్ణసంకరము కూడ నగును.

తత్సముత్థోహిలోకస్య జాయతే వర్ణసంకరః

(మను. 8—353)

వ్యభిచారమువలన వ్యభిచరించిన వారికంటె నావ్యభిచారమువలన గల్గిన సంతానమే యెక్కుడు పాపభూయిష్ఠమని స్మృతుల యభిప్రాయము. కనుకనే వ్యభిచరించినంత మాత్రమున స్త్రీని వదలివేయనక్కరలేదనియు పరునివలన గర్భము గల్గుచో నామెను వదలివేయవలెననియు చెప్పబడినది.

వ్యభిచారాదృతౌ శుద్ధిర్గర్భే త్యాగో విధీయతే

(యాజ్ఞ. 1–72)

(వ్యభిచారము చేసిన స్త్రీకి ఋతుస్రావముతో శుద్ధియగును. గర్భము గల్గుచో నామెను వదలివేయవలెను.)

ఒకసారి వ్యభిచరించిన దిక నెన్నిసారులైనను వ్యభిచరించునుగాన సకృద్వ్యభిచారిణిని గూడ వదలివేయవలెనని పరాశరునిమతము.

బ్రాహ్మణీతుయదాగచ్ఛేత్పరం పుంసావివర్జితా
గత్వాపుంసశ్శతం యాతిత్యజేయుస్తాంతుగోత్రిణః

(9—35)

ఈ రజస్స్రావము చేత శుద్ధియగునది మానసికవ్యభిచారమే కాని కాయికవ్యభిచారము కాదని కొన్ని స్మృతుల యభిప్రాయము.

రజసాస్త్రీ మనోదుష్టాసన్యాసేన ద్విజోత్తమః

(మను. 4—108)

(మానసిక వ్యభిచారము చేసిన స్త్రీ రజస్సుచేతను ద్విజుడు సన్యాసము చేతను పరిశుద్ధులగుదురు)

తల్లి మానసికవ్యభిచారమునకై కుమారునికి ప్రాయశ్చిత్తమున కక్కరకువచ్చు మంత్రము మనుస్మృతిలో చూపబడినది. ఈమంత్రమును బట్టి స్త్రీలు స్వభావముచే వ్యభిచారిణులని మనుస్మృతి చెప్పుచున్నది.

యన్మేమాతాప్రలులుభే విచరంత్యపతివ్రతా
తన్మేరేతః పితావృఙ్క్తామిత్యస్యైతన్నిదర్శనం

(మను. 9—20)

('నాతల్లి యపతివ్రతయై మానసికముగ వ్యభిచరించి రజస్సున పరిశుద్ధము చేసికొనెననున దేదికలదో దానిని

నాతండ్రి బాగుచేయును గాక' యను మంత్రము స్త్రీలు మానసికముగ వ్యభిచరించువా రనుకొనుట కొక నిదర్శనము.)

ధ్యాయత్యనిష్టం యత్కించిత్పాణిగ్రాహస్యచేతసా
తస్యైషవ్యభిచారస్య నిహ్నవస్సమ్యగుచ్యతే

(మను. 9—21)

(స్త్రీ భర్తకేదైన యనిష్టము తలబెట్టుచో నావ్యభిచారమున కీ మంత్రము ప్రాయశ్చిత్తముగ చెప్పబడినది.)

ఇక స్త్రీలు స్వభావముచేత వ్యభిచారిణులను మను వాక్యమును చూతము.

నైతారూపం పరీక్షన్తేనాసాం వయసిసంస్థితిః
సురూపం వావిరూపం వాపుమానిత్యేవభుంజతే

(మను. 9—14)

(ఈ స్త్రీలు రూపము చూడరు. వయస్సు విషయమై వీరికి పట్టుదల లేదు. సురూపుడైనను సరియే కురూపుడైనను సరియే పురుషుడైనంత మాత్రమున వీ రనుభవింతురు)

పౌంశ్చల్యాచ్చలచిత్తాచ్చనైస్నేహాచ్చస్వభావతః
రక్షితాయత్నతోపీహభర్తృష్వేతావికుర్వతే

(మను. 9—15)

(స్త్రీలు పురుషుని చూడగనే చలించు స్వభావముగలవారు గావునను స్నేహాభావము లేనివారు గావునను, మనస్సు నిలకడ లేనివారు గావునను వారి నెంతగరక్షించినను నింకను భర్తపట్ల తిన్నగ ప్రవర్తింపకుండగనే యుందురు.)

స్త్రీల స్వభావమిట్టిది కావునను పురుషులకు కూడ నింద్రియజయము దుర్లభము కావునను స్త్రీపురుషులకు సంబంధము లేకుండ చేయవలెనని మనుస్మృతి యభిప్రాయము.

ఏవంస్వభావం జ్ఞాత్వాసాం ప్రజాపతినిసర్గజం
పరమం యత్నమాతిష్ఠేత్ పురుషోరక్షణంప్రతి
(మను. 9—16)

(బ్రహ్మ కల్పించిన స్త్రీ స్వభావమును గ్రహించి పురుషుడు స్త్రీని రక్షించుటకు గొప్ప ప్రయత్నము చేయవలెను.)

మాత్రాస్వస్రాదుహిత్రావాన వివిక్తాసనో భవేత్
బలవానింద్రియగ్రామో విద్వాంసమపికర్షతి
(మను. 2—215)

(తల్లితోను, సోదరితోను, కుమార్తెలతోను కూడ నేకాంతప్రదేశమున నుండరాదు. బలవంతమగు నింద్రియ సమూహము విద్వాంసుని గూడ నాకర్షించును.)

భార్య చెడిపోవుటచే భర్తయొక్క యిహపరసుఖ మంతయు నశించుచున్నది కావున నెట్టివాడయినను భార్యను రక్షించుకొనక తప్పదు. భార్యతోనే యిహపరసుఖ మున్నదను నంశము దాంపత్యమను నధ్యాయమున వివరింపబడినది.

సూక్ష్మేభ్యోపి ప్రసంగేభ్యః స్త్రియోరక్ష్యా విశేషతః
ద్వయోర్హి కులయోశ్శోకమావహే యురరక్షితాః
ఇమం హి సర్వవర్ణానాం పశ్యన్తో ధర్మముత్తమం

యతంతే రక్షితుం భార్యాం భర్తారోదుర్బలా అపి
స్వాం ప్రసూతిం చరిత్రం చకులమాత్మాన మేవచ
స్వం చ ధర్మం ప్రయత్నేన జాయాం రక్షన్ హిరక్షతి.

(మను. 9—5, 6, 7)

(స్వల్పములైన దుస్సంపర్కములనుండి కూడ స్త్రీలను విశేషముగ కాపాడవలెను. అట్లు కానిచో వా రుభయకులములకును దుఃఖమును తెచ్చిపెట్టెదరు. ఈ సర్వవర్ణసామాన్యమగు గొప్ప ధర్మము నాలోచించి దుర్బలులైన భర్తలుకూడ భార్యలను రక్షించుకొనుటకు యత్నించుచున్నారు. భార్యను పాపమునుండి రక్షించుచో సంతతిని, కులమును, తనను, తన ధర్మమును రక్షించుకొనినవాడే యగుచున్నాడు.)

పురుషుడు తానే పుత్రరూపమున జనించును గావున భార్య దుష్టురాలగుచో తా నా దుష్టక్షేత్రములో నుద్భవించుటచే తాను గూడ దుష్టుడే యగును. కాన భార్య నీతిని రక్షించుకొనవలెను. అంతేకాక పరుని బీజము భార్యయందు పడి ఫలించుచో తనను తన వంశమును గూడ చెడగొట్టుకొనువా డగుచున్నాడు.

పతిర్భార్యాం సంప్రవిశ్య గర్భో భూత్వేహ జాయతే
జాయా యాస్తద్ధిజాయాత్వం యదస్యాం జాయతే పునః

(మను. 9—8)

(భర్త భార్యలో ప్రవేశించి గర్భమై పుట్టుచున్నాడు కాన భార్యకు 'జాయ' యను పేరు గల్గుచున్నది.)

నిరంతరము బలాత్కారముగ స్త్రీలను కాపాడుట యసంభవమని మను నెఱుగును. వారి కేవో కొన్ని వ్యాపారములు కల్పించినచో కొంత రక్షణ యగునని యాతని తలంపు.

నకశ్చిద్యోషితశ్శక్తః ప్రసహ్య పరిరక్షితుం
ఏతైరుపాయ యోగైస్తు శక్యాస్తాః పరిరక్షితుం
అర్థస్య సంగ్రహేచైనాం వ్యయే చైవనియోజయేత్
శౌచేధర్మేఽన్నపంక్త్యాంచ పారిణహ్యస్యవేక్షణే
అరక్షితా గృహేరుద్ధాః పురుషైరాప్తకారిభిః
ఆత్మానమాత్మనాయాస్తు రక్షేయుస్తాస్సు రక్షితాః

(మను. 9—10, 11, 12)

(ఎవడును స్త్రీని బలవంతముగ రక్షింపజాలడు. ఈయుపాయములచే వారిని రక్షింపవచ్చును. ధనము గాపాడుట, వ్యయముచేయుట, గృహపారిశుద్ధ్యము గాపాడుట, ధర్మముల జేయుట, భోజనవిషయము చూచుట, గృహోపకరణములు కాపాడుట—అను వానిలో నామెను నియోగింపవలెను. పురుషులచే గృహములో నిర్బంధింపబడినవారు రక్షింపబడని వారే. ఎవరు తమ్ముతామే కాపాడుకొనుచున్నారో వారే బాగుగ రక్షింపబడిన వారగుచున్నారు.)

ఆత్మరక్షణమే శ్రేష్ఠమని మను విట్లు చెప్పుచున్నను పురుషు డామెను గాపాడుటలోని యావశ్యకమును గూడ గుర్తించుచున్నాడు. భర్త భార్యను విడచియుండుటయే

యాపెం చెడిపోవుట లోక హేతువనియు కాన సాధారణముగ భార్యాభర్త లొండొరులను విడరాదనియు నాతఁడు చెప్పు చున్నాఁడు.

తథా నిత్యం యతేయాతాం స్త్రీపుంసౌ తు కృతక్రియౌ
యథా నాభిచరేతాం తౌ వియుక్తావితరేతరం

(మను. 9—102)

(స్త్రీపురుషు లెల్లప్పుడును కలిసియుండి వారి కృత్యము లను చేసికొనుచుండవలెను. ఒకరినుండి యొకరు వియోగము చెంది వ్యభిచరింపకుండునట్లు కూడ యత్నించవలెను.)

భర్తను విడచి యుండుటయు పొరుగిండ్ల వసించుటయు ముఖ్యముగ స్త్రీని పాడుచేయును.

పానం దుర్జనసంసర్గః పత్యా చ విరహోఽటనం
స్వప్నోఽన్యగేహవాసశ్చ నారీసందూషణాని షట్

(మను. 9—13)

(మద్యపానము, దుర్జన సహవాసము, భర్తను విడచి యుండుట, తిరుగుచుండుట, అతి నిద్ర, యితరుని యింట నుండుట—ఈ యాఱును స్త్రీని పాడుచేయును.)

ఏదైన కార్యములపై భర్త దేశాంతరమున నివసింప వలసి వచ్చినచో భార్యకు తాను తిరిగి వచ్చువఱకు సన్న వస్త్రాదులకు లోటు లేకుండునట్లు చేసి పోవలెను. ఏమన: స్వతస్సిద్ధముగ మంచి స్త్రీయైనను కూడ సన్నవస్త్రములు లేనపుడు ధనమునకై పరపురుషుని పొందును.

విధాయవృత్తిం భార్యాయాః ప్రవసేత్కార్యవాన్నరః
అవృత్తికర్శితాహి స్త్రీప్రదుష్యేత్ స్థితిమత్యపి
(మను. 9—74)

భార్యను కాపాడుకొనుటకై భర్త యామెతో మా
ట్లాడకుండుటకై యితరపురుషుల నాజ్ఞాపింపవచ్చును. భర్త
చేత నిషేధింపబడినను గూడ నెవడాతని భార్యతో మాట్లా
డునో వానిని రాజు దండింపవలెను.

నసంభాషాం పరస్త్రీభిః ప్రతిషిద్ధస్సమాచరేత్
నిషిద్ధోభాషమాణస్తు సువర్ణం దండమర్హతి
(మను. 8—361)

(నిషిద్ధుడై పరస్త్రీతో మాట్లాడరాదు. అట్లు మాట్లా
డుచో సువర్ణదండమున కర్హుడు.)

భార్య మానమును విక్రయించి జీవించువారి భార్యల
తోను చెడిపోయిన స్త్రీలతోను నిషిద్ధులై మాట్లాడిన వారికి
స్వల్పముగ మాత్రమే దండనముండును.

నైషచారణదారేషు విధిర్నాత్మోపజీవిషు
సజ్జంతి హి తేనారీర్నిగూఢాశ్చారయన్తిచ
కించిదేవతు దాప్యస్స్యాత్సం భాషాం తాభిరాచరన్
ప్రైష్యాసు చైకభక్తాసురహః ప్రవ్రజితాసుచ
(మను. 8—362—363)

యామె చెడిపోవుటకొక హేతువనియు కాన సాధారణముగ భార్యాభర్తలొండొరులను వీడరాదనియు నాతడు చెప్పు చున్నాడు.

తథానిత్యం యతేయాతాం స్త్రీపుంసౌతుకృతక్రియౌ
యథానాభిచరేతాంతౌ వియుక్తావితరేతరం

(మను. 9—102)

(స్త్రీపురుషు లెల్లపుడును కలసియుండి వారి కృత్యములను చేసికొనుచుండవలెను. ఒకరినుండి యొకరు వియోగము చెంది వ్యభిచరింపకుండునట్లు కూడ యత్నింపవలెను.)

భర్తను విడచి యుండుటయు పొరుగిండ్ల వసించుటయు ముఖ్యముగ స్త్రీని పాడుచేయును.

పానం దుర్జనసంసర్గః పత్యాచవిరహోటనం
స్వప్నోన్యగేహవాసశ్చ నారీసందోషణానిషట్

(మను. 9—13)

(మద్యపానము, దుర్జన సహవాసము, భర్తను విడచి యుండుట, తిరుగుచుండుట, అతి నిద్ర, యితరుని యింట నుండుట—ఈ యారును స్త్రీని పాడుచేయును.)

ఏదైన కార్యములపై భర్త యెచటికైనను ప్రవసింపవలసి వచ్చినచో భార్యకు తాను తిరిగి వచ్చువఱకు నన్న వస్త్రాదులకు లోటు లేకుండునట్లు చేసి పోవలెను. ఏమన: స్వతస్సిద్ధముగ మంచి స్త్రీయైనను గూడ నన్నవస్త్రములు లేనపుడు ధనమునకై పరపురుషుని పొందును.

విధాయవృత్తిం భార్యాయాః ప్రవసేత్కార్యవాన్నరః
అవృత్తికర్శితాహి స్త్రీప్రదుష్యేత్ స్థితిమత్యపి
(మను. 9—74)

భార్యను కాపాడుకొనుటకై భర్త యామెతో మాట్లాడకుండుటకై యితరపురుషుల నాజ్ఞాపింపవచ్చును. భర్త చేత నిషేధింపబడినను గూడ నెవడాతని భార్యతో మాట్లాడునో వానిని రాజు దండింపవవలెను.

నసంభాషాం పరస్త్రీభిః ప్రతిషిద్ధస్సమాచరేత్
నిషిద్ధోభాషమాణాస్తు సువర్ణం దండమర్హతి
(మను. 8—361)

(నిషిద్ధుడై పరస్త్రీతో మాట్లాడరాదు. అట్లు మాట్లాడుచో సువర్ణదండమున కర్హుడు.)

భార్య మానమును విక్రయించి జీవించువారి భార్యలతోను చెడిపోయిన స్త్రీలతోను నిషిద్ధులై మాట్లాడిన వారికి స్వల్పముగ మాత్రమే దండనముండును.

నైషచారణదారేషు విధిర్నాత్మోపజీవిషు
సజ్జంతి హితేనారీర్నిగూఢాశ్చారయన్తిచ
కించిదేవతు దాప్యస్స్యాత్సం భాషాం తాభిరాచరన్
ప్రైష్యాసు చైకభక్తాసురహః ప్రవ్రజితాసుచ
(మను. 8—362—363)

(గాయకుల భార్యల విషయమునను భార్య మానము వలన జీవించువారి భార్యల విషయమునను పై శిక్ష వర్తింపదు. ఏలన: అట్టి పురుషులు భార్యలను తార్చి రహస్యముగ వ్యభిచారములో ప్రవర్తింపజేయుచున్నారు. కాన నీ స్త్రీలతోను, దాసిలతోను, నొకని నుంచుకొనిన వారితోను, రహస్యముగ లేచిపోయిన వారితోను మాట్లాడుచో కొంచెము మాత్రమే సువర్ణదండ ముండును.)

ఇట్టి స్త్రీలే గాక వివాహములేక కేవలము వ్యభిచారమువలన జీవించు స్త్రీలు కూడ స్మృతులలో పేర్కొనియున్నారు. వ్యభిచారముచే వారార్జించు ధనము మిగుల పాపిష్ఠము కావుననే మనుస్మృతి వేశ్యల సొమ్ము తినువాడు స్వర్గాదిపుణ్యలోకముల నుండి దూరుడగునని చెప్పుచున్నది.

గణాన్నం గణికాన్నంచలోకేభ్యః పరికృంతతి

(మను. 4-219)

వేశ్యలను పొందినందులకు మాత్రము రాజదండన లేదు. అన్నిటికంటె హెచ్చు రాజదండన కన్యలను చెరచినందులకు నుత్తమజాతి స్త్రీని పొందినందులకును విధింపబడినది.

యోఽకామాందూషయేత్కన్యాం ససద్యోవధమర్హతి

(మను. 8-364)

(తనను కామింపని కన్యను చెరచిన వానిని వెంటనే వధింపవలెను.)

సజాతావుత్తమోదండ ఆనులోమ్యేతు మధ్యమః
ప్రాతిలోమ్యేవధః పుంసాం నార్యాఃకర్ణాదికర్తనం
(యాజ్ఞ. 2—284)

(సమానజాతికి చెందిన స్త్రీని పొందినచో నుత్తమ దండమును, తక్కువ వర్ణపు స్త్రీని పొందినచో మధ్యమదండమును, నెక్కువ వర్ణపు స్త్రీని పొందినచో మరణదండమును విధింపవలెను. తక్కువ వర్ణపు పురుషుని పొందిన స్త్రీకి నాసికాద్యవయవములను ఖండింపవలెను.)

స్త్రీపురుషు లిరువురును గూడ మాట్లాడుటకు భర్తచే నిషేధింపబడి యున్నపిమ్మట గూడ మాట్లాడుచో వారు వ్యభిచరించినట్లే నిర్ణయించి వ్యభిచారమునకు వేయు శిక్షనే వారికి వేయవలెను.

స్త్రీనిషేధే శతం దద్యాద్ద్విశతం తుదమఃపుమాన్
ప్రతిషేధేతయోర్దండో యథాసంగ్రహణేతథా
(యాజ్ఞ. 2—283)

వ్యభిచారము తఱచుగ ననుమేయమే యగుటచే కొన్ని చేష్టలనుబట్టి స్త్రీ పురుషులు వ్యభిచరించి నట్లెంచవలెనని మనుస్మృతి చెప్పుచున్నది.

ఉపచారక్రియాకేళిః స్పర్శోభూషణవాససాం
సహఖట్వాసనంచైవ సర్వం సంగ్రహణంస్మృతం.
(మను. 8—357)

(గంధపు పూత మున్నగు నుపచారములు, ఆటలు, ఆభరణములను, వస్త్రములను స్పృశించుట, ఒక యాసనము మీద కూర్చుండుట—ఇవి వ్యభిచార చిహ్నములు.)

ఒకని భార్య నొకడు హరించుచుచో నాహరించు వానిని చంపివేయవచ్చునని స్మృతులు చెప్పుచున్నవి. ఒకని భార్యను హరించువానికి 'ఆతతాయి' యని పేరు.

క్షేత్రదారహరశ్చైవషడేత ఆతతాయినః

(యాజ్ఞ. 3—16)

ఆతతాయి నమాయాన్తం హన్యాదేవా విచారయన్

(మను. 8—350)

(మీాదికివచ్చు నాతతాయి నాలోచింపక చంపవలసి నదే.)

పైన వివరింపబడిన విధములచే భార్యను వ్యభిచారాదులనుండి కాపాడు కొనకుండి వ్యభిచరించు భార్యను వదలివేయని వదలివేయనివాడు దోషియగుచున్నాడు. అట్టివాడు వజ్ఞ్యబాహ్యుడు 'మృష్యంతి భయేచోపవృతిం స్త్రీజితానాంచ సర్వశః' అను వాక్యము నిదివఱలో చూచియే యున్నాము.

భార్యయోని నితరు లనుభవించుటకు వీలుకానిదానిగా చేయుటకొరకు ప్రక్రియ ఆపస్తంబ గృహ్యసూత్రములో చెప్పబడినది. ఆప్రక్రియ యిట్లున్నది.

అసంభవేప్సుః పరేషాగ్ స్థూలా
ధారికా జీవచూర్ణాకార యిత్యాత్తరయా
సుప్తాయాస్సుమ్యాధ ఉపవపేత్
సిద్ధ్యర్థేబభ్రు మూత్రేణ ప్రక్షాళయాత

(ఆ. గృ. 15—8—3,4)

(ప్రవాసము వెళ్లువాడు తన భార్య యోనిలో పరుని రేతస్సు పడరాదని కోరుచో నాతడు శతచరణయను పేరుగల పరిసృప విశేషమును రాయి మున్నగు వానిచేత చంపించి దాని చూర్ణము చేయించి యాచూర్ణమును 'అవజ్యామి వధస్వనః' అను మంత్రముచెప్పి భార్య యోనియందు వేయవలెను, అట్లు చేయుచో యోని యనుభవానర్హమగును. తాను భోగింపవలసి వచ్చినపుడు కపిల గోమూత్రముచే యోనిని కడిగినచోనది యనుభవార్హమగును.)

స్త్రీకిష్టము లేకున్నను పురుషుడు బలాత్కారముగ నామె ననుభవించుచో స్త్రీ కెట్టి దోషమును లేదనియు నట్లు పరభుక్తమైన స్త్రీని భర్త వదలివేయ కూడదనియు స్మృతులు చెప్పుచున్నవి. కాని యట్టి బలాత్కార సంభోగముచే గర్భము గల్గుచో నాగర్భము దూషితమగును. సాధారణ వ్యభిచారముచేగల్గు గర్భమెట్టిదియో యాగర్భముగూడ నట్టిదే యగును.

బలాత్కారోపభుక్తావా పరహస్తగతాపివా
నత్యాజ్యాదూషితానారీ నాస్యాస్త్యాగోవిధీయతే
పుష్పకాలముపాసీత ఋతుకాలే నశుద్ధ్యతి
(వశిష్ఠ. 28—33)

(బలాత్కారముగా ననుభవింప బడినట్టిగాని పరుల హస్తమున పడిపోయినట్టిగాని స్త్రీని వదలివేయరాదు. రజోదర్శనము వఱకు నిరీక్షింపవలెను. ఋతుకాలముచే నామె శుద్ధురాలగును)

బలాత్కారముచే ననుభవింపబడిన స్త్రీకి గూడ పరాశరుడు ప్రాజాపత్యవ్రతమను ప్రాయశ్చిత్తము విధించుచున్నాడు. ఆ వ్రతానన్తరమగు ఋతుస్రావముచే నామె శుద్ధురాలగును.

సకృద్భుక్తాతుయానారీ నేచ్ఛన్తీపాపకర్మభిః
ప్రజాపత్యేనశుద్ధ్యేత ఋతుప్రస్రవణేనచ.
(పరా శర. 10—25)

(చాంద్రాయణ జాపత్యాదివ్రతములలో శిరస్సునకు ముండనము చేయించుకొనవలెను. కాని స్త్రీలకు జుట్టుకొనను రెండంగుళములు కత్తిరించిన చాలును. పూర్తిగ ముండనము కూడదు.

సర్వాన్కేశాన్ సముద్ధృత్యఛేదయేదంగుళద్వయం
ఏవం నారీకుమారీణాం శిరసోముండనం స్మృతం.
(పరా. 9—54)

మి థు న క ర్మ

ఋతుకాలములో భర్తను కలయుట స్త్రీకి విధి.

ఋతుస్నాతాతుయా నారీభర్తారం నోపసర్పతి
సామృతానరకం యాతివైధవ్యం చపునఃపునః.

(పరాశర. 4—14(

(ఋతుకాలములోనే స్త్రీ భర్తను పొందదో యామె నరకమునకు బోవును. ఉత్తర జన్మమున వితంతువగును.)

ఈ నియమమే భర్తృ పరముగ కూడ చెప్పబడినది.

ఋతుస్నాతాంతుయో భార్యాం స్వస్థస్సన్నోప గచ్ఛతి
ఘోరాయాంభ్రూణ హత్యాయాంయుజ్యతే నాత్రసంశయః

(పరాశర. 4—15)

(ఆరోగ్యముగ నుండియు కూడ ఋతుస్నాతయైన భార్యను పొందనివానికి భ్రూణహత్యా దోషము వచ్చును.)

ఋతుకాలమనగా రజోదర్శనమైనది మొదలు పదునారు రాత్రులు. అందు మొదటి నాల్గు రాత్రులును, అమావాస్యా పౌర్ణమాసులును చతుర్దశ్యష్టములును విసర్జింప వలసినవి.

ఋతుస్స్వాభావికస్త్రీణాం రాత్రయష్షోడశస్స్మృతాః
చతుర్భిరితరైస్సార్థ మహోభిస్సద్వి గర్హితైః
అమావాస్యా మష్టమీంచ పౌర్ణమాసీంచతుర్దశీం
బ్రహ్మచారీ భవేన్నిత్య మప్యృతౌస్నాతకోద్విజః

(మను 4—128).

తాసామాద్యాశ్చతస్రస్తు నిందితైకాదశీచయా
త్రయోదశీ చశేషాస్తు ప్రశస్తా దశరాత్రయః

(మను 3—47)

(ఋతుదినములలో మొదటి నాల్గు దినములును పదునొకండు పదమూడు దినములును నింద్యములు. మిగిలినవి ప్రశస్తములు.)

పైన పేర్కొనబడిన నింద్య రాత్రులను వదలుచో ఋతు కాలములోనే కాక యితర కాలములో గూడ సంగమము కూడునని గౌతముడు చెప్పుచున్నాడు.

ఋతావుపే యాదనృతౌ చ పర్వవర్జం

(గౌ. 5—1)

ఋతుకాలములోనైనను శ్రాద్ధ భోజనము చేసి కాని శ్రాద్ధము పెట్టిగాని భార్యను పొందరాదు.

శ్రాద్ధందత్వాచభుక్త్వాచ మైథునం యోధిగచ్ఛతి
భవంతి పితర స్తస్య తన్మాసంతే రజోభుజః.

(వసిష్ఠ 10—37)

ఋతు కాలములోనైనను నారోగ్యము లేని భార్యను పొందరాదు.

నాకల్యాం నారీమభిరమయేత్ (గౌ. 9—29)

(స్వస్థురాలుకాని భార్యను పొందరాదు.)

రజస్వలయైయున్న స్త్రీని పొందకూడదని గౌతముడు ప్రత్యేకముగ చెప్పుచున్నాడు.

నరజస్వలాం (గౌ. 9-30)

ఆమె నాలింగనము కూడ చేసికొనరాదు.

నచైనాం శ్లిష్యేత్ (గౌ. 9-31)

భార్యనైనను గూడ ప్రథమ రజోదర్శనము కాకుండ పొందగూడదని 'ఋతావుపేయాత్' అనుటను బట్టియే తేలు చున్నను నట్టి స్త్రీని పొందుట మిక్కిలి నిషిద్ధమని చెప్పుటకు గౌతముడు వేరుగానిట్లు చెప్పుచున్నాడు.

నకన్యాం (గౌ. 9-32)

(రజస్వల కాని దానిని పొందరాదు)

కన్యాశబ్దమున కిచట 'అరజస్వల'యే కాని 'యవివాహిత' కాదను నంశము ప్రకరణమునుబట్టి స్పష్టము. గృహస్థు భార్య నెపుడు పొందవలెననునదియే యిచటి ప్రకరణము.

## ర జ స్వ ల .

వేదకాలపు స్త్రీలలో వివరింపబడిన రజస్వలా నియమములన్నియు స్మృతులలో నున్నవి. తైత్తిరీయ సంహితలో (2-5-1) నివిషయమంతయు కొంచెమించుమించుగ నామాటలతో నే వసిష్ఠస్మృతిలో చెప్పబడినది. (వసిష్ఠ. 5-17, 18, 19, 20) ఆస్మృతివాక్యముల నిటవ్రాయుట పునరుక్తియే యగును గాన వదలివేయబడినవి. రజస్వలను గూర్చి యితరస్మృతులలో మఱికొన్ని వివరములు గూడ గలవు.

ఏహేతువుచేతనైన రజస్వలనుస్పృశించుచో స్నానము చే శుద్ధిగల్గును.

దివాకీర్తిముదక్యాంచ పతితంసూతికంతథా
శవంతత్స్పృష్టినం చైవస్పృష్ట్వాస్నానేనశుద్ధ్యతి.
(మను. 4—219)

రజస్వల లొకరి నొకరు కూడ స్పృశింపరాదు.

స్పృష్ట్వారజస్వలాన్యోన్యం బ్రాహ్మణీబ్రాహ్మణీంతథా
తావత్తిష్ఠేన్నిరాహారా త్రిరాత్రేణైవశుద్ధ్యతి
(పరాశర. 7—14)

(బ్రాహ్మణ రజస్వల లొండొరుల స్పృశించుచో మూడునాళ్లుపవసించిన శుద్ధియగును.

రజఃకాలము మూడు దినములును నొకేవిధముగు నపరిశుద్ధత స్త్రీకుండదు. ఆమూడుదినములలోను నపరిశుద్ధత క్రమముగ నొకనాటికంటె నొకనాడు తగ్గుచుండును.

ప్రథమేహనిచండాలీ ద్వితీయేబ్రహ్మఘాతినీ
తృతీయేరజకీ ప్రోక్తాచతుర్థేహనిశుద్ధ్యతి

(రజస్వల మొదటినాడు చండాలి. రెండవనాడు బ్రహ్మఘాతిని. మూడవనాడు చాకలిది. నాల్గవనాడు శుద్ధురాలగును.)

రజస్వల నాల్గవనాడు శుద్ధినొందును కాని రజస్స్రావమానాటికి నిలిచిపోనిచో నామె భర్తచేయు దైవపిత్ర్యాకర్మలలో పాల్గొనుటకు వీలులేదు. రజస్సు నిలిచిపోయిన పిమ్మట నే దైవపిత్ర్యాది కర్మలను చేసికొనవలెను.

స్నాతారజస్వలాయాతు చతుర్థే హని శుద్ధ్యతి
కుర్యాద్రజోనివృత్తౌతు దైవపిత్ర్యాదికర్మచ
(పరాశర. 7–15)

రోగమువలన రజస్స్రావమగుచో దానివలన స్త్రీయెన్నడును నపరిశుద్ధురాలుకాదు.

రోగేణయద్రజః స్త్రీణామన్వహం హిప్రవర్తతే
నాశుచిస్సాతతస్తేన తత్స్యాద్వైకాలికంమతం
(పరాశర. 7–16)

## నామము

స్త్రీలనామము గూర్చి 'విధూవరార్హత' లనునధ్యాయమున కొంతచూచియుంటిమి. అంతియేకాక:

స్త్రీణాంసుఖోద్యమక్రూర మస్పష్టార్థంమనోహరం
మంగళ్యందీర్ఘవర్ణాన్తమా శీర్వాదాభిధానవత్.
(మను. 2–33)

(స్త్రీలనామము సుఖముగనుచ్చరింప తగినదిగను, క్రూరాక్షరములు లేనిదిగను, స్పష్టమైన యర్థముగలదిగను, మనోహరమైనదిగను, మంగళార్థమైనదిగను, దీర్ఘవర్ణము చివఱకలదిగను, నాశీర్వాదము తెల్పు శబ్దముకలదిగను, నుండవలెను.)

స్త్రీల నామములలోని యక్షరములు బేసి యంకెలో నుండవలెను.

అయుజాతీరం కుమార్యాః (ఆ. గృ. సూ. 15—11)

స్త్రీలను సాధారణముగ పేరు పెట్టి పిలువరాదనియు 'సుభగే' 'భగిని' మున్నగు గౌరవవాచకములచే సంబోధింపవలెననియు విదివఱలో చూచియున్నాము. వారిని నమస్కరించునపుడు కూడ వారి పేరు చెప్పక 'మీాకు' అను సర్వనామములతోనే నమస్కరింపవలెను.

సర్వనామ్నా స్త్రియః (ఆ. ధ. సూ. 1—14—23)

దేవతా సంసర్గము

బాల్యములో స్త్రీని, చంద్రుడు, గంధర్వుడు, అగ్ని యనుభవించుచున్నారు.

రోమదర్శనసం ప్రాప్తే సోమో భుజ్క్తేథ కన్యకాం
రజోదృష్ట్వాతు గంధర్వః కుచౌదృష్ట్వాతు పావకః

(యాజ్ఞ. 1—65)

(కన్యను రోమదర్శన మగుచుండగా సోముడును, రజోదర్శన మగుచుండగా గంధర్వుడును, కుచదర్శన మగుచుండగా నగ్నియు ననుభవింతురు.)

ఈ దేవతలలో నొక్కొక్కరిమె కొక్కొక గుణమును కలుగజేయుచున్నారు.

సోమశ్శౌచందదాస్త్రీణాం గంధర్వశ్శుభాంగిరం
పావకస్సర్వమేధ్యత్వం మేధ్యావై యోషితోహ్యాతః

(యాజ్ఞ. 1—75)

(సోముడు స్త్రీలకు శౌచమును, గంధర్వుడు శుభవాక్కును, అగ్ని సర్వపవిత్రతను గలుగజేయుదురు. కాన స్త్రీలు పవిత్రలు.)

కావుననే మనువు

నిత్యమాస్యం శుచిస్త్రీణాం (మను. 6—130)

(స్త్రీల ముఖ మెప్పుడును పవిత్రమని చెప్పినాడు.)

పై శ్లోకమునుబట్టి రజోదర్శనమైన పిమ్మటనే కుచదర్శన మగునట్లు తెలుచున్నది. కాని కుచదర్శన మైనపిమ్మటనే రజోదర్శనమగుట లోకములో కానసగును. కాన నిచట రజస్సు వచ్చిన కన్యయనగా పరాశరుని నిర్వచనానుసారము పదేండ్లు దాటిన బాలికయని యర్థము చెప్పవలెను.

అష్టవర్షాభవేద్గౌరీ నవవర్షాతు రోహిణీ
దశవర్షాభవేత్కన్యా అతఊర్ధ్వం రజస్వలా
(పరాశర. 7—4)

(ఎనిమిదేండ్ల పిల్లకు గౌరియనియు, తొమ్మిదేండ్ల దానికి కన్యయనియు, నాపై దానికి రజస్వల యనియు నామములు)

పతితత్వము

నీచాభిగమనం గర్భపాతనం భర్తృహింసనం
విశేషపతనీయాని స్త్రీణామేతాన్యపిధ్రువం

(నీచవర్ణపు పురుషుని పొందుట, గర్భము పోగొట్టుకొనుట, భర్తృహింస యనునవి స్త్రీ కత్యంతము పతన హేతువులు)

పతితపురుషునకువలెనే పతితస్త్రీకి కూడ ఘటాశ్రాద్ధము చేయుటను స్మృతులు విధించుచున్నవి.

పతమేవవిధిం కుర్యాద్యోషిత్సుపతితాస్వపి

(మను. 11—188)

వారు చనిపోయిన పిమ్మట నుత్తరక్రియలు నుదకాది దానము నుండదు.)

ఈ క్రిందివారి కుదకదాన మీయనక్కర లేదని మను స్మృతి చెప్పుచున్నది.

పాషండమాశ్రితానాం చచరంతీనాం చకామతః
గర్భభర్తృద్రుహాం చైవసురాపీనాం చయోషితః

(మను. 5—90)

(పాషండులను పొందినట్టియు, కామచారిణులైనట్టియు, గర్భమునకు భర్తకు ద్రోహము చేయునట్టియు, సురాపానము చేయునట్టియు స్త్రీల కుదకదానము లేదు.)

తలచుగ భర్తృవాక్యము పాటింపని స్త్రీకూడ కామచారిణిగనే పరిగణింపబడినది. కాని యామెకు పతితత్వము లేదు. పఙ్క్తిబాహ్యత యున్నది. ఆమె యన్నము నెవ్వరును తినకూడదు.

భర్తృశాసనముల్లంఘ్య యాచ స్త్రీవిప్రవర్తతే
తస్యాశ్చైవనభోక్తవ్యం విజ్ఞేయాకామచారిణీ

ప్రోషితభర్తృక

క్రీడాం శరీరసంస్కారం సమాజోత్సవదర్శనం
హాస్యం పరగృహేయానం త్యజేత్ప్రోషితభర్తృకా
(యాజ్ఞ. I—85)

(భర్త గ్రామములో లేనప్పుడు స్త్రీ యాటలను, నభ్యంగాది శరీరసంస్కారములను, నాటకములు, నుత్సవములు మున్నగు వానిని చూచుటను, హాస్యపుమాటలను, పరగృహమునకు వెళ్లుటను వదలివేయవలెను.)

భర్త ప్రవాసమునుండి చిరకాలమునకు తిరిగిరానిచో స్త్రీ యిల్లువిడచి యాతని వెదకుటకు పోవవలెను. ఆతడు ధర్మకార్యమునకై వెళ్లియుండినచో ఎనిమిదేండ్లును, విద్యకై వెళ్లియుండినచో నాఱేండ్లును, కామార్థమై వెళ్లినచో మూడేండ్లును నాతనికై నిరీక్షించి యనంతర మాతని వెదకుటకు పోవలెను.

ప్రోషితో ధర్మకార్యార్థం ప్రతీక్ష్యోఽష్టౌ నరస్సమాః
విద్యార్థం షడ్యశోర్థం వా కామార్థం త్రీంస్తు వత్సరాన్
(మను 9—76)

వసిష్ఠు డిట్లు చెప్పుచున్నాడు.

ప్రోషితపత్నీ పంచవర్షాణ్యుపాసీత ఊర్ధ్వం పతిసకాశం గచ్ఛేత్.
(వసిష్ఠ. 17—75,76)

(ప్రవాసమునకు వెళ్లినవాని భార్య యయిదేండ్లు నిరీక్షించి పిమ్మట నాతనియొద్దకు పోవలెను.)

చూడరాని సమయములు

కొన్ని యవస్థలలో స్త్రీని చూడరాదు.

నాశ్నీయాద్భార్యయా సార్ధం నైనా మీక్షేతచాశ్నతీః
క్షువంతీం జృంభమాణాం వాసచాసీనాం యథాసుఖం
నాంజంతీం స్వకేనేత్రే నచాభ్యక్తా మనావృతాం
నపశ్యేత్ప్రసవంతీంచ తేజస్కామోద్విజోత్తమః

(మను 43, 44)

ననగ్నాంపర యోషితమీక్షేత (గౌ. 9—49)

(భార్యతో కలసి యన్నము తినరాదు. ఆమె తినుచుండగా చూడరాదు, స్త్రీ తుమ్ముచుండగను, ఆవులించుచుండగను, సుఖముగా కూర్చుని యుండగను, నేత్రములకు కాటుక పెట్టుకొనుచుండగను, అభ్యంగనము చేయుచుండగను ప్రసవించుచుండగను తేజస్కాముడగు ద్విజోత్తము డెవడును చూడరాదు. పరస్త్రీ గుడ్డవిప్పుకొని యుండగా చూడరాదు.)

సంపూర్ణము

# సవరణలు

20 వ పుటలో 11 వ పఙ్క్తిలో 'వాడు నారదుడొక్కడే' యనుటకు బదులు 'వారు నారదగోష్ఠిలులు' అని యుండవలెను. 14 వ ఙ్క్తిలో 'నాతని యభిప్రాయము' అనుటకు బదులు 'వారి యభిప్రాయము' అని యుండవలెను.

43 వ పుటలో 12 వ పంక్తిలో 'మను' అనుమాట యుండకూడదు. 16 వ పంక్తి 'దేవలస్మృతి యీనిర్వచనము నిచ్చుచున్నదని' యని యుండవలెను.

60 వ పుటలో 7 వ పంక్తి ప్రారంభములో 'స్థాలీ పాకమైనపిమ్మట' నని యుండవలెను.

61 వ పుటలో 4 వ పఙ్క్తిలో 'అంతటితో వివాహము పూర్తియగును' అను వాక్యము లేనట్లు భావింపవలెను. 61 వ పుటలో 5 వ పఙ్క్తిలో 'సమావేశనము' అనుటకు పిమ్మట 'ఇది వివాహములో నంతర్భూతమా కాదా యను నంశమును ముందు చూతము' అని యుండవలెను.

65 వ పుటలో 3 వ పఙ్క్తిలో 'చెప్పు' మొదలు 5 వ పంక్తిలో 'నున్నది' అనువఱకును లేనట్లు భావించి దీనికి బదులుగ 'ను పరాశరుడును చెప్పుచున్నారు' అనుదాని చదువవలెను. 65 వ పుటలో 18 వ పంక్తిలో 'యుండును' కు పిమ్మట 'అది యైనను షష్ఠ్యంతము పూర్వమందున్నపుడే

యగును. (పాణిని. 1—4—9) ఇచట మధ్యంతము లేదు కాన నార్షమనుటకు వీలులేదు. అంతేకాక, అని యుండవలెను.

70 వ పుటలో 6 వ పఙ్క్తిలో 'ఆపస్తంబపారస్క రులు' మొదలు 9 వ పఙ్క్తిలో 'నొనగుచున్నది' వఱకు లేనట్లు భావించి యాపిమ్మట నీక్రింది వాక్యములను పూరించు కొనవలెను.

పైన చేయబడిన చర్చయంతయు నాపస్తంబగృహ్య సూత్రము ననుసరించియే చేయబడినది. కాన నిపుడితర గృహ్యసూత్రముల ననుసరించి కూడ నీయంశమును పరిశీ లింతము.

కొన్ని గృహ్యసూత్రములను బట్టి వివాహములోని దీక్షయొక్క పరిసమాప్తిలో దంపతులకు సమావేశనము జరుగవలెనని స్పష్టముగ కలదు.

హిరణ్యకేశి గృహ్యసూత్ర మిట్లు చెప్పుచున్నది.

అథైనాముపయచ్ఛతే (హిరణ్యకేశి 1—7—11—4)

(త్రిరాత్రదీక్షానన్తరము వరుడు వధువును పరుండబెట్టి యోనిని స్పృశించి యామెను పొందును.)

బోధాయనుడు కూడ వ్రతాన్తమందుపసంవేశనము చెప్పుచున్నాడు. ఆతడు వ్రతకాలపరిమితిలో వికల్పములను సూచించియున్నాడు.

అథయదికామయేత శ్రోత్రియం జనయేయమితి ఆరున్ధ
త్యుపస్థానాత్కృత్వా త్రిరాత్రమక్షార లవణాశినా అధఃశ్శా
యినా వ్రతచారిణావాసాతే చతుర్థ్యాంపక్వహోమ ఉపసంవే
శనంచ........అథయదికామ యేతదేవం జనయేయమితి
సంవత్సరమే తద్వ్రతంచరేత్ వ్రతాన్తేపక్వహోమ ఉపసంవేశ
నంచ (బో. గృ. సూ. 1–7–11)

(శ్రోత్రియుడగు కుమారుని కనవలెనని కోరు దంపతులు అరున్ధత్యుపస్థానము మొదలు మూడునాళ్లు క్షారలవణములులేని యాహారము భుజించుచు క్రింద శయనించుచు వ్రతమాచరింపవలెను. నాల్గవనాడు పక్వహోమము, ఉపసంవేశనము జరుగవలెను......దేవతుల్యుని కనవలెనని కోరు దంపతులీ వ్రతమును సంవత్సరకాలము చేయవలెను. వ్రతాన్తమందు పక్వహోమము నుపసంవేశనము జరుగవలెను.)

పెండ్లికూతు రెంతవయస్సు కలదైనను గూడ సమావేశనము జరుగవలసినదేనా యను ప్రశ్న యుదయించును. రజస్వలకాని భార్యను పొందరాదని గౌతముడు చెప్పిన ట్లిదివఱలో చూచియున్నాము. గృహ్యసూత్రకారుల మతములో వధువు రజస్వల యైనదిగనే యుండవలెనని చెప్పుటకు నేమియు నాధారము లేదు. అంతేకాక యించుమించుగ స్మృతులన్నియు రజోదర్శనానన్తర వివాహమును నిషేధించుచున్న ట్లిదివఱలో చూచియున్నాము. కాన నిచటివధువు రజోదర్శనము కాని రజస్వలయై యుండుటకు వీలున్నది.

అనగా పండ్రెండేండ్ల వయస్సుగలదై యుండవలెను. పండ్రెండేండ్లు వచ్చిన బాలికకు రజోదర్శనము కాకున్నను నామె రజస్వల యైనట్లే భావింపవలెనని కొన్ని స్మృతులు సూచించుచున్నవి.

ప్రాప్తేతుద్వాదశే వర్షేయః కన్యాంనప్రయచ్ఛతి
మాసిమాసి రజస్తస్యాః పితాపిబతిశోణితం

(పరాశర. 8—6)

(పండ్రెండవయేడు వచ్చినదగుచుండగా నెవడు కన్యను దానముచేయడో యాతండ్రి ప్రతి మాసమునను నామె రజస్సును త్రాగుచున్నాడు.)

దీనిని బట్టి పండ్రెండేండ్లబాలిక రజస్వలయే యని తేలుచున్నది. పైకి రజోదర్శనము కాకున్నను లోన రజస్స్రావమైనట్లే భావింపవలెనని దీని యభిప్రాయము. ఆవయస్సున వివాహమగు వధువునకు సమావేశనము కావచ్చునని గృహ్యసూత్రకారుల మతమని యూహింపవచ్చును. అంతకుపూర్వము వివాహమగుదానికి సమావేశనము లేదని యీవిధముగ నూహింపవలసి యున్నది. ఈసమావేశనము వివాహాంగమేయని చెప్పవలెను. ఈసమావేశమైన పిమ్మట రజోదర్శనానన్తరము ఋతుకాలములోనే సమావేశనము జరుగును. ఈలోపున జరుగదు. రజోదర్శనానన్తరము చతుర్థరాత్రమున భర్త చేయవలసిన కృత్యమును వర్ణించుచు బోధాయనుడు,

'ఆతీడామెయు పొందును' (అథైనాముపైతి 1-7-44) అని చెప్పియున్నాడు. ఇదియే రెండవ సమావేశనము. ఇచటి నుండి యనిషిద్ధ దినములలో భార్యను పొందుచుండవలెను. వివాహాంగమైన సమావేశనమునకు పిమ్మటనే ఋతుమతి విషయము ప్రస్తావింపబడుటచే వివాహములో సమావేశనమును విధించిన బోధాయనాదుల మతములోగూడ కన్యదృష్టరజస్క కాదని తేలుచున్నది. వివాహము దృష్టరజస్కకే ఋత్వితరకాలములో జరుగుచో గూడనిటి ప్రస్తావన కవకాశమున్నది కాదాయనుటకు వీలులేదు. ఏలన నిట పేర్కొనబడిన రజోదర్శనము ప్రథమమే యనుటకు నిటనీయబడిన రజస్వలా నియమములే సాక్ష్యములు. (1-7-22 నుండి 36 వఱకు) ఈనియమములు వివాహముకాని స్త్రీ రజస్వలయైనను పాటింపవలసినవే కాన వాని నిచటనే చెప్పుటచే వివాహమైనపిమ్మటనే రజస్వలయగుటయే బోధాయనుని దృష్టిలో క్రమమని తేలుచున్నది.

ఆపస్తంబుడు సమావేశనమును వివాహాంగముగ విధింపలేదని యిదివఱలో చూచియుంటిమి. సమావేశనము వివాహాంగమా కాదాయను సంశమున ఋషులలో నభిప్రాయభేదమున్నట్లు గోభిలగృహ్యసూత్రము చెప్పుచున్నది.

ఊర్ధ్వం త్రిరాత్రాత్ సంభవ ఇత్యేకే

(గో. గృ. సూ. 2-5-7)

(త్రిరాత్రానంతరము సమావేశనము కావలెనని కొం దఱు చెప్పుచున్నారు.)

117 వ పుటలో 17 వ పఙ్క్తిలో 'పరాశరస్మృతిలో' అనుటకు బదులు 'పురాణములలో' అని యుండవలెను.

100 వ పుటకును 101 వ పుటకును నడుమ నీక్రింది వాక్యములుండవలెను:

వసిష్ఠుడు అక్షతయోనిని వివాహమాడవలెనని చెప్పు చున్నాడు.

అస్పృష్టమైథునాము వరయవీయసీం (వసిష్ఠ. 8–1)

దీనినిబట్టి వసిష్ఠుని మతములో యక్షతయోనిగనున్న స్త్రీని వివాహమాడవచ్చునని మాత్రమే తెలియుచున్నది. అట్టి స్త్రీ విధంతువగుచో నామెను వివాహమాడవచ్చునని యాతని మతమైనట్లీ క్రిందిశ్లోకమువలన తెలియుచున్నది.

పాణిగ్రాహే మృతేబాలా కేవలం మంత్రసంస్కృతా
సాచేదక్షతయోనిస్స్యాత్పున స్సంస్కారమర్హతి.
(వసిష్ఠ. 17–14)

(మంత్రసంస్కృతయు నక్షతయోనియునగు బాలికకు భర్తమరణించుచో నామె మఱల వివాహ సంస్కారమున కర్హురాలు.)

ఇట్టి పునర్వివాహములో కన్యాదానముండదు. దానమై మంత్రసంస్కారము కాకుండ భర్తను కోల్పోయిన స్త్రీకే మఱల దానము గలదని యీ క్రింది శ్లోకమువలన తెలియుచున్నది.

అద్భిర్వాచా చదత్తాయాం మ్రియేతా దావరోయది
నచమంత్రోపనీతా స్యాత్కుమారీ పితురేవసా

(వసిష్ఠ 17—12)

(కన్య యుదకముచేతను వాక్కుచేతను నీయబడినదై మంత్రసంస్కృత కాకుండగనే భర్తను కోల్పోవుచో నామె తండ్రికే చెందును.)

మంత్ర సంస్కారమైన పిమ్మట నామె తండ్రికి చెందదు. కావుననే మంత్ర సంస్కారము కాకుండిన కాలములో నామె తండ్రికి చెందునని చెప్పబడినది.

నారదుడు కూడ నట్టి స్త్రీకి పునర్వివాహము నంగీకరించినాడు. కాని యామె పునర్భువని యంగీకరించినాడు.

కన్యైవాక్షతయోని ర్యాపాణిగ్రహణదూషితా
పునర్భూః ప్రథమాప్రోక్తా పునస్సంస్కారమర్హతి

(నారద. 12—46)

కావుననే నారదు డట్టి స్త్రీ యేడువిధములగు పరపూర్వలలో నొకతెనుగ నంగీకరించినాడు.

పరపూర్వా స్త్రియ స్త్వన్యాః సప్తప్రోక్తా యథాక్రమం

(నారద. 12—45)

అని యేడువిధముల పరపూర్వలను పేర్కొనుటలో నారదుఁడు పైమాటలను చెప్పియున్నాఁడు.

నారద వసిష్ఠులు దక్క మఱియే స్మృతికారుఁడును నక్షతయోనికా పునర్వివాహము నంగీకరింపలేదు.

101 వ పుటలో 1 వ పఙ్క్తిలో 'ఇంకను ననేకవిధముల' అనుమాటలు లేనట్లు భావింపవలెను.

109 వ పుటలో 16 వ పఙ్క్తికిని 17 వ పఙ్క్తికిని నడుమ నీక్రింది వాక్యములను చేర్చుకొనవలెను :

షండఁడగు భర్తను వదలి మఱొకని వివాహమాడ వచ్చునని నారదస్మృతి చెప్పుట పై ననీయబడిన నారద. 12–80, 81. 13–28 లకు విరుద్ధముగనున్నది.

ఈర్ష్యాషండాదయో యేన్యేచత్వారస్సముదాహృతాః
త్యక్తవ్యాస్తేపతితవత్ క్షతయోన్యా అపిస్త్రియా
(నారద. 12–15)

ఈర్ష్యాషండాదులగు నల్గురును గూడ క్షతయోనిచేత గూడ పతితులవలె విడువబడదగిన వారే.)

ఆక్షిప్తమోఘబీజాభ్యాంకృతే పివతికర్మణి
పతిరన్యఃస్మృతో నార్యా వత్సరార్ధం ప్రతీక్ష్యతు
(నారద. 12–16)

(విగతబీజుఁడును వ్యర్థబీజుఁడును నగు పురుషునిచేత వివాహమాడబడిన స్త్రీ యొక్క సంవత్సరము నిరీక్షించి మఱొక భర్తను వివాహమాడవలెను.)

భర్త చనిపోయిన యువ్రతకు నియోగమును గత పుంస్త్వుడగు భర్తగల యువ్రతకు పునర్వివాహమును కర్తవ్యములని చెప్పుట కేవల మసంగతము. నారదస్మృతిలో నిట్టి యసంగతము లుండుటచేతనే కాణోలు పరాశర యాజ్ఞవల్క్యులు స్మృతులను పేర్కొనుటలో నాస్మృతిలో వదలి వైచిరి.

126 వ పుటలో 15 వ పఙ్క్తికిని 16 వ పఙ్క్తికిని నడుమ నిట్లుండవలెను.

సపిండత్వం సాప్తపురుషం విజ్ఞాయతే

126 వ పుటలో 17 వ పఙ్క్తిలో '4—18' అనుటకు బదులు '4—17—18' అని యుండవలెను.

# అక్షరముల సవరణలు.

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 22 | 7 | వధూవరార్ణతలు | వధూవరార్హతలు |
| 22 | 7 | అధ్యాయములలో | అధ్యాయములో |
| 29 | 8 | పశ్చ్యేద్వాలీ | పశ్యేద్వాలీ |
| 29 | 8 | కలుగవలెననిచో | కలుగవలెననినచో |
| 46 | 7 | పూర్వేషామస్పర్శనే | పూర్వేషామపస్పర్శనే |
| 51 | 16 | మానుపశ్చేతి | మానుషశ్చేతి. |
| 69 | 3 | కొండఱు | కొండటీ |
| 71 | 1 | నీకే | నాకే |
| 74 | 19 | పిచేత్ | పిబేత్ |
| 76 | 14 | నొందను | నొందును |
| 76 | 18 | సంతయా | సంయతా |
| 81 | 12 | బో. ధ. సూ | ఆ. ధ. సూ |
| 81 | 19 | దక్షస్మృతి | దక్షస్మృతి (4—17) |
| 83 | 13 | దక్షస్మృతిలో | దక్షస్మృతిలో (4—3,4,5) |
| 84 | 18 | దంపతులలో ననుకూలత | దంపతులలోన ననుకూలత |
| 86 | 4 | మారును | మారుటు |
| 86 | 10 | గూడినట్టి | గూడినట్టి |
| 87 | 20 | బో. ధ. సూ | ఆ. ధ. సూ |
| 90 | 7 | యజ్ఞేశ్చ | యజ్ఞైశ్చ |
| 96 | 20 | పద్యాస్స | సద్యాస్స |
| 98 | 9 | త్రిణో | త్రిణీ |
| 100 | 7 | శాస్త్రములను | శాస్త్రములలోను |

| పుట | పఙ్క్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 102 | 10 | ఫలైశుభైః | ఫలైశ్శుభైః |
| 103 | 1 | మరణాన్తరమహార్ప్వ | అమరణాన్తమహార్ప్వ |
| 105 | 20 | వితంతువులైన | వితంతువైన |
| 106 | 2 | వితంతువుయవివాహిత | వితంతువవివాహిత |
| 108 | 5 | పతితుడునైన | పతితుడునై |
| 108 | 13 | తదైవా | తథైవా |
| 112 | 2 | లేనిచుట్టి | లేని |
| 113 | 13 | నిక్షేధించి | నిషేధించి |
| 113 | 15 | వితంతువులు | వితంతువు |
| 142 | 8 | రిక్థ | రిక్థం |
| 146 | 7 | ధనమిచ్చుచో | ధనమిచ్చియున్నచో |
| 147 | 20 | వాడుకొనుటలో | వాడుకొను నధికారముండుటలో |
| 149 | 4 | అర్ధస్వ | అర్ధస్య |
| 153 | 2 | సస్త్రీ | నస్త్రీ |
| 153 | 21 | జరడాంధ | జడాంధ |
| 155 | 2 | త్రో | త్ర్యో |
| 159 | 9 | ది | ధి |
| 161 | 4 | గౌరవారువాలు | గౌరవార్వాలు |
| 162 | 2 | త్రా | త్రీ |
| 173 | 10 | ఘ్నర్ | ఘ్న౯ |
| 176 | 14 | నాగ్ని | నాశ్ని |

# రు 12000 లకు
# డిక్లరేషన్ ఆఫ్ ట్రస్టు దస్తావేజు.

———;o:———

ఆ 1931 సం॥ యేప్రియల్ 9 వ తారీఖున, పశ్చిమ గోదావరిజిల్లా కొవ్వూరు రిజస్ట్రేషన్ సబుడిస్ట్రక్టు, కొవ్వూరు గ్రామకాపురస్థులు బ్రాహ్మణులు, హైకోర్టు అడ్వకేటున్ను లేటు వల్లూరి వెంకటకృష్ణయ్యగారి కొమారుడున్ను నగు వల్లూరి సూర్యనారాయణరావు వ్రాసిన డిక్లరేషన్ ఆఫ్ ట్రస్టు దస్తావేజు.

1. నా చిరకాలపు స్నేహితుడును, నిర్మలస్వార్థత్యాగముతో చిన్నతనములోనే తన న్యాయవాదవృత్తిని వదలుకొని, సుమారు 15 సంవత్సరములు కష్టించి తన ధనమున్ను, ఆరోగ్యమును తుదకు తనప్రాణములనుకూడ నర్పించి, కొవ్వూరు గ్రామములో యేబదివేల రూపాయీల స్థిరాస్తితో "ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠ మను" నొక సంస్థావనను నిర్మించినవాడగు లేటు తల్లాప్రగడ సూర్యనారాయణరావుగారు ది 6-8-26 తారీఖున శివసాన్నిధ్యమును చేరినారు. ఆయన నామము ఆచంద్రార్కముగ నుండునట్లు తోడ్పడుట నావిధాయక కృత్యమని యెంచి, నాస్వార్జితమగు తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురం తాలూకా ఆలమూరు కోఆపరేటివ్ ల్యాండు

మార్గేజి బ్యాంకులో నున్న నెం 31 టు 42 నెంబర్లుగల పన్నెండువేల రూపాయీల డిబెంచర్లను యీ క్రింది షరతులతో యీక్రింద వివరింపబోవు విషయములను నెరవేర్చుటకు కోవూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ పాలకసంఘమువారిని ట్రస్టీలుగా యేర్పరచి యీ డిక్లరేషన్ ఆఫ్ ట్రస్టు దస్తావేజును వ్రాయుచున్నాను.

2. పైన ఉదహరించిన డిబెంచర్లమీద ప్రతి ఆరు మాసములకు వచ్చు వడ్డీని మాత్రమే కోవూరు విద్యాపీఠ పాలకసంఘము ఖర్చుచేయుచుండవలెను గాని, అసలు మొత్తము శాశ్వత మూలనిధిగా, యెల్లకాలముండవలెను. ఈడిబెంచర్లగడువానంతరముకూడ వీనిమీదవచ్చు వడ్డీ తగ్గినను, హెచ్చినను కోఆపరేటివు ల్యాండుమార్గేజి బ్యాంకులలోనే యీఅసలు మొత్తము వేయుచుండవలెను. గాని భూములు, యిల్లు మొదలగు స్థిరాస్తులను కొనకూడదు.

3. నేనున్ను, నాయిద్దరు కొమాళ్లు కృష్ణమోహన్ M. A. B. L. Advocate మద్రాసున్ను, జగన్మోహన్ L. E. E. Electrical Engineer బొంబాయిన్ని కోవూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ పాలకసంఘములో జీవితకాలపు మెంబర్లుగా నుండవలెను. ఈముగ్గురులో యెవరైనను అన్య గ్రామములలో నున్నపుడు సదరు విద్యాపీఠపాలక సంఘకార్య నిర్వాహసంఘ సమావేశములలో పాల్గొని వోట్లువేయుట

కును, ఉద్యోగియులుగా నుండుటకును, వారి యిష్టమువచ్చిన వారిని, మరియొకొక్కరిని రాజమహేంద్రవరము, కొవ్వూరు గ్రామస్థులలోనుండి మెంబర్లుగా నామినేటుచేసి, పాలక సంఘ సెక్రటరీకిముందుగా తెలియచేసి, తగిన యేర్పాట్లు చేసికొనుటకు అధికారము కలిగియుందురు.

4. పైన ఉదహరించిన ట్రస్టుఫండుమీాద రాగల వడ్డీలోనుంచి నెలకు యిరువది (రు 20) రూపాయల చొప్పున కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠమున కనుబంధముగా నెలకొల్పబడిన శ్రీవాడ్రేవు జోగాయమ్మ బహద్దరు జమీాందారు గారి కళాశాలాధ్యక్షుని (Principal) గౌరవ భృతిక్రింద నిచ్చుచుండవలెను. ఒకవేళ యీా స్వల్పమొత్తమును తన ఖర్చులకు స్వీకరించుటకు ఆయన యిష్టపడని యెడల సదరు కళాశాలలో పరిశోధనకును (research) అధ్యాపకమునకును (teaching) సమర్థుడగు ఒక పండితుని జీతము క్రింద నీయవలయును.

5. పై మొత్తము పోగా మిగిలిన వడ్డీని ఆంధ్రభాషలో సులభశైలిని పండిత పామరులకు బోధపడునట్లు చిన్నచిన్న గ్రంథములను యీాక్రింద నుదహరించిన విషయములలో విద్యాధికులచేత కొద్ది పారితోషిక మిచ్చిగాని, ఉచితముగా గాని, వ్రాయించి అచ్చొత్తించి ఆంధ్రదేశములోని ముఖ్యమైన గ్రంథాలయములకు ఉచితముగ పంచిపెట్టుటకును, వ్యక్తు

లకు స్వల్పఖరీదుకు విక్రయించుటకును, విద్యాపీఠ పాలకసంఘ మువారు వినియోగించు చుండవలెను.

(ఏ) వేదకాలము నాటినుండి హైందవుల ఆర్యమత ములోని శ్రౌతస్మార్త కర్మకాండల జ్ఞానకాండల పరిణామమును, ప్రస్తుతము వారిలోనున్న సాంఘికాచారములు, విశ్వాస ములు, సాంప్రదాయములు, పట్టింపులు, వర్ణములు, వివాహ ములు, స్త్రీల విద్యాస్వాతంత్ర్యములు, జ్యోతిషములు, మంత్ర తంత్రములు, దేవతలు, దయ్యములు, వర్జములు, లగ్నములు, శకునములు, గ్రహణములు, మంచి చెడుదినములు, అశుచి, ప్రాయశ్చిత్త ఆచారకాండలు, తద్దినములు, దృష్టిదోష, పంక్తి దోష, అంటుదోష, వాయుదోషములు, సాముద్రికము, రస వాదము మొదలగువానిని గురించి మూఢవిశ్వాసములను సప్రమాణముగ ఖండించి విమర్శించుట.

(బి) షోడశ కర్మలను గురించి ఆంధ్ర టీకాతాత్పర్య ములతో గ్రంథములను వ్రాయించి అనవసరమని తోచిన కర్మకాండ విభాగములను సంకుచిత పరచి వేదలక్షణ నేర్చు కొని తగు విమర్శన జ్ఞానమును తెలివియుగల పురోహితులను, దేవాలయార్చకులను, అన్నివర్ణములలోను బయలుదేరునట్లు చేయుట, ప్రపంచములో తక్కిన జాతుల మతములు, సాంఘి కాచారములు, నీతి, వీని పరిణామములు, మొదలగునవి తెలి యజేయుట.

(సి) ఆర్యమతమునుండి బయల్వెడలిన బౌద్ధమతము, జైనమతము, బ్రహ్మసమాజ మతము ఆర్యసమాజ మతము మొదలగు వానిలోని సూత్రములను, తెలియజేసి విమర్శించుట, ప్రపంచములో వ్యాప్తినొందియున్న యితరమతములతో ఆర్యమతమును పోల్చి వానిని గురించి ప్రజలకు బోధించుట.

(డి) మన పూర్వులు రచించిన మానసిక భౌతిక శాస్త్రములు, కళలు, అధునిక పరిశోధనలను బట్టి విమర్శించి, వానిలో అవసరమగు మార్పులనుజేసి మనదేశీయ పారిభాషిక పదములతో ఆంధ్రములో గ్రంథములను వ్రాయించుట.

(ఇ) గాంధిమహాత్ములవారి సత్యాగ్రహ తత్వములు, వానిలో నిమిడియున్న వేదాంతము, నానారాష్ట్రపరిపాలనా విధానములు, ప్రపంచములో యిదివరకు జరిగిన, యిప్పుడు జరుగుచున్న సమస్త సాంఘిక రాజకీయార్థిక విప్లవములు, ఉద్యమములు, గ్రామ పునర్నిర్మాణము, సహకార, అసహకారోద్యమములు, నానావిధ సమిష్టివాదములు, మొదలగు వానిని గురించి గ్రంథములను ప్రచురించుట.

6. పైన వ్రాసిన విషయములను నిర్భయముగను, నిర్మొగమాటముగను, సత్యము తప్పకుండ సప్రమాణముగ సంపూర్ణ మనస్స్వాతంత్ర్యములతో (Free thought) ఆంధ్రు

లయెదుట వారి భావములో పెట్టుచుండవలెను. ఏగ్రంథముగాని రూపాయకంటె హెచ్చు వెలను కలిగియుండకూడదు. నాజీవితకాలములో నే నంగీకరించిన గ్రంథములనే ప్రచురించవలెను. నాజీవితానంతరము విద్యాపీఠ పాలక సంఘమువారు యిప్పు డేర్పరచు పండితబృందము (Academic Council) చే అంగీకరింపబడిన పిమ్మట ఆసంఘమువారి శాశ్వతసభ్యుల మెజారటీ వారి యామోదమును బడయనిదే యేగ్రంథముగాని వెలువడకూడదు.

7. నాపై యుద్దేశములను నెరవేర్చుటకు యితరదాతలనేకమంది ట్రస్టుఫండుకు సహాయపడుదురని నేను నమ్ముచున్నాను. అప్పటి దేశకాల పరిస్థితులనుబట్టి పైన నేను తెలియజేసిన విషయములలో దేనికైనను యీనిధిమీద వచ్చు వడ్డీని అంతగాని కొంతగాని వీలుకొలది ప్రజోపయోగమునకు వినియోగించవచ్చును. సాలుకు ఒక చిన్న గ్రంథము వెలువడినను నాయాత్మ తృప్తి నొందగలదు.

8. నేనిదివరకు ది 16–5–1928 తేదీని కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠమునకు కొవ్వూరులో నాయింటిమీద రిజస్టరుడీడ్డు ద్వారా యేర్పరచిన రు 120 లు వార్షికము యీట్రస్టుడీడ్డు మొత్తములోనే చేరి యున్నందున సదరు చార్జి రద్దు అయినట్లు భావించుకొని యీట్రస్టును ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ పాలక సంఘమువారు అంగీకరించవలెను.

9. ఏకారణమువలన నయినను నాపై యుద్దేశములను కొవ్వూరు, ఆంధ్రగీర్వాణ విద్యాపీఠ పరిపాలక సంఘము వారు సరిగా నెరవేర్పజాలనిచో ఆంధ్రవిశ్వ విద్యాలయాధికారులు శివిల్ కోర్టుగుండా యీట్రస్టుఫండును స్వాధీనము చేసికొని దీనిలో నుదహరించిన కార్యవర్గములను సక్రమముగ యీ కోవ్వూరు విద్యాపీఠములోనే నెరవేర్చుచుండవలెను.

ఇది నాసమ్మతిని నా స్వదస్తూరీని వ్రాసియిచ్చిన డిక్లరేషన్ ఆఫ్ ట్రస్టు దస్తావేజు.

అడ్వకేటు వల్లూరి సూర్యనారాయణరావు,

సెక్రటరీ

ఆంధ్రగీర్వాణ విద్యాపీఠము

కొవ్వూరు

పశ్చిమ గోదావరిజిల్లా

9—4—31.

# APPENDIX II                రెండవ అనుబంధము.

—: వ్రాయతగిన కొన్ని విషయముల పట్టిక :—

1. వర్ణములు. 2. అంతర్వర్ణ, అంతర్జాతీయ వివాహములు 3. వితంతు, రజస్వలానంతర వివాహములు— 3. వావి 4. వివాహచ్ఛేదనము. 5. స్త్రీలవిద్యా స్వాతంత్ర్యములు, 6. ప్రకృతి పరిణామము. 7. మతపరిణామము. 8 నీతి పరిణామము. 9. నీతిమత సంబంధము. 10. విగ్రహారాధనము. 11. పితృపూజ. 12. ఆర్యబ్రాహ్మణ మతములు. 13. పునర్జన్మ. 14. స్వర్గనరకములు. 15. దేవుళ్లు దయ్యములు. 16. దైవప్రార్థనము. 17. పురాణములు. 18. హైందవ ధర్మశాస్త్రకాలనిర్ణయము. 19. దైవస్వరూప పరిణామము. 20. అవతారములు. 21. ఆత్మస్వరూప పరిణామము. 22. మంత్రతంత్రములు. 23 కర్మజ్ఞాన భక్తి మార్గములు. 24. యోగవిద్య. 25. దృష్టిపంక్తి అంటు వాయుదోషములు. 26. మంచిచెడు దినములు. 27. శకునములు, వర్జములు, లగ్నములు. 28. జ్యోతిషము. 29. యజ్ఞములు, యాగములు. 30. శుద్ధాద్వైత జడాద్వైతములు. 31. అహింస, జీవహింస. 32. ఆత్మహత్య. 33. విశ్వాస సంశయయాత్మ తత్వములు. 34. దానధర్మములు. 35. అవక్వశాకాహారము. 36. సమిష్టివాదములు. 37. మహాత్మగాంధిగారి సత్యాగ్రహ తత్వము. 38. రాజకీయ, సాంఘిక విప్లవములు. 39. భౌతిక శాస్త్రములు. 40. బాలుర విద్యావిధానము.

# వేదకాలపుస్త్రీలు

నేటి హిందూసంఘము నాందోళనపఱుచుచున్న స్త్రీల వారసత్వము అధికారములు వర్ణాంతర వివాహములు, మొదలగు ననేక విషయములలో వేదకాలపుస్త్రీల స్థితినిగురించి ఈ గ్రంథము చాల ఉపయోగకరములగు విషయముల దెల్పుచున్నది. వివాదాస్పదములగు విషయములయం దిరుపక్షముల వారి వాదనలుగూడ సంగ్రహముగ సూచింపబడెను. ప్రాచీనార్య సంప్రదాయముల నెరుగగోరువారికీ గ్రంథము చాల నుపయోగకరముగ నుండుననుట నిస్సంశయము.

(23–12–1933 నాటి ఆంధ్రపత్రిక)

Mr. Purushottam makes a comprehensive survey of the conditions of women in Vedic India. Every aspect is so well studied that the book is bound to prove an authoritative and reliable work on the subject. Mr. Purushottam has done well to quote verbatim the stanzas from the Vedas and the other texts and to give below each its meaning, so that there may be no ambiguity regarding his own position and the grounds on which it is based. Wherever it is a case of surmise or indirect inference, he has given the reasons for the conclusions he has adopted.

(The Hindu dated 29–5–1934)